epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

SAMAYAM

సంపుటి: 19 | సంచిక: 33 | ఎడిటర్ : విక్రం కుమార్ | ఆదివారం 9 నవంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |

సమయం

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

# రియాజ్‌ది ఎన్‌కౌంటర్ కాదు లాకప్‌డెత్



- రియాజ్ ఎన్‌కౌంటర్ ఫేక్
- పోలీసులే రియాజ్ కొట్టి చంపేశారు
- ఎన్‌కౌంటర్‌గా కట్టుకథలు అల్లుతున్నారు
- ఘటనపై సమగ్ర విచారణ జరిపించండి
- పోలీసులపై రియాజ్ ఫ్యామిలీ ఆరోపణలు



03

**హైదరాబాద్, నవంబర్ 8:** తెలంగాణలో సంచలనం సృష్టించిన రియాజ్ ఎన్‌కౌంటర్ కేసు మరో మలుపు తిరిగింది. ఇది కచ్చితంగా ఫేక్ ఎన్‌కౌంటర్ అని రియాజ్ ఫ్యామిలీ ఆరోపిస్తోంది. ఆయన్ని కాల్చేసి తర్వాత ఎన్‌కౌంటర్‌గా కట్టుకథలు అల్లుతున్నారని విమర్శిస్తున్నారు. ప్రమోద్‌ను కూడా హత్య చేసింది రియాజ్ కాదని అనుమానం వ్యక్తం చేశారు. కానిస్టేబుల్ ప్రమోద్ హత్యపై లోతుగా విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. కానిస్టేబుల్ ప్రమోద్‌ను నిజంగా

మిగతా 2 లో



# వేడెక్కుతున్న బీహార్ ఎన్నికల ప్రచారం

## బీహార్ చేపల కోసం పెద్దపెద్ద వాళ్లు వస్తున్నారు

## రాహుల్ చేపలవేటపై మోడీ వ్యంగ్యాస్త్రాలు




**పాట్నా:** బిహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికార, విపక్ష పార్టీలు పదునైన వ్యాఖ్యలతో విమర్శలు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ఇటీవల చేపలవేట కోసం మత్స్యకారులతో కలిసి చెరువులోకి దిగారు. దానిని ఉద్దేశించి ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. బిహార్ చేపలను చూడటానికి పెద్దపెద్దవాళ్లు వస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో మునిగిపోయేందుకు ఇప్పటి నుంచే ప్రాక్టీస్ చేస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. బిహార్‌లో చేపలు పట్టడానికి ఇప్పుడు పెద్దపెద్ద వాళ్లు వస్తున్నారని, కొందరు ఎన్నికల్లో మునిగిపోయేందుకు ప్రాక్టీస్ చేస్తున్నారని ప్రధాని మోడీ ఛలోక్తులు విసిరారు. కాంగ్రెస్ సీనియర్

మిగతా 4 లో

# కుప్పం దశ మార్చేలా ప్రాజెక్టులు

## ఇండస్ట్రియల్ హబ్‌గా కుప్పం



- 22,330 మందికి ఉపాధి కల్పన
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి
- పలు పరిశ్రమలకు శంకుస్థాపన
- వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం

ముఖ్యమంత్రి చంద్రబాబు తన సొంత నియోజకవర్గమైన కుప్పం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. పారిశ్రామిక ప్రగతికి పెద్దపీట వేస్తూ, ఒకే రోజు ఏకంగా ఏడు భారీ పరిశ్రమలకు వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. రూ.2,203 కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చే ఈ పరిశ్రమల కోసం 241 ఎకరాల స్థలం కేటాయించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 22,330 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఒకప్పుడు అత్యంత వెనుకబడిన ప్రాంతంగా ఉన్న కుప్పాన్ని పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు.

**అమరావతి :** ముఖ్యమంత్రి చంద్రబాబు తన సొంత నియోజకవర్గమైన కుప్పం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. పారిశ్రామిక ప్రగతికి పెద్దపీట వేస్తూ, ఒకే రోజు ఏకంగా ఏడు భారీ పరిశ్రమలకు వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. రూ. 2,203 కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చే ఈ పరిశ్రమల కోసం 241 ఎకరాల స్థలం కేటాయించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 22,330 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఒకప్పుడు అత్యంత వెనుకబడిన ప్రాంతంగా ఉన్న కుప్పాన్ని పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఈ సందర్భంగా

మిగతా 5 లో

## ఎమ్మెల్యేలు సరిగ్గా పనిచేయడం లేదు

### 48 మందిలో నిర్లక్ష్యం

- ప్రభుత్వ కార్యక్రమాల పట్ల తీవ్ర అశ్రద్ధ
- వికపోవడంతో నోటీసులు జారీ చేస్తాం
- పెన్షన్ల పంపిణీకీ దూరం ఉంటున్నారు
- పనితీరు మారకపోతే పక్కనపెట్టేస్తాం
- ఎమ్మెల్యేలపై సీఎం చంద్రబాబు సీరియస్



## పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య ఘర్షణలు

శాంతి చర్చలు విఫలమవడంతో ఘర్షణ

సైనికులు, పౌరులతో సహా వందల మంది మృతి

.. వివరాలు 4లో

## నిజం ఎప్పుడూ ఒంటరిగా ప్రయాణించదు!?



5

ప్రస్తుతం దేశం, రాష్ట్రాలలో విమర్శించేవారిపై, అన్యాయాన్ని ప్రశ్నించేవారిపై ఉద్దేశపూర్వకంగా (చెడు ఉద్దేశంతో) కేసులు నమోదు చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.



## బీహార్‌లో ఎన్నికల ఫలితాల తర్వాతే నిర్ణయం

ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ వెల్లడి

.. వివరాలు 3లో

## రహదారులకు మహర్దశ

రూ.60,799 కోట్లతో రోడ్ల నిర్మాణం



# సొంత పార్టీకి ఉచ్చు బిగించిన ముఖ్యమంత్రి!

తెలంగాణలో అధికారాన్ని చేపట్టిన కీలక నేత, తన వ్యక్తిగత పీఠం భద్రత కోసం సొంత పార్టీ జాతీయ విజయానికి విఘాతం కలిగించిన సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో ఉద్దేశపూర్వకంగా చేసిన ముస్లిం ఓటు బ్యాంక్ వ్యాఖ్యలు, కాంగ్రెస్ హైకమాండ్‌కు ఒక రాజకీయ బాంబులా పేలాయి.

"కాంగ్రెస్ ఉంటేనే ముస్లింలకు ఇజ్జత్" అనే ఈ అత్యంత వివాదాస్పద ప్రకటనలు, బీహార్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ వ్యతిరేక శక్తులకు వైరల్ అస్త్రంగా మారాయి. హైకమాండ్‌కు ఎదురుదెబ్బ తగలడం ఖాయమని తెలిసీ, బీహార్‌లో కాంగ్రెస్ గెలవవద్దు అనే అంతర్గత ఎజెండాతోనే ఈ వ్యాఖ్యలు జరిగాయని రాజకీయ వర్గాలలో తీవ్ర చర్చ నడుస్తోంది. తన అధికార కేంద్రం నుంచి దూరం జరిగే ప్రమాదాన్ని పసిగట్టి, ఆ పతనాన్ని ఆపేందుకు సొంత పార్టీపైనే ద్రోహానికి పాల్పడినట్లు స్పష్టమవుతోంది.

– సమయం ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్

10

# ఆట మొదలు పెడతా.. తడాఖా చూపిస్తా

కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం ఆగం

మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



2

## వైఎస్ వివేకానంద హత్య కేసులో కీలక మలుపు

ఇద్దరు పోలీసు అధికారులపై కేసు నమోదు



2



# నల్గొండ జిల్లాలో ఘోర ప్రమాదం

**పూర్తిగా దగ్ధమైన ఇన్నోవా కారు!**

**నల్గొండ, నవంబర్8 :** తెలంగాణలోని నల్గొండ జిల్లాలో ఈ ఉదయం పెను ప్రమాదం తప్పింది. వేగంగా వెళ్తున్న ఓ ఇన్నోవా కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. క్షణాల్లోనే కారులో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. అయితే, అదృష్టవశాత్తు కారులో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే.. చిట్యాల మండలం గుండ్రాంపల్లి వద్ద హైదరాబాద్-విజయవాడ 65వ జాతీయ రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. ఓ ఇన్నోవా కారు యూటర్న్ తీసుకునే క్రమంలో అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఆ వేగానికి కారు రోడ్డుపైనే పల్టీలు కొట్టింది. వెంటనే ఇంజిన్‌లో మంటలు చెలరేగి కారు మొత్తానికి వ్యాపించాయి. ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే ప్రయాణికులు అప్రమత్తమై కారులో నుంచి బయటకు దూకేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. కానీ, అప్పటికే కారు పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. కారును రోడ్డుపై నుంచి తొలగించే వరకు భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జూబ్లీహిల్స్ పరిధిలో పోలీస్ ఆంక్షలు

**ప్రకటన జారీ చేసిన కమిషనర్ సజ్జన్నార్**

**హైదరాబాద్, నవంబర్ 8:** జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్ దృష్ట్యా ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. ఆదివారం సాయంత్రం నుంచి పోలింగ్ జరుగనున్న మంగళవారం సాయంత్రం వరకు అమల్లో ఉంటాయి.ఈ మేరకు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ కీలక ఆదేశాలు జారీ చేశారు. నియోజకవర్గం పరిధిలో 9వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి పోలింగ్ జరగనున్న 11వ తేదీ మంగళవాం సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు అమల్లోకి వస్తాయి. అలాగే తిరిగి ఓట్ల లెక్కింపు జరిగే 14న ఉదయం 6 గంటల నుంచి 15 సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. నిర్దేశించిన సమయాల్లో మద్యం దుకాణాలన్నీ మూసి వేయాలని, హోటళ్లు, రెస్టారంట్‌లు, క్లబ్బులు మూసివేయాలని ఆదేశించారు. శాంతిభద్రతల నేపథ్యంలో నియోజకవర్గం వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఐదుగురు, అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం నిషేధమన్నారు. ఓట్ల లెక్కింపు రోజున రహదారులు, జనావాసాల్లో టపాసులు పేల్చడం నిషేధమని, ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.

# రహదారులకు మహర్దశ

**రూ.60,799 కోట్లతో రోడ్ల నిర్మాణం • మంత్రి కోమటిరెడ్డి వెల్లడి**



**హైదరాబాద్, నవంబర్ 8:** రాష్ట్ర వ్యాప్తంగా రహదారులకు మహర్దశ ప ట్టనుందని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. వీటి నిర్మాణానికి సర్కార్ శ్రీకారం చుట్టింది. దాదాపు రూ.60,799 కోట్లతో రోడ్లను నిర్మించాలని నిర్ణయం తీసుకుంది. ఈ మే-రకు నిధుల మంజూరు సర్కార్ ఆమోద ముద్ర వేసింది. రహదారుల నిర్మాణానికి నిధుల మంజూరు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.తెలంగాణ చరిత్రలో ఎన్నడూ లేని రికార్డుగా అభివర్ణించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధితో తెలంగాణ బహుళజాతి సంస్థల కేంద్రంగా మారబోతోందని తెలిపారు. హైదరాబాద్ ? విజయవాడ హైవే విస్తరణకు రూ.10,400 కోట్లు కేటాయించడం జరిగిందని... దీనిని ఎనిమిది లైన్లుగా మార్పు చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణానికి రూ.36,000 కోట్లు మంజూరు అయ్యిందని.. ఇది రాష్ట్రానికి గేమ్‌చేంజర్ ప్రాజెక్ట్ అని వెల్లడించారు. రహదారులు లేని గ్రామాల్లో కొత్త రోడ్లు, సింగిల్ రోడ్ల స్థానంలో డబుల్ రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. హెచ్‌ఏఎమ్ ప్రాజెక్ట్ కోసం రూ. 11,399 కోట్లు కేటాయించడం జరిగిందని.. ఇందు కోసం త్వరలోనే టెండర్లను పిలువనున్నట్లు చెప్పారు. మన్ననూరు ? శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ 52 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి రూ. 8,000 కోట్లు కేటాయించడం జరిగిందని... అలాగే ఫ్యూచర్ సిటీ? అమరావతి-బందరు పోర్ట్ గ్రీన్ ఫీల్డ్ హైవేకు రూ.20,000 కోట్లు కేటాయించినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు.

# నడిరోడ్డుపై నాటు కోళ్లు వదిలారు

**ఎవరికి తోచిన విధంగా వారు ఎత్తుకెళ్లారు**



**హన్మకొండ, నవంబర్ 8:** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో గమ్మత్తయిన సంఘటన చోటుచేసుకుంది. రెండు వేల నాటు కోళ్లను గుర్తుతెలియని వ్యక్తులు వదిలివెళ్లారు. సిద్దిపేట-ఎల్కతుర్తి రహదారి వెంట పొలాల్లో వీటిని విడిచిపెట్టారు. దీంతో నాటు కోళ్లను తెచ్చుకోవడం కోసం జనం ఎగబడ్డారు. అందినకాడికి ఇళ్లకు తీసుకెళ్లారు. వీటితో బిర్యానీ వండుకుని ఎంజాయ్ చేశారు. అయితే ఇందులో ఏదైనా కుట్ర కోణం ఉందా అన్న అనుమానాలు వ్యక్తం అయ్యాయి. అయితే.. ఇంత పెద్దఎత్తున నాటు కోళ్లను ఎవరు, ఎందుకు వదిలిపెట్టారో తెలియాల్సి ఉంది. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పలు కోళ్లను పశువైద్యాధికారిణి దీపిక వద్దకు తీసుకువెళ్లారు. కోళ్లకు ఎలాంటి వ్యాధి లక్షణాలు లేవని పశువైద్యాధికారిణి తెలిపారు.

# రేవంత్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు

- శుభాకాంక్షలు తెలిపిన నరేంద్ర మోడీ
- నేతలు, సినీ, క్రీడా ప్రముఖులు విష్



న్యూఢిల్లీ, నవంబర్ 8: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం 56వ పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు చెబుతున్నారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ .. తెలంగాణ సీఎం కు బర్త్ డే శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్ ఆయు ఆరోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని కోరుతూ ట్వీట్ చేశారు. అటు రేవంత్ రెడ్డి రాజకీయ గురువు ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు రేవంత్ రెడ్డికి ఎక్స్ వేదికగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అటు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఏపీ మంత్రి నారా లోకేష్ బర్త్ డే విషెస్ తెలియజేసారు. అటు సినీ రంగం నుంచి మాజీ కేంద్ర మంత్రి మెగాస్టార్ చిరంజీవి రేవంత్ రెడ్డికి బర్త్ డే విషెస్ తెలిపారు. అటు సినీ రంగం నుంచి గతంలో లాగా ఎవరు బర్త్ డే విషెస్ ఇప్పటి వరకు చెప్పలేదు. తర్వాత చెబుతారా అనేది చూడాలి. అటు రేవంత్ మంత్రివర్గ సహచరులు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో పాటు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ .. రేవంత్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతారా లేదా అనేది చూడాలి. రేవంత్ రెడ్డి 1969 నవంబర్ 8 ఉమ్మడి పాలమూరు జిల్లాలో జన్మించారు. మహబూబ్ నగర్ వంగూరు మండలం కొండారెడ్డిపల్లి రేవంత్ రెడ్డి స్వగ్రామం.ఎనుముల రేవంత్ రెడ్డి కుటుంబం చాలా పెద్దది. రేవంత్‌కు ఏడుగురు సోదరులు, ఒక సోదరి ఉన్నారు. రేవంత్ రెడ్డికి భార్య, కుమార్తె, అల్లుడు మనవడు రియాన్ష్ రెడ్డి ఉన్నారు. రేవంత్‌కు రాజకీయంగా, వ్యాపారపరంగా సోదరులు అండగా నిలుస్తుండడం విశేషం. తొలి దశలో రేవంత్ రెడ్డి పెయింటింగ్ పని చేశారని అక్కడి గ్రామస్తులు, అతడి సన్నిహితులు చెబుతున్నారు. అనంతరం వ్యాపారం చేస్తూ రాజకీయాల్లోకి వచ్చి విజయవంతమయ్యారు. ఏబీవీపీ కార్యకర్తగా పనిచేసిన రేవంత్ రెడ్డి.. ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన 'జాగృతి' అనే వార పత్రికలో పని చేశారు. ఆ క్రమంలో సంఘ్ పరివార్ తో రేవంత్‌కు మంచి అనుబంధం ఉంది. తదనంతరం అప్పటి టీఆర్ఎస్ పార్టీ (బీఆర్ఎస్)లో చేరి కార్యకర్తగా పని చేశారు. బీఆర్ఎస్ పార్టీలో రేవంత్ గులాబీ కార్యకర్తగా చురుగ్గా పాల్గొన్నారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు, ప్రస్తుత మాజీమంత్రి హరీశ్ రావు వెంట రేవంత్ రెడ్డి తిరిగాడు. స్వతంత్ర అభ్యర్థిగా జెడ్పీటీసీగా పోటీచేసిన రేవంత్ రెడ్డి అప్పటి టీఆర్ఎస్ పార్టీ మద్దతుగా గెలిచారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీలో చేరారు.తెలుగుదేశం పార్టీ నుంచి కొడంగల్ ఎమ్మెల్యేగా గెలిచారు. ఎమ్మెల్సీ ఓటు విషయంలో ఓటుకు నోటుకు పాల్పడుతూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. ఈ కేసులో అరెస్ట్ కావడం రేవంత్ జీవితాన్ని కీలక మలుపు తిప్పింది. ఇప్పటికీ ఈ కేసులో కోర్టులో పెండింగ్ లో ఉంది. అదృష్టం వెన్నంటి ఉండి చిన్న వయసులో పీసీసీ అధ్యక్షుడిగా ఉంటూ తెలంగాణ రాష్ట్రంలో తొలిసారి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురాగలిగారు. దీంతో ఆయన తెలంగాణ రెండో ముఖ్యమంత్రి అయ్యారు. రేవంత్ రెడ్డి దూకుడుగా వ్యవహరించడం.. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం.. దురుసు ప్రవర్తన, భాష అనేది రేవంత్ రెడ్డికి చెడ్డపేరు తీసుకొస్తున్నాయి.




# రియాజ్‌ది లాకప్‌డెత్

**రియాజ్ ఎన్‌కౌంటర్ ఫేక్**

**పోలీసులే రియాజ్ కొట్టి చంపేశారు**

**ఎన్‌కౌంటర్‌గా కట్టుకథలు అల్లుతున్నారు**

**ఘటనపై సమగ్ర విచారణ జరిపించండి**

**పోలీసులపై రియాజ్ ఫ్యామిలీ ఆరోపణలు**

**హైదరాబాద్, నవంబర్ 8:** తెలంగాణలో సంచలనం సృష్టించిన రియాజ్ ఎన్‌కౌంటర్ కేసు మరో మలుపు తిరిగింది. ఇది కచ్చితంగా ఫేక్ ఎన్‌కౌంటర్ అని రియాజ్ ఫ్యామిలీ ఆరోపిస్తోంది. ఆయన్ని కాల్చేసి తర్వాత ఎన్‌కౌంటర్‌గా కట్టుకథలు అల్లుతున్నారని విమర్శిస్తున్నారు. ప్రమోద్‌ను కూడా హత్య చేసింది రియాజ్ కాదని అనుమానం వ్యక్తం చేశారు. కానిస్టేబుల్ ప్రమోద్ హత్య పై లోతుగా విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. కానిస్టేబుల్ ప్రమోద్‌ను నిజంగా హత్య చేసిన వాడిని అరెస్ట్ చేసి.. ప్రమోద్ కుటుంబానికి న్యాయం చేయాలని అంటున్నారు. రియాజ్ కుటుంబంపై ఇప్పటికి వేధింపులు జరుగుతున్నాయని.. ఆ కుటుంబంలోని చిన్న పిల్లలను రోడ్ల మీద వేధిస్తున్నారని.. దీనిపై వాళ్ళకు న్యాయం జరగాలి అభ్యర్థిస్తున్నారు. మొత్తం కేసులో ఆసిఫ్ పాత్ర ఉందని రియాజ్ కుటుంబ సభ్యులు అనుమాన పడుతున్నారు. అతనిపై లోతుగా విచారణ చేయాలన్నారు. ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌లో భాగమైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పోలీసులకు తాము వ్యతిరేకం కాదని ఈ ఎన్‌కౌంటర్‌ను కొందరు పోలీసులు కుట్రపూరితంగా చేశారని మండిపడుతున్నారు. సీబీఐతో విచారణ జరిపించాలని తెలంగాణ ప్రభుత్వానికి అభ్యర్థించామని వారు వినకపోయే సరికి జాతీయ స్థాయిలో పోరాడుతున్నామని అన్నారు. మీడియాతో మాట్లాడిన సందర్భంగా రియాజ్ తల్లి భావోద్వేగానికి గురయ్యారు. "నా కొడుకు మెడ విరిచేశారు. పొట్టలో నుంచి పేగులు బయటకు వచ్చాయి. దారుణంగా చంపేశారు. నా కొడుకు నిజంగా హంతకుడు అయితే ఆ ఆధారాలు చూపించండి. నాకు మనశ్శాంతిగా ఉంటుంది. ఏ తల్లికైన కొడుకు కొడుకేగా.. నా కొడుకుకు జరిగినట్లు ఎవరికి జరగకూడదు. నా కొడుకు చనిపోయినప్పుడు, అంతిమ యాత్రలో తీసుకెళ్తుంటే పటాకులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. నా కొడుకు అంతిమ యాత్రలో పోలీసులు వచ్చి ఎక్కడా ఆగనివ్వకుండా పంపించేశారు. శ్మశాన వాటికలో అంత్యక్రియలు చేస్తుంటే, ఇక్కడ చేయకూడదు అని వెళ్లగొట్టారు. ఎవరి కొడుకుకైనా ఇలాంటి పరిస్థితి రాకూడదు." అని కంటతడి పెట్టుకున్నారు. రియాజ్ ఎన్‌కౌంటర్ ఘటనపై సోషల్ యాక్టివిస్ట్ మాట్లాడుతూ... రియాజ్ ఒక పోలీస్ అధికారిని నిజంగా చంపితే అతను నిజామాబాద్‌లో ఉంటాడా.. వాళ్ళ ఫ్యామిలీని తీసుకొని పారిపోడా? పోలీసులు తన కుటుంబాన్ని హింసిస్తున్నారని రియాజ్ తానే స్వయంగా లొంగిపోయాడు. లొంగిపోయిన తరువాత పోలీసులు అతనిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి, చిత్రహింసలు పెట్టారు. అతను కస్టడీలోనే చనిపోయాడు. రియాజ్ చనిపోయాక అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి, 407 ఖైదీల రూంలో పెట్టారు, 4వ ఫ్లోర్‌లో ఉన్న రోగులు అందరిని ఖాళీ చేయించారు. చేతులు కట్టేసి ఉంటాయి.. రియాజ్ మెడ విరిగిపోయింది, శరీరం మీద తీవ్ర గాయాలు ఉన్నాయి. అలాంటి మనిషి పోలీసులను ఎదిరించి గన్ లాక్కుంటాడా?. అలా చెప్పి, పోలీసుల ఉన్నతాధికారుల సమక్షంలో మృతదేహానికి మూడు బుల్లెట్లను కాల్చారు. రియాజ్ కస్టడీలో బతికే ఉంటే ఆసుపత్రికి తీసుకెళ్లినప్పుడు నడుచుకుంటునో, వీల్ చైర్‌లోనో తీసుకెళ్తారు కదా.. ఆ సీసీటీవీ ఫుటేజ్ చూపించడం లేదు. మృతదేహం చూశాక అతని మెడ ఊగిపోతోంది, ముక్కు విరిగిపోయింది, పెదాలు పగిలిపోయాయి. దీనిపై సీబీఐ ఎంక్వైరీ వేసి నిజానిజాలు బయటకు చెప్పాలి. అని అన్నారు.

# ఆట మొదలు పెడతా.. తడాఖా చూపిస్తా

**కాంగ్రెస్, బిఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఆగం**

**మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**



**హైదరాబాద్, నవంబర్ 8:** కాంగ్రెస్ పాలనలో ప్రజలు అవస్థలు పడుతున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. రానున్న రోజుల్లో ఆట మొదలు పెట్టినప్పుడు తానేంటో చూపిస్తానని.. బీఆర్ఎస్, కాంగ్రెస్ కాళ్ల కింద భూమి కదలాలన్నారు.శనివారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ బిడ్డలు బలిదానం చేసింది కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా కాదా అని ప్రశ్నించారు. బలిదానం చేసుకున్నది కేసీఆర్ కుటుంబానికి బానిసలుగా ఉండడం కోసం కాదని తెలిపారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అధికారం ఉన్నప్పుడు మజ్లిస్ పెత్తనం చేస్తుందని ఆయన ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రజలు బుద్ధి చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవని అన్నారు. తెలంగాణ ప్రజలు అసలైన మార్పు కోరుకున్నారని కేంద్రమంత్రి తెలిపారు. రెక్కాడితే గానీ డొక్కాడని పేదల ఇళ్ళు కూల్చుతామంటే ప్రాణాలు తెగించి బీజేపీ పోరాడుతోందన్నారు. మూసీ పేరుతో పేదల గూడు కూల్చితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. సోషల్ మీడియా చూడాలని.. భాష, పద్ధతి మార్చుకోవాలని ఆ రెండు పార్టీల నేతలకు హితవుపలికారు. అలాగే కేటీఆర్, కిషన్‌రెడ్డిని ఉద్దేశిస్తూ బ్యాడ్ బ్రదర్స్ అంటూ సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై కూడా కేంద్రమంత్రి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.ఎవరు ఎవరికి బ్రదర్స్ అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పెద్ద బ్రదర్ కేసీఆర్, తర్వాత చిన్న బ్రదర్ హరీశ్ రావు అంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రజలకే తాము బ్రదర్స్ అని చెప్పుకొచ్చారు. మునుగోడులో భారత సైనికులను చైనా సైనికులు కొట్టారని కేసీఆర్ అంటే.. జూబ్లీహిల్స్‌లో భారత సైనికులను ముద్ది మీద తన్నారని రేవంత్ రెడ్డి అంటున్నారని.. అసలు పాకిస్థాన్ ఉగ్రవాదులను భారతదేశం ఏం చేసిందో ప్రపంచం అంతా లైవ్‌లో చూసిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# బీహార్‌లో ఎన్నికల ఫలితాల తర్వాతే నిర్ణయం

**హంగ్ అసెంబ్లీ ఏర్పడితేనే పొత్తుపై ఆలోచిస్తా**

**ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ వెల్లడి**



**హైదరాబాద్, నవంబర్ 8:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత, ఒకవేళ హంగ్ అసెంబ్లీ ఏర్పడితేనే మహాకూటమితో కలిసే విషయంపై నిర్ణయం తీసుకుంటామని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. ప్రస్తుతం తమ పూర్తి దృష్టి తమ అభ్యర్థులను గరిష్ఠ సంఖ్యలో గెలిపించడంపైనే ఉందని ఆయన తెలిపారు. ఎన్డీటీవీకి ఇచ్చిన 'వాక్ ది టాక్' ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "నవంబర్ 14న ఏం జరుగుతుందో నాకు తెలియదు. ఒకవేళ హంగ్ ఏర్పడితే, అప్పుడు కచ్చితంగా స్పందిస్తాం. మా కూటమి అభ్యర్థులు వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో గెలిచేలా చూడటమే మా ప్రయత్నం. ఫలితాలు వచ్చినప్పుడు బీహార్ ప్రజల తీర్పు ఎలా ఉందో చూస్తాం" అని ఒవైసీ వివరించారు. బీహార్‌లోని ప్రతిపక్ష కూటమిలో ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలు ప్రధాన భాగస్వాములుగా ఉండగా, ఎన్డీఏలో బీజేపీ, జేడీయూ, లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్), హిందుస్థానీ అవామ్ మోర్చా, రాష్ట్రీయ లోక్ మోర్చా పార్టీలు ఉన్నాయి. 2020 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం 19 స్థానాల్లో పోటీ చేసి, ముస్లిం జనాభా అధికంగా ఉండే సీమాంచల్ ప్రాంతంలో ఐదు స్థానాలు గెలుచుకుంది. అయితే, ఆ తర్వాత నలుగురు ఎమ్మెల్యేలు ఆర్జేడీలో చేరిపోయారు. ఈసారి ఎంఐఎం 25 మంది అభ్యర్థులను బరిలోకి దించింది. తమ పార్టీ బీజేపీకి 'బీ-టీమ్' అని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా ఖండించారు. ఆ పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. "వారు నన్ను ఓట్లు చీల్చేవాడినని, బీ-టీమ్ అని అనడంలో అలసిపోరు. కానీ నరేంద్ర మోదీ మూడుసార్లు ప్రధాని అయ్యారనే విషయాన్ని ఎవరూ మాట్లాడరు. దానికి బాధ్యులెవరు? 450-500 స్థానాల్లో పోటీ చేసి మూడుసార్లు ఓడిపోయినప్పుడు ఇతరులను నిందించడం ఎందుకు? వారు ఆత్మవిమర్శ చేసుకోవాలి" అని ఒవైసీ ఘాటుగా స్పందించారు. బీహార్‌లో తొలి దశ పోలింగ్ రికార్డు స్థాయిలో 64.66 శాతంగా నమోదైంది. రెండో దశ పోలింగ్ నవంబర్ 11న జరగనుండగా, ఓట్ల లెక్కింపు నవంబర్ 14న చేపడతారు.

# ఈసీ ఏకపక్షంగా వ్యవహరిస్తోంది



- బీజేపీ కుట్రలు మేం బయటపెట్టాం
- చర్యలు ఈసీ తీసుకోవట్లేదు
- బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది
- ఓట్ చోరీపై రాహుల్ ఎనలేని పోరాటం
- 5 కోట్ల మందికిపైగా మద్దతు ఇచ్చారు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, నవంబర్ 8:** దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే విధంగా భారతీయ జనతా పార్టీ అవకతవకలకు పాల్పడుతోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర విమర్శలు చేశారు. గాంధీ భవన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటు చోరీలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరంతరం పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ పోరాటంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమానికి ఇప్పటివరకు 5 కోట్ల మందికిపైగా ప్రజలు మద్దతు తెలిపారని వెల్లడించారు. లోక్‌సభతో పాటు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేసిన అవకతవకలను కాంగ్రెస్ పార్టీ ఆధారాలతో సహా నిరూపిస్తోందని మహేష్ గౌడ్ పేర్కొన్నారు. కర్ణాటకలోని మహదేవ్‌పుర నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో జరిగిన భారీ తప్పిదాలు, బీజేపీ చేసిన మోసాలను రాహుల్ గాంధీ ఆధారాలతో సహా బయటపెట్టినా ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీజేపీ చేసిన కుట్రలను రాహుల్ గాంధీ స్పష్టమైన రుజువులతో నిరూపించారని ప్రస్తావించారు. హర్యానాలో 25 లక్షలకుపైగా నకిలీ ఓటర్లు, 5 లక్షల డూప్లికేట్ ఓటర్లు, వందలాది తప్పుడు చిరునామాలు, వేలాది తప్పు ఫోటో వివరాలు ఉన్నాయని మహేష్ గౌడ్ వెల్లడించారు. ఒకే మహిళ ఫోటోతో 22 ఎంట్రీలు, 100 ఓటరు కార్డులు ఉన్నట్టుగా రాహుల్ గాంధీ నిర్ధారించారని ఆయన వివరించారు. ఇదే తరహాలో బీహార్‌లో కూడా బీజేపీ సహకారంతో "సర్" పేరుతో సంబంధం లేని ఓట్లను తొలగించిందని ఆయన విమర్శించారు. ఓటు చోరీ ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే చర్యగా ఆయన అభివర్ణించారు. ప్రస్తుత ఎన్నికల సంఘం బీజేపీ చెప్పుచేతుల్లో ఉందని, ఏకపక్షంగా వ్యవహరిస్తోందని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రాహుల్ గాంధీ బిహార్‌లో ప్రారంభించిన 'ఓటు అధికార్ ర్యాలీ' బీజేపీలో వణుకు పుట్టించిందని మహేష్ గౌడ్ అన్నారు. హర్యానాలో అనుసరించిన ఫార్ములాను ఉపయోగించి బీజేపీ ఇప్పుడు బీహార్‌లో గెలవాలని ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. గతంలో జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో పక్క జిల్లాల ఓటర్లను నమోదు చేసి, బీజేపీ సహకారంతో బీఆర్ఎస్ గెలిచిన ఉదాహరణను ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. హర్యానా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో జరిగిన ఓటు చోరీలను ప్రజలు అర్థం చేసుకోవాలని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. "ఇందిరా గాంధీ ఏనాడు అవకతవకలకు పాల్పడలేదు. ఓటు హక్కును కాలరాసే హక్కు ఎవరికీ లేదు" అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, అల్లం భాస్కర్, హనుమంతు రావు, లింగం యాదవ్, గజ్జి భాస్కర్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను పెద్ద మెజారిటీతో గెలిపించవలసిన బాధ్యత మన అందరి పైన ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. నవీన్ యాదవ్ గెలుపు కోసం మీ ప్రార్థనా మందిరాలలో ప్రత్యేకంగా ప్రార్థనలు చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఈ క్యాబినెట్ మొత్తం కట్టుబడి ఉందన్నారు. తెలంగాణ సమాజ హితం కోసం ప్రజా ప్రభుత్వం శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందని, ఎటువంటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. మొత్తం సమాజం అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఈ ప్రజా ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత, అరచేతుల్లో పెట్టి రక్షించుకోవాల్సిన కర్తవ్యం ప్రజలపై ఉందన్నారు. నవీన్ యాదవును గెలిపించి ఈ ప్రభుత్వాన్ని దీవించి ముందుకు నడిపించాల్సిన బాధ్యత ఓటర్లపైనే ఉందన్నారు.

# రేంవత్ సభలకు జనం కరువు

- కొడంగల్ నుంచి రప్పిస్తున్నారు
- జూబ్లీహిల్స్ ప్రచారంలో హరీష్‌రావు



**హైదరాబాద్,నవంబర్ 8:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి కర్రు కల్చి వాత పెట్టబోతున్నారని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు జోస్యం చెప్పారు. ముఖ్యమంత్రి రోడ్ షోలకు జూబ్లీహిల్స్ ప్రజలు రావడం లేదని తన సొంత నియోజకవర్గం కొడంగల్ నుంచి జనాలను ఇక్కడికి రేవంత్ రెడ్డి తరలిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మహిళలకు రూ. 2, 500 ఇస్తామన్నారని.. అవి ఇవ్వకుండా ఈ ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. మహిళలకు రూ. 2,500 రావాలంటే బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని ఓటర్లకు సూచించారు. హామీలు ఎగ్గొట్టినా గెలిపించారని సీఎం రేవంత్ రెడ్డి మీకు ఇచ్చిన హామీలు అమలు చేయడని వివరించారు. శనివారం సాయంత్రం షేక్ పేట అంబేద్కర్ నగర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడుతూ.. దురదృష్టం కొద్ది మీరంతా అమితంగా ఇష్టపడి గెలిపించుకున్న మాగంటి గోపీనాథ్ అనారోగ్య కారణంగా చనిపోయారన్నారు. మగదిక్కు లేని ఆ కుటుంబానికి బీఆర్ఎస్ అండగా నిలబడిందని స్పష్టం చేశారు. గోపీనాథ్ ఆశయాలు ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన సతీమణి సునీతకు బీఆర్ఎస్ పార్టీ టికెట్ కేటాయించిందని గుర్తు చేశారు. అలాంటి వేళ బాధతో.. దు:ఖంతో ఉన్న ఆడబిడ్డ సునీతను కాంగ్రెస్ పార్టీ నాయకులు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సునీతమ్మను అవహేళన చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు బుద్ధి చెప్పాలని జూబ్లీహిల్స్ ఓటర్లకు ఆయన సూచించారు. గోపీనాథ్ మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి పేద ప్రజలకు, బస్తీ వాసులకు అండగా నిలిచారని చెప్పారు. నియోజకవర్గం నుంచి ఎదురీతకు లేడీ నిలుచుంటే అటు వైపు రౌడీ నిలబడ్డారని ఆయన వ్యంగ్యంగా అన్నారు. ఎవరు గెలవాలి? లేడీనా? రౌడీనా? అంటూ నియోజకవర్గ ప్రజలను ఈ సందర్భంగా ప్రశ్నించారు. మీ కష్టాలు.. మీ సమస్యల పరిష్కరించేందుకు సునీతమ్మతోపాటు మేమంతా మీకు అండగా ఉంటామని ఈ సందర్భంగా బస్తీ వాసులకు హరీశ్ రావు హామీ ఇచ్చారు.

# నిలిచిపోయిన వియత్నాం ఎయిర్‌లైన్స్ విమానం

## శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు ఆందోళన



**హైదరాబాద్, నవంబర్ 8:** శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు శనివారం ఆందోళన చేపట్టారు. వియత్నాం ఎయిర్‌లైన్స్‌కు చెందిన వీఎన్-984 విమానం శుక్రవారం రాత్రి శంషాబాద్ నుంచి వియత్నాంకు వెళ్లాల్సి ఉంది. కానీ సాంకేతిక సమస్య తలెత్తడంతో అధికారులు సర్వీసును నిలిపివేశారు. 200 మంది ప్రయాణికులు రాత్రంతా విమానాశ్రయంలోనే ఉండిపోయారు. ఈ క్రమంలో ఎయిర్‌లైన్స్ సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ప్రయాణికులు ఆందోళన చేపట్టారు. మరోవైపు భారీ మరమ్మతుల కారణంగా ఈ విమాన సర్వీసును పూర్తిగా రద్దు చేస్తున్నట్లు శనివారం ఉదయం 11 గంటలకు అధికారులు ప్రకటించారు. రీషెడ్యూల్ చేసిన విమానంలో ప్రయాణికులను పంపిస్తామని, అలా వెళ్లడానికి ఇష్టం లేని ప్రయాణికులకు పూర్తిస్థాయిలో టికెట్ డబ్బులు రీఫండ్ చేస్తామని హామీ ఇచ్చారు. కౌలాలంపూర్ వెళ్లాల్సిన విమానంలోనూ సాంకేతిక సమస్య ఏర్పడింది. దీంతో నిర్దేశించిన సమయం కంటే 6 గంటల ఆలస్యంగా శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయలుదేరింది. ఢిల్లీలో తలెత్తిన ఏటీసీ సాంకేతిక సమస్య వల్ల ఢిల్లీ, ముంబయి, శివమొగ్గ విమానాలు రద్దయ్యాయి. గోవా వెళ్లాల్సిన విమానం ఆలస్యంగా బయలుదేరింది.

# రాష్ట్రంలో చలి

## ఆదిలాబాద్ జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు

**హైదరాబాద్, నవంబర్ 8:** రాష్ట్రంలో చలి తీవ్రత మొదలైంది. గత రెండు రోజులుగా అన్ని జిల్లాల్లో ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్నాయి. రాత్రిపూట చలిగాలుల తీవ్రత ఎక్కువైంది. దీంతో చాలాచోట్ల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా బేలలో అతితక్కువగా 14.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా, రంగారెడ్డి జిల్లాలోని షాబాద్‌లో 14.7 డిగ్రీలు నమోదయింది. సంగారెడ్డిలోని జహీరాబాద్‌లో 14.8, శంకర్‌పల్లి 14.9, మొయినాబాద్ 15 డిగ్రీలు, ఆదిలాబాద్‌లోని భీమ్‌పూర్ 15, సంగారెడ్డిలోని జిన్నారంలో 15.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఇక, కొమురంభీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్, సిద్ధిపేట, సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్?, మహబూబ్?నగర్?, నారాయణపేట, నాగర్?కర్నూల్?, యాదాద్రి భువనగిరి, జనగామ, పెద్దపల్లి జిల్లాల్లో చలి తీవ్రత ఎక్కువైంది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయి-ంలో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. రాజేంద్రనగర్‌లో 15.3, హెచ్‌సీయూలో 15.3, బీహెచ్ఈఎల్ 15.5, మల్కాజిగిరి 15.7, కుత్బుల్లాపూర్ 15.7, గచ్చిబౌలి 15.9, మారేడ్‌పల్లి 16, ఆర్సీపురం 16.1, బేగంపేట 16.4, నేరేడ్‌మెట్ 17.1, అల్వాల్ 17.1, కార్వాన్ 17.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. కాగా, ఈ నెల 9న మరింత తకువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నది.



# రేవంత్ భాష వీధి రౌడీలా ఉంది

## ఫీజు బకాయిలు చెల్లించకుండా బెదిరింపులా?

## యాజమాన్యాలను బెదిరించే ధోరణిలో ప్రభుత్వం

## ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విమర్శ

**హైదరాబాద్, నవంబర్ 8:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలను "తాట తీస్తా, తొక్కుతా" అంటూ సీఎం హెచ్చరించడాన్ని ఆమె తప్పుబట్టారు. సీఎం వాడిన భాష వీధి రౌడీలు కూడా సిగ్గుపడేలా ఉందని ఘాటుగా విమర్శించారు. 'జనం బాట' కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించిన కవిత, హన్మకొండలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతోనే కాలేజీ యాజమాన్యాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. మాట తప్పింది మీరు. అలాంటప్పుడు వారి తాట, తోలు తీస్తామని అనడం ఎంతవరకు సమంజసం? తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తు కోసం నిలబడిన వారిపై మీ వీరంగమా?" అని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి, యాజమాన్యాలను బెదిరించే ధోరణి అవలంబిస్తోందని కవిత ఆరోపించారు. విద్యార్థుల కోసం పోరాడుతున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు తాము అండగా ఉంటామని, వారి తరఫున పోరాడతామని ఆమె భరోసా ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలి కానీ, బెదిరింపులతో కాదని హితవు పలికారు.

# హోటల్ మేనేజ్‌మెంట్ అకాడమీలో మత్తు

## గంజా సేవించిన ఆరుగురు విద్యార్థుల అరెస్ట్






**హైదరాబాద్, నవంబర్ 8:** డ్రగ్స్ మత్తులో యువత తమ జీవితాలను చిత్తు చేసుకుంటున్నాయి. డ్రగ్స్‌ను పూర్తిగా రూపుమాపేందుకు ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకొచ్చి అమలు చేస్తున్నప్పటికీ అడ్డుకట్టపడడం లేదు. తాజాగా హైదరాబాద్ లో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది. బేగంపేట్ క్యులినరీ హోటల్ మేనేజ్‌మెంట్ అకాడమీలో డ్రగ్స్ కలకలం సృష్టించింది. సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. ఆరుగురు విద్యార్థులు గంజా సేవించినట్లు పోలీసులు గుర్తించారు. ఆరు మంది విద్యార్థులకు డ్రగ్ టెస్టు నిర్వహించగా పాజిటివ్ వచ్చినట్లు తెలిపారు. ఈగల్, నార్కోటిక్స్ పోలీసులు సంయుక్తంగా విద్యార్థులకు పరీక్షలు చేశారు. పట్టుబడిన వారు చివరి సంవత్సరం చదువుతున్న హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులుగా గుర్తించారు. వారిని తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చి.. డి-అడిక్షన్ సెంటర్‌కు తరిలించినట్లు తెలిపారు. విద్యార్థుల స్నేహితుడే డ్రగ్స్ సరఫరా చేసినట్లు పోలీసులు తెలిపారు.

# ఆరబెట్టిన పత్తి మంటలకు ఆహుతి

## 300 క్వింటాళ్ల పత్తి దగ్ధంతో రైతు లబోదిబో



**సిద్దిపేట, నవంబర్ 8:** ఇటీవలి వర్షాలతో పంటలరు కాపడుకున్న రైతుపై అగ్నిహోత్రుడు ఆగ్రహం చెందాడు. ప్రమాదవశాత్తూ మంటలు అంటుకొని 300 క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. బెజ్జంకికి చెందిన రైతు బండి ఐలయ్య తన పది ఎకరాలతో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాడు. కొద్దిరోజులుగా పత్తి తీత పనులు కొనసాగుతుండగా.. ఇంటికి తెచ్చిన పత్తిలో తడి ఆరేందుకు ఖాళీ స్థలంలో టార్పాలిన్లు వేసి ఆరబెట్టారు. మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని క్షణాల్లో పత్తి మొత్తం కాలి బూడిదైంది. రైతు ఐలయ్యతో పాటు కుమారులు రమేష్, అనిల్, ఇతర కుటుంబ సభ్యులు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. సుమారు 300 క్వింటాళ్ల మేర పత్తి కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. ఇన్ని రోజుల కష్టం బూడిద పాలు కావడంతో బోరున విలపించారు. ఘటనా స్థలాన్ని సిద్దిపేట పోలీసులు పరిశీలించారు.




## సంపాదకీయం

# ప్రభుత్వ సంక్షోభ హాస్టళ్లు!

సంక్షేమ హాస్టళ్లు సంక్షోభ హాస్టళ్లుగా మారుతున్నాయి. ఉమ్మడి ఏపిలో ఎలా ఉన్నాయో..ఇప్పుడు రాష్ట్రం రెండుగా విడిపోయాక కూడా వాటి స్వరూప స్వభావాలు మారలేదు. పిల్లల పేరు చెప్పి కొందరు పందికొక్కుల్లా బలుస్తున్నారు. వార్డెన్లు భయం లేకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. అన్నింటికి మించి సంక్షేమ హాస్టళ్లో కాలం వెళ్లదీస్తున్న పిల్లల జీవితం ఎప్పుడు ఎలా ముగుస్తుందో తెలియడం లేదు. అమ్మాయిలైతే బలవంతపు అత్యాచారాలకు గురవుతున్నారు. ఇదో రకమైన హింస. ఇందులో బయటకు వచ్చే కేసులు కొన్ని మాత్రమే. ఇకపోతే సరైన ఆహారం ఉండదు. సరైన వసతి ఉండదు. నాసిరకం ఆహారంతో వాంతులు విరేచనాలతో ఆస్పత్రి పాలు కావడం, అందులో కొందరు మృత్యువాత పడడం... తలంలిదండరులకు క్షోభ మిగల్చడం అన్నది భేతాళ కథల్లా సాగుతున్నాయి. ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ హాస్టళ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. హాస్టళ్లలో ఉండే పిల్లలను పురుగుల్లా చూస్తున్నారు. ఎలాంటి రక్షణ ఉండదు. తల్లిదండ్రులకు దూరంగా ఇక్కడ ఇంత తింటూ చదువుకుందామని వచ్చిన వారికి ఈసడింపులు షరామామూలే. పదేళ్లపాటు తెలంగాణను ఏలిన కల్వకుంట్ల కుటుంబం హాస్టళ్లను బాగుచేసివుంటే ఇవాళ జరుగుతున్న ఘోరాలు జరిగేవా అన్నది ఆలోచించాలి. కానీ వారు చేయలేదు. తమ కాలంలో జరిగిన అనర్థాలే ఇప్పుడూ జరుగుతున్నాయి. వీటిపై గగ్గోలు పెట్టడం కెటిఆర్, హరీష్ రావులకు అలవాటయ్యింది. ఎపిలో కూడా ఇంతకుమించి ఘటనలు జరుగుతున్నాయి. ఘనత వహించిన చంద్రబాబు పాలనలో కూడా వాటి రూపురేఖలు ఏమీ మారడం లేదు. విద్య,వైద్యానికి పెద్దపీట వేయాల్సిన పాలకులు ఓట్ బ్యాంకు రాజకీయాలతో డబ్బు వృధా చేసే పథకాలను మోస్తున్నారు. ఇకపోతే అక్షరాస్యతలో బాగా వెనుకబడిన గిరిజన ప్రాంతాలపై ప్రేమ ఒలకబోయడమే తప్ప నిజంగానే వారిని ఉద్ధరించే కార్యక్రమాలు శూన్యం. గిరిజన ప్రాంతాలలో అక్షరాస్యత పెంచాలనే లక్ష్యంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 46 గిరిజనులకు విద్య, రక్షణ, సదుపాయాలు కల్పించాలని పేర్కొంది.గిరిజనుల విద్య కోసం చేసిన కృషిని కూడా విస్మరించలేం. అయితే అది వారు స్వయంగా ఎదిగేలా చేయడం లేదన్నదే బాధ. ఈ క్రమంలో ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, గిరిజన ప్రాథమిక పాఠశాలలను నెలకొల్పి అక్షరాస్యత కోసం, విద్య కోసం సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేసినా వాటిని బలోపేతం చేయడంలో ఇరు రాష్ట్రాల్లో పాలకులు విఫలం అయ్యారు. గిరిజనులకు విద్యను అందిస్తూ వారిని అన్ని విధాలా సామాజిక వివక్షతల నుంచి, దోపిడీ నుంచి రక్షించాల్సి ఉంది. వారు చదువుసంధ్య లేక కేవలం గూడేలకు పరిమితం కాకుండా చూడాలి. షెడ్యూలు ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాలను ప్రకటించింది. అయినా వారి గూడాలకు నేటికీ రోడ్డు లేదు. సరైన చదువు, వైద్యం లేదు. అనేక ప్రాంతాల్లో గిరిజన హాస్టళ్లు బాలారిష్టాలతోనే కొనసాగుతున్నాయని ఆయా ప్రాంతాలలో జరిగే సంఘటనలే నిరూపిస్తున్నాయి. నేటికీ గిరిజన ప్రాంతాల నుండి ఆసుపత్రికి రావాలంటే డోలీ మోతలు చూస్తున్నాము. ఆ ప్రాంత ప్రజలపైగల బాధ్యతా రాహిత్యం విద్యార్థులు చదువుకునే సంక్షేమ గృహాలపై కూడా కొనసాగుతున్నది. ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్నపుడు తాగునీరు లేక, మరుగుదొడ్లు లేక రోగాల బారినపడి చనిపోయిన ఘటనలను చూశాం. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లోని కురుపాం మండల కేంద్రంలోగల గురుకుల బాలికల పాఠశాలలో జరిగిన ఘటన వరకు రాష్ట్రాన్ని కుదిపివేశాయి. ఇద్దరు బాలికలు చనిపోవడం, 138 మంది పచ్చ కామెర్లతో ఆసుపత్రిపాలు కావడం సంక్షేమ హాస్టళ్ల పట్ల ప్రభుత్వం ఏ విధంగా శ్రద్ధ చూపుతున్నదో అర్థం అవుతున్నది. క్వాంటం కంప్యూటింగ్, ఎఐ అంటూ నిత్యం ఫ్లెక్సీ వేస్తున్న చంద్రబాబు ఈ హాస్టల్ల దుస్థితి తెలుసుకోక పోవడం దురదృష్టకరం. తెలుగు రాష్ట్రాల్లో గిరిజన సంక్షేమ హాస్టళ్లు ఎక్కువ శాతం సౌకర్యాల లేమితో కునారిల్లుతున్నాయి. బాలికల వసతి గృహాలు సరిపడినన్ని లేక అత్యంత దయనీయంగా వున్నాయి.. పాఠాలు బోధించడానికి, బాలికలు నిద్రించడానికి, సామానులు భద్రపరచడానికి, భోజనాలు చేయడానికి అన్నింటికీ ఒకటి రెండు గదులతో సరిపుచ్చు తున్నారు. చెప్పాలంటే గురుకులాలు సమస్యల నిలయాలుగా ఉన్నాయి. బాలికల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ఒక్క ఆశ్రమ పాఠశాలలో కూడా ఎ.ఎన్.ఎంలు లేరు. గురుకులాలలో ఉన్నప్పటికీ తగిన మందులు, సౌకర్యాలు కల్పించడంలేదు. ఆశ్రమ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు భయపడి ఆందోళనతో స్వంత డబ్బులతో ఆరోగ్య కార్యకర్తలను నియమించుకుంటున్నారు. రెండు దశాబ్దాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. పాలకులు మారుతున్నా పరిస్థితులు మారడం లేదు. వార్డెన్ పోస్టులు శాశ్వత ప్రాతిపదికన లేనందున ఉపాధ్యాయులే ఒకవైపు బోధన మరోవైపు, పిల్లల బాధ్యత చూడటం జరుగుతోంది. వైద్యపరమైన సేవలు అందించడానికి సిబ్బంది లోపం కూడా విద్యార్థులకు శాపంగా మారుతున్నది. విద్యార్థుల అనారోగ్య పరిస్థితులలో మెడికల్ ఖర్చు భరించేందుకు తగిన నిధిని సమకూర్చడం లేదు. సంక్షేమ హాస్టళ్లలో చిన్నపిల్లల ఆలనా పాలన చూసే ఆయాలు గాని, టీచర్లు గాని ప్రత్యేకంగా లేకపోవడం వలన పిల్లల మానసిక, శారీరక, విద్యాపరమైన అంశాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నిజానికి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలను ఏర్పాటు చేసి గుణాత్మక విద్యను అందివ్వాలి. తద్వారా సామాజికంగా, ఆర్థికంగా మెరుగైన జీవన పరిస్థితులు కల్పించాలి. బడులు లేక, ఉన్నాబడుల్లో టీచర్లు లేక, అసంపూర్ణ భవనాలు, చాలీచాలని వసతులు ఎక్కడికి వెళ్లినా దర్శనమిస్తున్నాయి. తాగునీటిది పెద్ద సమస్య. గిరిజన సంక్షేమ హాస్టళ్లలో పిల్లలు రోగాల బారినపడి పిట్టల్లా రాలిపోవడం చూస్తున్నాం. విషజ్వరాలు, పచ్చకామెర్లు, మలేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే ఈ రంగంపై నిర్లక్ష్యం తగదు. ఎప్పటికప్పుడు మౌలిక వసతులు కల్పించే విషయంలో బ్జడెట్ కేటాయింపులు పెంచాలి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా, మరమ్మతులు, వైద్య అవసరాలు, పోషక విలువలతో కూడిన మెనూ చార్జీల పెంపునకు నిధులు వుండాలి. పేదరికం, దోపిడీ, వెనుకబాటుతనం నుండి విముక్తి జరగాలంటే హాస్టళ్లను బలోపేతం చేయాలి. పాఠశాలలకు ఆయా హాస్టళ్లను అటాచ్ చేయాలి. ప్రత్యేకించి నిధులు పెంచాలి. అప్పుడే పేదలకు విద్య అందుతుంది.

# విమానాశ్రయాల్లో గందరగోళ పరిస్థితులు

- పూర్తిగా గతితప్పిన ఆటోమేటిక్ వ్యవస్థలు
- విమానాల రద్దు.. ప్రయాణికుల ఆందోళన



**హైదరాబాద్, నవంబర్ 8:** రెండు రోజుల నుంచి భారత్‌లోని పలు విమానాశ్రయాల్లో గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి ఢిల్లీలోని ఏటీసీ ఆటోమేటిక్ వ్యవస్థ పని చేయలేదు. దీంతో వందల విమానాలు రద్దు చేయాల్సి వచ్చింది. మధ్యాహ్నానికి ముంబైలో అదే పరిస్థితి ఏర్పడింది. ఇంకా అక్కడ పరిస్థితులు ఇప్పుడిప్పుడే కొలిక్కి వస్తున్నాయి. ఇప్పుడు తాజాగా హైదరాబాద్‌లో శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు ఆందోళన చేపట్టారు. ఇలా వరుసగా విమానాశ్రాయాల్లో జరుగుతున్న పరిణామాలపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టింది. దేశంలోని వివిధ విమానాశ్రయాల్లోని ఏటీసీ అటోమేటిక్ వ్యవస్థ పని చేయలేదు. 36 గంటలు దాటిన తర్వాత ఢిల్లీ, ముంబై, శివమొగ్గ ఎయిర్‌పోర్టుల్లో పరిస్థితులు కంట్రోల్‌లోకి వస్తున్నాయి. అందుకే శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆ ప్రాంతాలకు వెళ్లే విమానాలను రద్దు చేశారు. ఈ విషయాన్ని ప్రయాణికులకు చెప్పకుండా రద్దు చేయడం గందరగోళానికి కారణమైంది. తమకు ముందస్తు సమాచారం లేకుండా ఇలా చేయడం ఏంటని ప్రయాణికులు ఆందోళనబాట పట్టారు. దీంతో ఎయిర్‌పోర్ట్‌లో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి కౌలాలంపూర్, వియత్నాం, గోవా వెళ్లే విమానాలను అర్ధాంతరంగా రద్దు చేశారు. సాంకేతిక కారణాలతో ఈ చర్యలు తీసుకున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఢిల్లీ, ముంబై, శివమొగ్గ వెళ్లే విమానాలను కూడా రద్దు చేశారు. దీనికి మాత్రం అక్కడ ఏటీసీ వ్యవస్థ సరిగా పనిచేయకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నారు. అర్ధరాత్రి వేళలో ఇలా నిర్ణయం తీసుకోవడంతో ప్రయాణికులు ఆందోళన చేపట్టారు. ఎందుకు ఇలాంటి పని చేశారని సిబ్బందిని ప్రశ్నిస్తే రూడ్‌గా సమాధానం చెప్పారని మండిపడ్డారు. గంటల తరబడి ఎదురు చూస్తున్నా వారి నుంచి సరైన స్పందన రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్సాంకేతిక సమస్య పరిష్కారమైందనివిమాన కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరుకుంటున్నాయని ఢిల్లీ విమానాశ్రయ అథారిటీ ప్రకటించింది. పరిస్థితి ఇప్పుడు సాధారణ స్థితికి చేరుకుంటుందని అందులో పేర్కొంది. ఢిల్లీ విమానాశ్రయ అథారిటీ ఇచ్చిన ప్రకటనలో ఇలా ఉంది , "ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ విమాన ప్రణాళిక ప్రక్రియకు సహాయపడే ఆటోమేటిక్ మెసేజ్ స్విచింగ్ సిస్టమ్ ను ప్రభావితం చేసే సాంకేతిక సమస్య క్రమంగా మెరుగుపడుతోంది. ఢిల్లీ విమానాశ్రయంలో విమాన కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరుకుంటున్నాయి. సంబంధిత అధికారులందరూ అసౌకర్యాన్ని తగ్గించడానికి పనిచేస్తున్నారు. తాజా విమాన సంబంధిత సమాచారం కోసం ప్రయాణీకులు తమ విమానయాన సంస్థతో సన్నిహితంగా ఉండాలని సూచించారు." గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ఢిల్లీ విమానాశ్రయంలో 800 కంటే ఎక్కువ విమానాలు ప్రభావితమయ్యాయి. సాంకేతిక సమస్య కారణంగా మూసివేశారు.

# పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య ఘర్షణలు

**శాంతి చర్చలు విఫలమవడంతో ఘర్షణ**

**సైనికులు, పౌరులతో సహా వందల మంది మృతి**



**ఇస్లామాబాద్, నవంబర్ 8:** పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య నెలకొన్న సరిహద్దు ఉద్రిక్తతలను తగ్గించేందుకు జరిగిన శాంతి చర్చలు విఫలమయ్యాయి. ఖతార్, టర్కీ దేశాల మధ్యవర్తిత్వంలో ఇస్తాంబుల్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఈ సమావేశాలు ఎటువంటి ఫలితం తేలకుండానే ముగిశాయి. చర్చలు విఫలమవడానికి పాకిస్థాన్ బాధ్యతారహిత వైఖరే కారణమని ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్ పాలకులు తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో ఇరు దేశాల మధ్య ఘర్షణలు కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. శనివారం ఉదయం తాలిబన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ సోషల్ మీడియాలో ఒక ప్రకటన విడుదల చేశారు. "ఈ చర్చల్లో పాకిస్థాన్ తన భద్రతా వైఫల్యాలన్నింటినీ ఆఫ్ఘనిస్థాన్‌పై నెట్టే ప్రయత్నం చేసింది. అదే సమయంలో ఆఫ్ఘన్ భద్రతకు గానీ, తమ సొంత భద్రతకు గానీ బాధ్యత వహించడానికి ఎలాంటి సుముఖత చూపలేదు. పాక్ అనుసరించిన బాధ్యతారహితమైన, సహకరించని వైఖరి వల్లే చర్చలు విఫలమయ్యాయి" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, పాకిస్థాన్ కూడా చర్చల్లో ఎలాంటి పురోగతి లేదని శుక్రవారమే అంగీకరించింది. అంతర్జాతీయ సమాజానికి ఇచ్చిన హామీ మేరకు తాలిబన్లు ఉగ్రవాదాన్ని అరికట్టడంలో విఫలమయ్యారని పాక్ ఆరోపిస్తోంది. ముఖ్యంగా, తమ దేశంలో అనేక దాడులకు పాల్పడుతున్న తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులకు ఆఫ్ఘన్ ప్రభుత్వం ఆశ్రయం కల్పిస్తోందని ఇస్లామాబాద్ ఆరోపిస్తోంది. అయితే ఈ ఆరోపణలను తాలిబన్లు ఖండించారు. ఏ దేశంపైనా దాడికి తమ భూభాగాన్ని ఉపయోగించుకోనివ్వబోమని, అదే సమయంలో తమ సార్వభౌమత్వానికి భంగం కలిగించే చర్యలను గట్టిగా ప్రతిఘటిస్తామని వారు స్పష్టం చేశారు. గత కొన్ని నెలలుగా ఇరు దేశాల సరిహద్దుల్లో ఘర్షణలు తీవ్రమయ్యాయి. అక్టోబర్ ప్రారంభం నుంచి జరిగిన దాడుల్లో ఆఫ్ఘన్ వైపు 50 మంది పౌరులు మరణించారని, 447 మంది గాయపడ్డారని ఐక్యరాజ్యసమితి తెలిపింది. మరోవైపు, తాలిబన్ల దాడుల్లో 23 మంది సైనికులు మరణించారని, 29 మంది గాయపడ్డారని పాక్ సైన్యం ప్రకటించింది. చర్చలు విఫలమవడంతో మధ్యవర్తిత్వం వహించిన ఖతార్, టర్కీలకు పాకిస్థాన్ కృతజ్ఞతలు తెలుపుతూనే, తమ ప్రజలను, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# ఆఫ్రికా పర్యటనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**రాష్ట్రపతితో వెళ్లనున్న డీకే అరుణ**



**హైదరాబాద్, నవంబర్ 8:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి ఆఫ్రికాలో జరిపే అధికారిక పర్యటనలో మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ పాల్గొననున్నారు. భారత ప్రతినిధి బృందంలో సభ్యురాలిగా ఆమె ఈ పర్యటనకు ఎంపికయ్యారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తెలంగాణకు ప్రాతినిధ్యం వహించే ఈ కీలక పర్యటన ద్వారా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా వాణిజ్యం, వ్యవసాయం, సాంకేతికత, సాంస్కృతిక మార్పిడి వంటి కీలక రంగాల్లో భారత్, ఆఫ్రికా దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించడంపై ప్రధానంగా చర్చలు జరపనున్నారు. తెలంగాణ మహిళా నాయకత్వాన్ని ప్రపంచ వేదికపై నిలబెట్టేందుకు ఇదొక గొప్ప అవకాశంగా డీకే అరుణ భావిస్తున్నారు. గ్రామీణాభివృద్ధి, మహిళల పురోగతి, రైతుల సంక్షేమం కోసం ఆమె చేసిన సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిన నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ, "ప్రపంచ ప్రగతిలో తెలంగాణ పాత్రను మరింత బలంగా నిలబెట్టడమే నా లక్ష్యం. ఈ పర్యటన ద్వారా మహిళలు, రైతులు, యువతకు ఉపయోగపడే అవకాశాలను మన రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తాను" అని తెలిపారు. ఈ పర్యటనతో భారత్-ఆఫ్రికా సంబంధాలు కొత్త దిశగా పయనిస్తాయని, అదే సమయంలో తెలంగాణ ప్రతిష్ఠ అంతర్జాతీయంగా ఇనుమడిస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## కాన్పూర్‌లో నీట్ విద్యార్థి ఆత్మహత్య

**కాన్పూర్, నవంబర్ 8 :** నీట్ పరీక్షకు సిద్ధమవుతున్న ఓ విద్యార్థి తీవ్ర ఒత్తిడితో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో చోటుచేసుకుంది. ఆత్మహత్యకు ముందు తన తల్లిదండ్రులను క్షమించమని కోరుతూ విద్యార్థి రాసిన సూసైడ్ నోట్ కంటతడి పెట్టిస్తోంది. వివరాల్లోకి వెళితే.. రాంపూర్‌కు చెందిన మహమ్మద్ ఆన్ (21) నీట్ కోచింగ్ కోసం కాన్పూర్‌లోని రావత్‌పూర్‌లో ఉన్న ఓ హాస్టల్‌లో నాలుగు రోజుల క్రితమే చేరాడు. శుక్రవారం మధ్యాహ్నం, అతని రూమ్‌మేట్ ఇమ్దాద్ హసన్ ప్రార్థనలకు వెళ్దామని పిలవగా, మహమ్మద్ నిరాకరించాడు. ఇమ్దాద్ తిరిగి వచ్చి చూసేసరికి గదికి లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. ఎంత పిలిచినా మహమ్మద్ నుంచి స్పందన రాకపోవడంతో ఆందోళన చెంది పోలీసులకు సమాచారం అందించాడు.



# వేడెక్కుతున్న బీహార్ ఎన్నికల ప్రచారం

**బీహార్ చేపల కోసం పెద్దపెద్ద వాళ్లు వస్తున్నారు**


**రాహుల్ చేపలవేటపై మోడీ వ్యంగ్యాస్త్రాలు**

**పాట్నా, నవంబర్ 8:** బిహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికార, విపక్ష పార్టీలు పదునైన వ్యాఖ్యలతో విమర్శలు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ఇటీవల చేపలవేట కోసం మత్స్యకారులతో కలిసి చెరువులోకి దిగారు. దానిని ఉద్దేశించి ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. బిహార్ చేపలను చూడటానికి పెద్దపెద్దవాళ్లు వస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో మునిగిపోయేందుకు ఇప్పటి నుంచే ప్రాక్టీస్ చేస్తున్నారంటూ ఎద్దేవా చేశారు.బిహార్‌లో చేపలు పట్టడానికి ఇప్పుడు పెద్దపెద్ద వాళ్లు వస్తున్నారని, కొందరు ఎన్నికల్లో మునిగిపోయేందుకు ప్రాక్టీస్ చేస్తున్నారని ప్రధాని మోడీ ఛలోక్తులు విసిరారు.కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ఇటీవల బిహార్ ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు బెగుసరాయి జిల్లాలో మత్స్యకారులతో కలిసి చెరువులోకి దిగడం, చేపలు పట్టడంపై ప్రధాని నరేంద్ర మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బిహార్‌లోని సీతామర్హిలో శనివారం నాడు జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ, ఒకానొక సమయంలో బిహార్ ఇతర రాష్ట్రాల నుంచి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుంచి చేపలను సేకరించేదని, కానీ మత్స్యశాఖకు సంబంధించి తాము తీసుకున్న చర్యల కారణంగా బిహార్ ఇప్పుడు చేపల పెంపకంలో స్వయం సమృద్ధిని సాధించిందని చెప్పారు. అంతేకాకుండా ఇతర రాష్ట్రాలకూ ఎగుమతి చేస్తోందని అన్నారు. ఇక్కడి చేపలను చూసేందుకు పెద్దపెద్ద వాళ్లు కూడా వస్తున్నారని, కొందరు చెరువుల్లో డైవింగ్ చేస్తుంటే, మరికొందరు బిహార్ ఎన్నికల్లో మునిగిపోయేందుకు ప్రాక్టీస్ చేస్తున్నారంటూ పరోక్షంగా రాహుల్‌పై సెటైర్ వేశారు. కొన్నిరోజుల క్రితం బెగుసరాయ్ జిల్లాలో మత్స్యకారులతో కలిసి రాహుల్ చేపలు పట్టేందుకు వెళ్లారు. అప్పుడు ఆయన వెంట మాజీ మంత్రి, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ వ్యవస్థాపకుడు, విపక్ష కూటమి డిప్యూటీ సీఎం అభ్యర్థి ముకేశ్ సాహ్నీ కూడా ఉన్నారు. చేపలు పట్టేందుకుగానూ సాహ్నీ నీళ్లలోకి దిగి వలవేశారు. కాసేపటికి రాహుల్ గాంధీ సైతం నీళ్లలో దూకారు. మత్స్యకారులతో కలిసి చేపలు పట్టారు. ఈత కొట్టారు. ఆ సందర్భంగా జాలర్లతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వేట నిషేధిత కాలంలో మత్స్యకారుల కుటుంబాలకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం, బీమా సదుపాయం, చేపల మార్కెట్‌ల ఏర్పాటు, మత్స్య సంపద కోసం జలవనరుల పునరుద్ధరణ వంటి హామీలు ఇచ్చారని కాంగ్రెస్ వెల్లడించింది.

# కుప్పం దశ మార్చేలా ప్రాజెక్టులు

మొదటి పేజీ తరువాయి

సీఎం స్పష్టం చేశారు. కుప్పం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు కానున్న ఈ ఏడు సంస్థల్లో దేశంలోని దిగ్గజ కంపెనీలు ఉన్నాయి. ఆదిత్య బిర్లా గ్రూప్‌కు చెందిన హిందాల్కో సంస్థ రూ.586 కోట్లతో మొబైల్, ల్యాప్‌టాప్ వంటి టెక్ పరికరాల విడిభాగాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. శ్రీజా డైరీ రూ.290 కోట్లతో సమీకృత డెయిరీ, పశువుల మేత ప్లాంటును, ఏస్ ఇంటర్నేషనల్ సంస్థ రూ.525 కోట్లతో గ్రీన్ ఫీల్డ్ డెయిరీ ఉత్పత్తుల కాంప్లెక్స్‌ను, ఎస్వీఎఫ్ సోయా రూ.373 కోట్లతో వంట నూనెల తయారీ యూనిట్‌ను స్థాపించనున్నాయి. వీటితో పాటు మదర్ డైరీ రూ.260 కోట్లతో పండ్ల రసాల యూనిట్‌ను, ఇ-రాయిస్ ఈవీ రూ.200 కోట్లతో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కేంద్రాన్ని, అలీప్ సంస్థ రూ.27 కోట్లతో మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక పార్కును అభివృద్ధి చేయనుంది. ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు పూర్తి సహకారం అందిస్తున్నామని తెలిపారు. సింగిల్ విండో విధానం ద్వారా పరిశ్రమలకు త్వరితగతిన అనుమతులు ఇస్తున్నామని, భవిష్యత్తులో స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, ఏరో స్పేస్ సిటీలను ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు కూడలిగా ఉన్న కుప్పం భౌగోళిక ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని మౌలిక సదు-



పాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. ఈ పరిశ్రమల రాకతో కేవలం యువతకు ఉద్యోగాలే కాకుండా, స్థానిక రైతులు, మహిళలకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరనుంది. శ్రీజా డెయిరీ రోజుకు నాలుగు లక్షల లీటర్ల పాలను, మదర్ డైరీ పండ్లను, ఎస్వీఎఫ్ సోయా స్థానిక పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తాయని, దీనివల్ల పాడి, వ్యవసాయ రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని సీఎం తెలిపారు. ప్రత్యేకంగా మహిళల కోసం అలీప్ సంస్థ నిర్మిస్తున్న 'మహిళా శక్తి భవన్' ద్వారా 4,000 మందికి ఉపాధి, శిక్షణ లభిస్తాయని చెప్పారు. ఈ ఏడాదిలో డ్వాక్రా, మెప్మా సంఘాల నుంచి లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. "వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్, వన్ ఫ్యామిలీ-వన్ ఏఐ నిపుణుడు అనే పాలసీలతో చరిత్రను తిరగరాస్తాం" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ ఏడు కంపెనీలే కాకుండా త్వరలోనే రూ.6,339 కోట్ల పెట్టుబడితో మరో 8 సంస్థలు కుప్పానికి రానున్నాయని, వాటి ద్వారా అదనంగా 43 వేల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని చంద్రబాబు శుభవార్త చెప్పారు. దీంతో బ్యాటరీ టెక్నాలజీ, మెడికల్ డివైసెస్, ఫుడ్ లాజిస్టిక్స్ వంటి రంగాల్లో కుప్పం కీలక కేంద్రంగా మారనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కరవును దూరం చేసేందుకు 700 కిలోమీటర్ల దూరం నుంచి హంద్రీ-నీవా జలాలను కుప్పానికి తీసుకొచ్చామని, దీంతో తాగు, సాగు, పారిశ్రామిక అవసరాలకు నీటి కొరత ఉండదని హామీ ఇచ్చారు. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ, సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని ఆయన పునరుద్ఘాటించారు.

# ఎమ్మెల్యేలు సరిగ్గా పనిచేయడం లేదు

అమరావతి : టీడీపీ ఎమ్మెల్యేల్లో 48 మంది పూర్తిగా దారి తప్పారని చంద్రబాబునాయుడు గుర్తించారు. ఎన్నిసార్లు చెప్పిన వికపోవడంతో నోటీసులు జారీ చేయాలని నిర్ణయించుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనకపోవడం, ప్రవర్తనలో లోపాలు ఉన్న 48 మంది ఎమ్మెల్యేలకు వెంటనే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. తీరు మారకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశమైన సీఎం, పెన్షన్ల పంపిణీ, సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత వంటి కార్యక్రమాలపై సమీక్షించారు. ప్రజల సమస్యలను పరిష్కారానికి ఎమ్మెల్యేలు ఎంత మంది అందుబాటులో ఉంటున్నారో తెలుసుకున్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు కాల పరిమితి తీరిపోయే వరకూ పంపిణీ చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పెన్షన్ల పంపిణీ, సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసే కార్యక్రమాల్లో 48 మంది ఎమ్మెల్యేలు పాల్గొనకపోవడం సీఎం దృష్టికి వచ్చింది. బ్యాక్ ఆఫీసు, ప్రోగ్రాం కమిటీకి ఆదేశాలు జారీ చేస్తూ, ఆ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చి వివరణ కోరాలని సూచించారు. వివరణ సంతృప్తికరంగా లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేదల సేవలో భాగంగా పెన్షన్ల పంపిణీలో మంత్రులు, ఎమ్మెల్యేలు తప్పకుండా పాల్గొనాలని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని, కార్యకర్తలు, ప్రజలతో మాట్లాడాలని సూచించారు. టీడీపీ కార్యకర్తలకు ఇన్సురెన్స్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో కూడా ఎమ్మెల్యేలు తప్పకుండా పాల్గొనాలి. పనిచేసిన వారందర్నీ కలుపుకుని వెళ్లాలన్నారు. ప్రతి శుక్రవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయాల్లో జరిగే ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాల్గొనాలి. పాల్గొనకపోతే పార్టీ కేంద్ర కార్యాలయం వివరణ తీసుకోవాలి ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు గతంలో కంటే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పేదలకు ఎన్నోకష్టాల్లో ఉంటే సీఎంఆర్ఎఫ్ కు దరఖాస్తు చేసుకుంటారు. వారికి మంజూరు అయిన డబ్బులు కూడా ఇవ్వడానికి ఎమ్మెల్యేలకు తీరిక లేకపోతే ఇక వారికి ప్రజా సేవ చేయడానికి అర్హత ఏముంటుందన్న ప్రశ్నలు వస్తున్నాయి. సీఎం ఆర్ఎఫ్ చెక్కులకు మూడు నెలల పరిమితి ఉంటుంది. ఇష్యూ చేసిన తేదీ నుంచి మూడు నెలల పాటు చెక్కులు పంపిణీ చేయకపోవడం వల్ల అవి తిరిగి వస్తున్నాయి . కొత్తగా చెక్కులు జారీ చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఇది సీఎంను అసహనానికి గురి చేసింది. ఇప్పటి వరకూ చూశామని ఇక పనితీరు మార్చుకోకపోతే పక్కన పెట్టాలని నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది.

# నిజం ఎప్పుడూ ఒంటరిగా ప్రయాణించదు!?

**సమయం ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్ :** ప్రస్తుతం దేశంలో, ముఖ్యంగా తెలంగాణ వంటి రాష్ట్రాలలో విమర్శించేవారిపై, అన్యాయాన్ని ప్రశ్నించేవారిపై ఉద్దేశపూర్వకంగా (చెడు ఉద్దేశంతో) కేసులు నమోదు చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇది భారత రాజ్యాంగంలోని అనుచ్ఛేదం 19(1)(ఎ) కల్పించిన మాట్లాడే స్వేచ్ఛ హక్కుకు ముప్పు. 'నకిలీ కేసుల పంచాయతీ' అనేది కేవలం వ్యక్తిగత వేధింపు కాదు. ఇది చట్ట పాలన (ధర్మ పాలన) యొక్క మౌలిక సిద్ధాంతాన్నే ప్రశ్నిస్తోంది. తమ అధికారాలను దుర్వినియోగం చేస్తూ, పోలీసు వ్యవస్థను వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడుకోవడం అనేది వ్యవస్థీకృత లోపంగా పరిణమించింది.



### దర్యాప్తు అధికారుల బాధ్యత..

దర్యాప్తు ప్రక్రియలో క్షేత్రస్థాయి విచారణ అత్యంత ముఖ్యమైన భాగం. నేర విచారణా నియమావళి ప్రకారం, దర్యాప్తు అధికారి కచ్చితంగా పక్షపాతం లేకుండా విచారణ చేపట్టాలి. కేవలం అందిన తొలి సమాచార నివేదిక ఆధారంగానో, పైస్థాయి ఒత్తిడి కారణంగానో కాకుండా, పక్కా సాక్ష్యాలు, పత్ర రూపంలోని రుజువులు సేకరించాలి. విచారణాధికారి వాస్తవాలను ధ్రువీకరించకుండా కేసు నమోదు చేస్తే, అది వారి వృత్తిపరమైన బాధ్యతారాహిత్యంగా పరిగణించబడుతుంది.

### సివిల్ తగాదాలలో క్రిమినల్ చట్టాల దుర్వినియోగం..

అక్రమ కేసులు, తప్పుడు అరెస్టుల నివారణకు అత్యున్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) పలు చారిత్రక తీర్పులు ఇచ్చింది. 'అర్నేష్ కుమార్ వర్సెస్ బీహార్ ప్రభుత్వం' కేసు (2014, జూలై 2) ఈ విషయంలో ఒక మైలురాయి. ఏడేళ్ల కంటే తక్కువ శిక్ష పడే నేరాలలో అరెస్టు ఆవశ్యకతను పోలీసులు తప్పనిసరిగా నిరూపించుకోవాలి అని ఈ తీర్పు స్పష్టం చేసింది. ఈ నియంత్రణ అనుచ్ఛేదం 21 (జీవించే స్వేచ్ఛ) ప్రకారం పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛను పరిరక్షిస్తుంది. న్యాయ ప్రక్రియలో మరో పెద్ద లోపం %-% సివిల్ వివాదాలకు క్రిమినల్ రంగు పూయడం. కేవలం వ్యాపార ఒప్పందాల ఉల్లంఘన లేదా ఆస్తి తగాదాలను మోసం, క్రిమినల్ ట్రస్ట్ భంగం వంటి నేరాలుగా చిత్రీకరించి తొలి సమాచార నివేదికలు నమోదు చేస్తున్నారు. సుప్రీంకోర్టు 'ఎస్.ఎన్. విజయలక్ష్మి వర్సెస్ ఇతరులు' కేసు (తేదీ: 2025, జూలై 31)లో, 'అతి తీవ్రమైన నేర స్వభావం' ఉంటే తప్ప, సివిల్ వివాదాలలో క్రిమినల్ విచారణ ప్రారంభించకూడదని స్పష్టం చేసింది.

### నకిలీ ఆరోపణలకు చట్టపరమైన బాధ్యత..

దురుద్దేశంతో నమోదైన కేసుల నుండి పౌరులను కాపాడేందుకు నేర విచారణా నియమావళిలోని సెక్షన్ 482 ఉన్నత న్యాయస్థానాలకు విశాల అధికారాలను ఇచ్చింది. 'రామ్ లాల్ వర్సెస్ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం' కేసులో (తేదీ: 2023, అక్టోబర్ 26), న్యాయస్థానాలు న్యాయ ప్రక్రియ దుర్వినియోగాన్ని అడ్డుకోవడానికి ఈ అధికారాన్ని ఉపయోగించవచ్చని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తప్పుడు కేసులు ఉన్నట్లయితే, ఈ నిబంధన కింద ఉన్నత న్యాయస్థానంలో దావా రద్దుకు అభ్యర్థించవచ్చు. తప్పుడు సమాచారం ఇచ్చి తొలి సమాచార నివేదిక నమోదు చేయించిన ఫిర్యాదుదారులపై చట్టపరమైన చర్యలు తప్పవు. భారతీయ న్యాయ సంహితలో, నకిలీ సాక్ష్యాలు సృష్టించినా, ఉపయోగించినా శిక్షార్హులవుతారు. భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 211 దురుద్దేశంతో తప్పుడు నేరారోపణ చేసిన వారికి శిక్ష విధిస్తుంది. ఈ చట్టపరమైన బాధ్యత నకిలీ ఫిర్యాదుదారుల పట్ల వ్యవస్థ మరింత కఠినంగా వ్యవహరించాల్సిన ఆవశ్యకతను సూచిస్తుంది.

### న్యాయ వ్యవస్థలో సమన్వయం లోపం..

నకిలీ కేసుల వల్ల అమాయకులు అనుభవించిన మానసిక, ఆర్థిక నష్టానికి చట్టంలో పరిహారం పొందే వీలుంది. కేసు రద్దయిన తర్వాత, బాధితులు దురుద్దేశపూర్వక ప్రాసిక్యూషన్ చేసిన వారిపై పరువు నష్టం దావా వేయవచ్చు. తప్పుడు అభియోగాల కారణంగా జైలుపాలైన వ్యక్తికి నష్టపరిహారం చెల్లించే అంశాన్ని అత్యున్నత న్యాయస్థానం కూడా 2025, అక్టోబర్ 29న పరిశీలించింది. న్యాయ ప్రక్రియను అపహాస్యం చేసినందుకు కోర్టులు అపరాధ రుసుము విధించడం ఈ విషయంలో తీసుకునే గట్టి చర్య. న్యాయ వ్యవస్థలో సమన్వయం లోపించడం కూడా నకిలీ కేసులకు కారణమవుతోంది. 'మహిపాల్ సింగ్ వర్సెస్ హర్యానా ప్రభుత్వం' కేసు (తేదీ: 2024, మార్చి 10) లో ఒకే సమస్యపై సివిల్ కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చినా, క్రిమినల్ విచారణ కొనసాగడంపై అత్యున్నత న్యాయస్థానం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తెలంగాణ ఉన్నత న్యాయస్థానం కూడా తప్పుడు కేసులతో కోర్టును తప్పుదోవ పట్టించిన పిటిషనర్లపై జరిమానాలు విధించడం ద్వారా న్యాయ నియంత్రణ ఆవశ్యకతను నొక్కి చెప్పింది.

### రాజ్యాంగంపై నమ్మకం..

పౌరులు తమపై వచ్చిన ఆరోపణల నిష్పక్షపాత విచారణకు, న్యాయం పొందే హక్కుకు అర్హులు. భారత రాజ్యాంగంలోని అనుచ్ఛేదం 14 (సమానత్వం), అనుచ్ఛేదం 21 (జీవించే స్వేచ్ఛ) నకిలీ కేసుల నుండి పౌరులను కాపాడే మూల స్థంభాలు. చట్టాన్ని దుర్వినియోగం చేసేవారు ఎంతటి వారైనా శిక్షకు అర్హులు. ఉన్నత న్యాయస్థానంపై విశ్వాసం ఉంచడం, రాజ్యాంగం కల్పించిన హక్కులను సక్రమంగా వినియోగించుకోవడం ముఖ్యం. నిజం ఎప్పుడూ ఒంటరిగా ప్రయాణించదు. నిజాన్ని నమ్మినవారు ధైర్యంగా నిలబడతారు. నకిలీ కేసుల బెదిరింపులకు వెనుకడుగు వేయకూడదు. న్యాయ నియమావళులకు అనుగుణంగా, చట్టబద్ధమైన జ్ఞానంతో పోరాడాలి. ఉన్నత న్యాయస్థానాల తీర్పులను ఆయుధంగా మలచుకొని ముందుకు సాగాలి. ఎందుకంటే, చట్టబద్ధమైన పోరాటమే హక్కు, న్యాయమే గమ్యం. జాగరూకతే నిజమైన రక్షణ.



# భైరవానితిప్ప ప్రారంభించింది టీడీపీయే

## పూర్తి చేసేది కూడా తామే • మంత్రి లోకేశ్

**అనంతపురం :** భైరవాని తిప్ప ప్రారంభించింది టీడీపీయేనని.. పూర్తి చేసేది కూడా టీడీపీనేనని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. భక్త కనకదాస జయంతి సందర్భంగా అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరై ఆయన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. భక్త కనకదాస జయంతి సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక తత్వవేత్తగా, స్వరకర్తగా భక్త కనకదాస సమాజ చైతన్యానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. తన కీర్తనలు, రచనలతో ఆధ్యాత్మిక విలువలు పెంపొందించారని చెప్పారు. ఆ మహనీయుని జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. భగవాన్ కృష్ణుడిని కూడా కనకదాసు తన వైపు తిప్పుకున్నారని కొనియాడారు. అహంకారం ఎప్పుడు తగ్గుతుందో ఆరోజే మోక్షం కల్గుతుందని కనకదాస చెప్పారు. కల్యాణదుర్గంలో రాష్ట్ర స్థాయి భక్త కనకదాస జయంతిలో పాల్గొనడం, భక్త కనకదాస విగ్రహాన్ని ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆర్డీటీకి త్వరలోనే ఎఫ్ సీఆర్ఏ రెన్యూవల్ చేయిస్తున్నామని లోకేష్ తెలిపారు. ఆర్డీటీ సంస్థకు మరింత ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాకు తెలుగుదేశం పార్టీకి అండగా ఉంటుందని చెప్పారు. తమ తాత, మామయ్యలను గెలిపించి అసెంబ్లీకి పంపారని గుర్తుచేశారు. ఈ నేలకు తాము ఎంత చేసినా తక్కువే అని చెప్పారు. జీవితాంతం జిల్లా ప్రజలకు రుణపడి ఉంటామన్నారు. కురుబలు ఎప్పటికీ తెలుగుదేశం పార్టీ వైపు ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. కురుబలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. 300కోట్లు ఇచ్చామన్నారు. కురుబలకు రాజకీయంగా, ఆర్థికంగా స్వాతంత్రం తెచ్చింది టీడీపీనేనని చెప్పారు. 2019 నుంచి 24 వరకు చీకటి రోజులు చూశామని లోకేష్ విమర్శించారు. అనేక మంది బీసీలపై దాడులు, హత్యలు చేశారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అందుకే బీసీలు 94 శాతం ఓట్లు వేసి టీడీపీని అధికారంలోకి తీసుకొచ్చారని చెప్పారు. భక్త కనకదాసుకు ఆలయాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పూజారులకు గౌరవ వేతనం కూడా ఇస్తామన్నారు. వచ్చే 12నెలల్లో కురుబ భవనాలన్నీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. తనకు సోదర సమానమైన పవన్ కళ్యాణ్ తో మాట్లాడి కురుబలకు న్యాయం చేస్తామన్నారు. మంత్రి సవిత తనతో పోట్లాడుతుంటారని.. బీపీ బిల్లలు వేసుకోమని చెప్పానన్నారు. ఆమె శాఖ పరంగా ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారని చెప్పారు. నవంబర్ 8న భక్త కనకదాసు జయంతిని రాష్ట్ర పండుగగా కూటమి ప్రభుత్వం నిర్వహిస్తోంది. కర్ణాటకలోని బాడా గ్రామంలో 1509లో జన్మించిన భక్త కనకదాస అసలు పేరు తిమ్మప్ప నాయకుడు. చిన్నతనం నుంచే శ్రీకృష్ణుడికి పరమ భక్తుడు. సాధారణ ప్రజలకూ అర్థమయ్యేలా ఎన్నో కీర్తనలు, గ్రంథాలను రాశారు. తన జీవితాన్ని శ్రీ కృష్ణ పరమాత్మ సేవకు వినియోగించారు. ఈయన జయంతిని సెలవుదినంగా ప్రకటించి కర్ణాటక ప్రభుత్వం పండుగలా నిర్వహిస్తుంది. కురబలు ఎక్కువగా ఉన్న మన రాష్ట్రంలోనూ వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు.

# వైఎస్ వివేకానంద హత్య కేసులో కీలక మలుపు

## ఇద్దరు పోలీసు అధికారులపై కేసు నమోదు



**అమరావతి :** మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో మరో కీలక మలుపు చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించి వివేకా కుమార్తె వైఎస్ సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర రెడ్డి, సీబీఐ ఎస్పీ రామ్ సింగ్‌లపై తప్పుడు కేసులు నమోదు చేయించిన ఇద్దరు పోలీసు అధికారులపై పులివెందుల పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ రామకృష్ణారెడ్డి, విశ్రాంత ఏఎస్పీ రాజేశ్వర్ రెడ్డి అనే ఇద్దరిపై ఈ కేసులు నమోదయ్యాయి. సుప్రీంకోర్టు తాజా తీర్పు వెలువడిన తర్వాత కేసులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వివేకా హత్య కేసు 2019 మార్చి 15న కడప జిల్లా పులివెందులలో జరిగింది. ఆయన ఇంట్లోనే మృతదేహం కనుగొన్నారు. ఈ కేసు సీబీఐకి హైకోర్టు అప్పగించింది. విచారణ సమయంలో ఆరోపణలు, సాక్షుల మరణాలు, తప్పుడు కేసులు చాలా వచ్చాయి 2019-2021 మధ్య, వివేకా హత్య కేసు దర్యాప్తులో సునీత, ఆమె భర్త రాజశేఖర్ రెడ్డి, సీబీఐ ఎస్పీ రామ్ సింగ్‌లపై రాజేశ్వర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి నేతృత్వంలో తప్పుడు కేసులు నమోదు చేయించారని ఆరోపణ. ఇవి కేసు దర్యాప్తును ప్రభావితం చేయడానికి, సాక్షులను బెదిరించడానికి ఉద్దేశించినవని ఆరోపణలు ఉన్నాయి. సుప్రీంకోర్టు ఇటీవల వివేకా కేసు ట్రాన్స్‌ఫర్, మరిన్ని దర్యాప్తులపై తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు ఆధారంగా, తప్పుడు కేసులపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మొత్తం 22 మంది సాక్షుల విచారణలో ఈ అధికారుల పాత్ర బయటపడినట్లుగా తెలుస్తోంది. పులివెందుల పోలీసులు శుక్రవారం ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఇది %భాజ% సెక్షన్లు 211 (తప్పుడు కేసు నమోదు), 506 (బెదిరింపు) కింద కేసు రిజిస్టర్ చేశారు. సీబీఐ వివేకా హత్య కేసులో దూకుడుగా దర్యాప్తు చేస్తున్న సమయంలో వివేకా పీఏ కృష్ణారెడ్డి తనను వైఎస్ సునీత, ఆమె భర్త రాజశేఖర్ రెడ్డితోపాటు సీబీఐ ఎస్పీ రాంసింగ్ బెదిరిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాంసింగ్ తప్పుడు వాంగ్మూలం ఇవ్వాలని అవినాష్ రెడ్డికి వ్యతిరేకంగా చెప్పాలని బెదిరించారని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఓ సంచలనాత్మకమైన హత్య కేసులో దర్యాప్తు జరుపుతున్న అధికారిపై నేరుగా రివర్స్ లో పోలీసులు కేసు పెట్టడం అప్పట్లోనే కలకలం రేపింది. అప్పటి ప్రభుత్వం వివేకా కేసులోసీబీఐపై ఆరోపణలు చేస్తూ రావడతో .. విచారణకు సహకరించలేదని తేలిపోయింది. సీబీఐని తప్పు పట్టడానికి, విచారణను స్లో చేయడానికి ఈ తప్పుడు కేసుల వ్యూహం ఎంచుకున్నారని అనుమానిస్తున్నారు. సుప్రీంకోర్టు ఆ కేసులన్నీక్వాష్ చేసి.. తప్పుడు కేసులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో ఇప్పుడు కేసులు నమోదు చేశారు. ఒకరు ఇప్పటికే రిటైర్ అయ్యారు. మరొకరు సర్వీసులో ఉన్నారు. ఆ అధికారిని సస్పెండ్ చేసే అవకాశం ఉంది.

# 48 గంటల్లో గన్ని సంచుల సరఫరా

● అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి



**ఖమ్మం, నవంబర్ 8:( సమయం న్యూస్ ) :** ధాన్యం కొనుగోలుకు అవసరమైన మేర గన్ని బ్యాగులు అందుబాటులో ఉన్నాయని, ప్రతిపాదనలు పంపిన 48 గంటల లోపు కొనుగోలు కేంద్రాలకు గన్ని సంచులు సరఫరా చేస్తున్నామని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ - 2025ధాన్యం కొనుగోలుకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేశామని అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో పెట్టడం జరిగిందని అన్నారు. ధాన్యం కొనుగోలు అవసరాలకు మాత్రమేగన్ని సంచులు అందించడం జరుగుతుందని, రైతుల ఇంటి వద్దకు గన్ని సంచులు ఇవ్వవద్దని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని అన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఇప్పటివరకు 9 లక్షల 71 వేల 500 గన్ని సంచులు పంపిణీ చేశామని అన్నారు. గన్ని సంచుల కోసం కొనుగోలు కేంద్రాలు ఇండెంట్ పెట్టిన 48 గంటల లోగా సరఫరా చేస్తున్నామని, గన్ని సంచులకు జిల్లాలో ఎక్కడా కొరత లేదని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కొడంగల్ ప్రభుత్వ బిసి బాలికల వసతి గృహం,కళాశాల వసతి గృహం లో పేరెంట్స్ మీటింగ్

● పాఠశాలలో కళాశాలలో సత్ప్రవర్తన

● క్రమశిక్షణ కలిగి ఉండాలి-హే డబ్ల్యూ ఓ(HWO)నిర్మల



**కొడంగల్ మున్సిపల్(మం)నవంబర్08(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ బిసి బాలికల వసతి గృహం మరియు కళాశాల వసతి గృహం యందు విద్యార్థినుల తల్లిదండ్రుల శనివారం సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులయొక్క సందేహాలను నివృత్తి చేస్తూ వారికి వసతి గృహం లో గల అన్ని వసతుల గురించి విద్యార్థులకు నేరుగా అందుతున్న మెనూ కాస్మెటిక్స్ గురించి క్లుప్తంగా వివరించడం జరిగింది. విద్యార్థినిలు అందరూ కూడా సమాజంలో, పాఠశాలలో కళాశాలలో సత్ప్రవర్తన క్రమశిక్షణ కలిగి ఉండాలి విద్యార్థులు వారి యొక్క తల్లిదండ్రులతో కలిపి సమావేశం అనంతరం హాజరైన తల్లిదండ్రులందరికీ భోజన వసతిని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో వసతి గృహ సంక్షేమ అధికారి నిర్మల సిబ్బంది తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ

- మాజీ మున్సిపల్ చైర్మన్ ఆర్ జగదీశ్వర్ రెడ్డి



**కొడంగల్ మున్సిపల్ (మం)నవంబర్,08(సమయం న్యూస్) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా వికారాబాద్ జిల్లా కోడంగల్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు బిస్కెట్లు పంపిణీ చేసిన కొడంగల్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఆర్. జగదీశ్వర్ రెడ్డి,మాజీ కో ఆప్షన్ మెంబర్ మునీర్,వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆసీఫ్ ఖాన్,శ్రీకాంత్,ముఖిద్ తదితరులు ఉన్నారు

# రోడ్డు ప్రమాదంలో మరణించిన గ్రామ కార్యదర్శి సతీష్ రెడ్డి పార్థివ దేహానికి శ్రద్ధాంజలి

● ఘటించిన జిల్లా కలెక్టర్

**మహబూబ్ నగర్ నవంబర్08( సమయం న్యూస్).:** భూత్పూర్ మండలం హస్నాపూర్ గ్రామం లో శుక్రవారం రోడ్ ప్రమాదంలో చనిపోయిన మూసాపేట మండలం వేముల గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీష్ రెడ్డి పార్థివ దేహానికి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి శ్రద్ధాంజలి ఘటించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. ప్రభుత్వ పరంగా రావలసిన బెనిఫిట్స్ అందించుటకు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు.తహశీల్దార్ కిషన్ తదితరులు ఉన్నారు

# కెసిఆర్ ఇండ్లు ఇస్తే .. రేవంత్ హైడ్రాతో కూలుస్తుండు

● బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల

జూబ్లీహిల్స్ ఎలక్షన్లో భాగంగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి గారి ఆదేశాల మేరకు ఇన్చార్జి మాజీ మంత్రివర్యులు సబితా ఇంద్రారెడ్డి గారి ఆధ్వర్యంలో ఈరోజు ఎల్లారెడ్డి గుడా శ్రీనగర్ కాలనీ ప్రాంతంలో బూత్ ఇన్చార్జిలో బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ మరియు చిలుక నగర్ డివిజన్ మరియు మహేశ్వరం నియోజకవర్గ నాయకులతో కలిసి బూత్ నంబర్ 294,295,296 లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సునీత గోపీనాథ్ గారికి కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలనీ అభ్యర్థించడం జరిగింది. కేసీఆర్ గారి 10 సంవత్సరాల అభివృద్ధిని రేవంత్ రెడ్డి రెండు సంవత్సరాల విధ్వాంసాన్ని జూబ్లీహిల్స్ నియోజకవర్గం ప్రజలు భేరీ చేసుకోవాలని, అదేవిధంగా రాష్ట్రంలో హైడ్రా పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేద ప్రజల ఇండ్లు కోలుస్తుందని అదే కేసీఆర్ గారి 10 సంవత్సరాల పాలనలో లక్ష డబల్ బెడ్ రూములు ఇల్లు నిర్మించి పేద ప్రజలను ఆదుకున్నదని గుర్తు చేశారు. బూత్ ఇన్చార్జిలో



ఏదుల కొండల్ రెడ్డి కోకొండ జగన్ మాస శేఖర్ ,సుందర్ ,శ్యామ్ బంటి,సాయి మొదలగువారు పాల్గొన్నారు

# ఘనా దేశంలో పెట్టుబడులకు సింగరేణికి ఆహ్వానం

- సానుకూలంగా స్పందించిన సింగరేణి యాజమాన్యం
- కీలక ఖనిజాలలో భాగస్వాములమవుతామని వెల్లడి
- సింగరేణి విస్తరణలో ఇది ఒక శుభపరిణామం
- సింగరేణి సీఎండీ శ్రీ ఎన్.బలరామ్



**హైదరాబాద్ నవంబరు 8, 2025( సమయం న్యూస్). :** ప్రపంచంలోనే వజ్రాలు, బంగారం, బాక్సైట్, మాంగనీస్, లిథియం తదితర ఉత్పత్తులకు ప్రముఖ దేశంగా పేర్కొనే రిపబ్లిక్ ఆఫ్ ఘనా దేశం సింగరేణి సంస్థను తమ దేశంలో పెట్టుబడులకు ఆహ్వానం పలికింది. హైదరాబాద్ సింగరేణి భవన్ లో శనివారం ఘనా దేశ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం వారు సింగరేణి సంస్థ సీఎండీ శ్రీ ఎన్. బలరామ్ తో సమావేశమై పలు వ్యాపార అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఘనా దేశ ప్రతినిధి బృందం మాట్లాడుతూ తమ దేశం లో ఖనిజ రంగంలో పెట్టుబడులకు అవకాశం ఉందని, ఈ విషయంలో అపార అనుభవం గల సింగరేణి సంస్థకు తాము స్వాగతం పలుకుతున్నామన్నారు.తమ దేశంలో ప్రధానంగా వజ్రాలు, బంగారం, బాక్సైట్, మాంగనీస్ , లిథియం వంటి పలు ఖనిజాల తవ్వకం, ఉత్పత్తులు పెద్ద ఎత్తున జరుగుతుంటాయని విదేశాలకు కూడా ఎగుమతి చేస్తుంటామన్నారు. అయితే ఉత్పత్తి పెంచడానికి ఇందుకు అవసరమైన పెట్టుబడులను ఆహ్వానించడం కోసం వచ్చామని, మైనింగ్ లో ఎంతో అనుభవం ఉన్న సింగరేణి సంస్థ ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. తమ దేశంలో బొగ్గు మైనింగ్ కూడా ఉందని, ఇందు లోనూ సింగరేణి సహకారాన్ని కోరుతున్నట్లు పేర్కొన్నారు. దీనిపై సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ స్పందిస్తూ సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యలో భాగంగా విదేశాల్లో ఇతర ఖనిజాలు, కీలక ఖనిజ రంగాల్లో కూడా ప్రవేశించాలని ఇప్పటికే నిర్ణయించి ప్రయత్నాలు ప్రారంభించిందన్నారు. ఘనా దేశంలో కూడా మైనింగ్ జరపటానికి గల అవకాశాలను పరిశీలిస్తామన్నారు. కీలక ఖనిజ తవ్వకాలకు అవకాశం ఉంటే అధిక ప్రాధాన్యత ఇస్తామని ఆయన పేర్కొన్నారు. మరో నెల రోజుల్లో ఘనా దేశానికి చెందిన సాంకేతిక బృందం కేంద్ర ప్రభుత్వంతో సమావేశం కానుందని ఆ దేశ ప్రతినిధి బృందం పేర్కొంది. ఆ సమయంలో మరో దఫా సమావేశం కావాల్సిందిగా, అలాగే తమ దేశానికి సింగరేణి బృందాన్ని కూడా పంపించాల్సిందిగా వారు సీఎండీని కోరారు. దీనిపై సీఎండీ శ్రీ ఎన్. బల రామ్



సానుకూలంగా స్పందిస్తూ సిం గరేణి అధి కారుల బృందాన్ని పంపిస్తామని పేర్కొ న్నారు. మొత్తం మీద చూస్తే తొలిసారిగా ఒక ఆఫ్రికా దేశంలో అడుగుపెట్టడానికి సింగరేణి సంస్థ ముంగిటకు అవకాశం వచ్చిందని పేర్కొనవ చ్చు. డైరెక్టర్ (పి అండ్ పి) శ్రీ కె.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పర్సనల్) శ్రీ గౌతమ్ పొట్రు, జీఎం(కో ఆర్డినేషన్) శ్రీ టి.శ్రీనివాస్, ఘనా దేశ ప్రతినిధి బృందంలో బిజినెస్ కన్సల్టెంట్ శ్రీ అబ్దుల్ సలాం మోర్గాన్ అగ్బోటు, ఘనా దేశం తరఫున మాలి దేశ రాయబారి శ్రీ అహ్మద్ ఉమర్ సాండా , ఘనాదేశ అధ్యక్షులు జాన్ సోదరులు ప్రముఖ వ్యాపారవేత్త మైకేల్ మహామ , ఘనా దేశ స్టాండర్డ్స్ బోర్డ్ ఛైర్మన్ శ్రీ మొగ్తారి హుడు, ఘనా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కార్యాలయ సీనియర్ కరస్పాండెంట్ శ్రీ అగ్రే ఎలిషమా ఫ్రెడరిక్ , నేషనల్ సెక్యూరిటీ విభాగం అధికారి శ్రీ అంగా మ్వైన్ సైతాసలిపు, ప్రముఖ వ్యాపారవేత్త శ్రీమతి అగ్బెంకోర్ ఎడ్నా ఈడెం , ఘనా బిజినెస్ హెడ్ శ్రీమతి పరుల్ కక్కర్ పాల్గొన్నారు.- చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్

# భద్రాద్రి టీవీవీపీ ఆసుపత్రులు భేష్

- ఏజెన్సీ ప్రాంతమైన సేవలు అద్భుతం
- సి ఆర్ ఎం- జాతీయ బృందం కితాబు

**కొత్తగూడెం నవంబర్08( సమయం న్యూస్).:** జిల్లాలో వైద్య సేవలు, ప్రమాణాలు పరిశీలించడాని వచ్చిన సి ఆర్ ఎం ( కామన్ రివ్యూ మిషన్) బృంద సభ్యులు డాక్టర్ జి బి సింగ్ రాష్ట్ర స్థాయి లో నిన్న ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక లో జిల్లాలో తాము పరిశీలించిన ఇల్లందు, భద్రాచలం ఆసుపత్రుల సేవలపై ప్రత్యేక ప్రస్తావన తెచ్చారు .మారుమూల ప్రాంతాల్లో సైతం స్పెషలిస్ట్ వైద్య సేవలు అద్భుతంగా అందుతున్నాయని, మంచి ప్రమాణాలు సైతం పాటిస్తూ నాణ్యమైన వైద్యం అందిస్తున్నారని కొనియాడారు . అన్ని స్థాయిలలో సిబ్బంది సైతం ఎంతో శ్రద్ధ,అంకిత భావంతో తో సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఆసుపత్రులలో అన్ని వార్డుల ను క్షుణ్ణం గా పరిశీలించినప్పుడు చాలా మంది రోగులతో తాము మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నామని , వైద్య సేవల పై అందరూ చాలా సంతృప్తిగా ఉన్నారని అన్నారు. ఆసుపత్రులు లో వార్డులు, ఆపరేషన్ థియేటర్ , లేబర్ రూమ్ లు చాలా బాగా నిర్వహిస్తున్నారని, సానిటేషన్ కూడా బాగుందని కితాబిచ్చారు.జిల్లాలోని డయలిసిస్ సేవలు కూడా చాలా బాగున్నాయని అన్ని సెంటర్స్ లో అన్ని బెడ్స్ నిండి ఉన్నాయన్నా సంగతి తాము గమనించామని తెలిపారు.ఇల్లందు ఆసుపత్రి లో భవన స్థలం తక్కువ ఉన్నప్పటికీ సేవలు స్థాయికి మించి



చేస్తున్నారని తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో సైతం రేడియాలజిస్ట్ ,మత్తు వైద్యులు , ఇతర స్పెషలిస్ట్ వైద్యులు సరిపడా స్థాయిలో ఉండడం , టిఫా స్కాన్ సేవలు సైతం ఉండడం విశేషం అని తెలిపారు. భద్రాచలం ఆసుపత్రి జిల్లాకే గర్వకారణం అని, 200 పడకలతో ఐసీయూ,ఎస్ ఎన్ సి యు , ఎన్ ఆర్ సి , ఆపరేషన్ థియేటర్ సేవలు అద్భుతంగా ,ఆదర్శంగా ఉన్నాయన్నారు.తీవ్ర స్థాయిలో సిబ్బంది కొరత ఉన్న వాటిని అధిగమించి అక్కడ ఉన్న సిబ్బంది ఎంతో కష్టపడి పనిచేస్తున్నారని కితాబిచ్చారు .సిబ్బంది కొరత తీరితే మరింత సేవలను అందించే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అన్ని స్థాయిలో ఆసుపత్రిలో ప్రమాణాల విషయం లో నిరంతరంగా శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని సూచించారు.ఆసుపత్రులలో మౌలిక వసతులు , సీ ఎస్ ఆర్ నిధుల వినియోగం మరియు ఇతర విషయాలలో జిల్లా కలెక్టర్ మద్దతు, ప్రోత్సాహం బాగుందని వారు తెలిపారు. ఈ సమావేశం లో సి ఆర్ ఎం సభ్యులతో పాటు రాష్ట్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ కమీషనర్ సంగీత సత్యనారాయణ, టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ కుమార్,డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్, భద్రాద్రి జిల్లా డి సి హెచ్ ఎస్ డాక్టర్ రవి బాబు, డీఎంహెచ్ ఓ డాక్టర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- బాలానగర్ పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం పరిశీలన



**వేములవాడ, నవంబర్ - 08( సమయం న్యూస్).:**రైతులు తాము కష్టపడి పండించిన పంట ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని బాలానగర్ లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్ శనివారం ఆకస్మికంగా పరిశీలించారు.

ముందుగా రైతులు కొనుగోలు కేంద్రంలో పోసుకున్న ధ్యానం కుప్పలను పరిశీలించి, ధాన్యం ఎప్పుడు తీసుకువచ్చారు? స్థానికంగా కల్పించిన వసతులపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా లో ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో మొత్తం 238 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇప్పటి వరకు 48,325 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వెల్లడించారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ. 2389, సాధారణ రకానికి రూ. 2369 గా నిర్ణయించిందని తెలిపారు. రైతులు తమ సమీపంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి, మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని వసతులు కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. సరైన తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రామక్రిష్ణ, అధికారులు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

# పదవతరగతి వార్షిక పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

- జిల్లా కలెక్టర్ విజేంధిర బోయి.



**భుత్నూరు నవంబర్08( సమయం న్యూస్).:**పదవ తరగతి వార్షిక పరీక్షల్లో మంచి మార్కులతో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి విద్యార్థినిలకు సూచించారు.శనివారం భూత్పూర్ మండల కేంద్రం లోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ

ఇందుకుగాను రెగ్యులర్ గా పాఠశాలకు హాజరుకావాలని అన్నారు.పదవ తరగతి విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడి పాఠ్యాంశాల బోధన,ప్రత్యేక తరగతులు,మెనూ,మౌలిక వసతులపై అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా అడిగారు ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ రెగ్యులర్ గా పాఠశాలకు హాజరవుతూ సబ్జెక్టు విషయాల పట్ల ఎప్పటికప్పుడు అప్డేట్ గా ఉండాలని అన్నారు. పాఠశాల నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పారిశుద్ధ్యం ,విద్యార్థినిల ఆరోగ్యం, భోజనం, తదితర అంశాల పట్ల ఏలాంటి సమస్యలు రాకుండా చూడాలని ఆదేశించారు .వంట శాలలో విద్యార్థినులకు వండిన ఆహారం ను పరిశీలించారు.విద్యార్థి నిలకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.కలెక్టర్ వెంట తహశీల్దార్ కిషన్,తదితరులు ఉన్నారు

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి



**హనుమకొండ నవంబర్08( సమయం న్యూస్). :** హనుమకొండ జిల్లా పరిధిలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి శనివారం పరిశీలించారు. ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల, ఎల్కతుర్తి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను నిర్వాహకులను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అమ్మకానికి ధాన్యాన్ని తీసుకు వచ్చిన రైతులతో అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాట్లు, కొనుగోలు ప్రక్రియ సంబంధించిన వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేయాలని నిర్వాహకులకు అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి సూచించారు.

# ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ చీఫ్ విప్ -డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి





**హైదరాబాద్, నవంబర్,08(సమయం న్యూస్) :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి. ఇలాంటి మరెన్నో జన్మదిన వేడుకలు జరుపు కోవాలని... ప్రజా మన్ననలు పొందాలని ఆకాంక్షించిన మహేందర్ రెడ్డి.నాయకులు రోహిణ్ రెడ్డి తదితరులు ఆయనతో ఉన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు.



**రాయపోల్,నవంబర్8:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు మండల కేంద్రం రాయపోల్ అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తప్పెట సుధాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకొని,టపాసులు కాల్చారు.సీఎం రేవంత్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అంతకు ముందు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కిష్టారెడ్డి,దుర్గాప్రసాద్, ఇప్ప మల్లేశం,గొల్లపల్లి మహేష్,పాల రామాగౌడ్,యూత్ మండల అధ్యక్షులు దయాకర్,మాజీ ఎంపీటీసీ స్వామి, కొన్ని%శీ%టి రాజు,సురేష్, మల్లారెడ్డి,ఆంజనేయులు,చందు,నర్సింగారావు, రాజు,తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ప్రచారంలో కోస్గి మైనార్టీ నాయకులు




**కోస్గి మున్సిపల్(మం) నవంబర్,08(సమయం న్యూస్) :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. శనివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని బోరబండ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నారు.హైద్రాబాద్ లోని బోరబండ ప్రాంతంలో నివసిస్తున్న కోస్గి సెటిలర్స్ ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కొడంగల్ నియోజకవర్గం కోస్గి పట్టణ మున్సిపల్ మైనార్టీ నాయకులు ఎండి సలీం,ఫిరోజ్,హాజీ,కలీం,ఇలియస్ పాల్గొన్నారు.

# హెూరాహెూరీగా హ్యాండ్ బాల్ పోటీలు.



**కోస్గి మున్సిపల్(మం)నవంబర్,08(సమయం న్యూస్) :** రాష్ట్ర స్థాయి అండర్ 17 హ్యాండ్ బాల్ పోటీలు హెూరాహెూరీగా కొనసాగాయి.శనివారం లీగ్ పద్దతిలో జరుపుతున్న పోటీలలో తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల నుండి బాలబాలికల జట్లు పోటీ పడుతున్నాయి.శనివారం నాటి మ్యాచ్ లో బాలికల విభాగంలో మహబూబ్ నగర్,కరీం నగర్ మధ్య జరిగిన పోటీలో మహబూబ్ నగర్ 6-3 తేడాతో గెలుపొందింది.అదే విధంగా ఆదిలాబాద్,వరంగల్ మధ్య పోటీలో ఆదిలాబాద్ 11-2 తేడాతో,ఆదిలాబాద్, నిజామాబాద్ 10-0 తేడాతో ఆదిలాబాద్,మెదక్ మధ్య జరిగిన మ్యాచ్ లో ఆదిలాబాద్ 14-2 తేడాతో గెలుపొందింది.బాలుర విభాగంలో మహబూబ్ నగర్ జట్టు హైద్రాబాద్ పై 8-6,రంగారెడ్డి పై 13-7,మెదక్ పై 6-7,ఖమ్మం పై 15-9కరీంనగర్ పై 11-7తేడాతో మహబూబ్ నగర్ గెలుపొందింది. మూడు రోజులపాటు జరగనున్న హ్యాండ్ బాల్ పోటీలు ఆసక్తిని కలిగిస్తున్నాయి.ఆదివారం నాడు బాలికల విభాగంలో సెమీ ఫైనల్ లు అదిలాబాద్,కరీంనగర్ మధ్య,మహబూబ్ నగర్ మెదక్ మధ్య జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.ఈసందర్బంగా జిల్లా ఎస్ జి ఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి,పీడీ లు నర్సింహ్మ,బాలరాజు ఆయా జట్ల మేనేజర్లు,కోచ్ లు పాల్గొన్నారు.

# రైతుల కోసం ఆధునిక సాంకేతికతతో కృషివాస్ యాప్

- దమ్మపేటలో పైలట్ ప్రాజెక్ట్ త్వరలో ప్రారంభం.

**కొత్తగూడెం నవంబర్08( సమయం న్యూస్). :** రైతులకు ఈ యాప్ ద్వారా తాము సాగు చేస్తున్న పంటల్లో ఎలాంటి సమస్యలు అయినా అంటే భౌతిక మరియు జీవ సంబంధ వత్తిడిలను శాటిలైట్ ద్వారా ముందస్తు హెచ్చరికలు రూపంలో ఇస్తారు. తదనుగుణంగా రైతులు పంటలో వున్న సమస్యలను గుర్తించి, సమస్య ఎక్కడ ఉందో ఆ చోట తగు చర్యలు తీసుకొని పంటను కాపాడుకోవచ్చు.ఈ యాప్ గురించి జిల్లా కలెక్టర్ జీతేష్ పాటిల్ మరియు జిల్లా వ్యవసాయ అధికారి బాబు రావు, జిల్లా ఉద్యాన అధికారి కిషోర్ లకు గూగుల్ మీట్ ద్వారా కృషి వాస్ ప్రతినిధిలు శ్రీకాంత్, ఆదర్శ్ విషదీకరించారు. ప్రధాన ప్రారంభ కార్యక్రమం 2025 నవంబర్ లో వ్యవసాయ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వర్ రావు గారు ప్రారంభిస్తారు.ఆధునిక డిజిటల్ యుగంలో కృషివాస్ యాప్ వాడకంపై అవగాహన కల్పించడానికి ఒక ఓరియంటేషన్ కార్యక్రమాన్ని దమ్మపేటలో నిర్వహించడం జరిగింది. కృషివాస్ యాప్ యొక్క లక్ష్యం రైతులకు మొబైల్ ద్వారా హెచ్చరికలు, నావిగేషన్ మొదలైన వాటిలో జియోట్యాగింగ్/యాప్ ఇన్‌స్టాలేషన్‌పై శిక్షణ ఇవ్వడం. ఇది తెలంగాణ ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమం మరి యు దమ్మపేట మండలాన్ని పైలట్ మండలంగా ఎంపిక చేశారు.ఈరోజు జరిగిన గూగుల్ మీట్ లో అశ్వారా వుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు రవి కుమార్, దమ్మపేట మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఎచ్ ఇ ఓ ఈశ్వర్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కళోత్సవ్ పోటీల్లో..

### అ కరీంనగర్ జిల్లాకు 4 మొదటి స్థానాలు





**కరీంనగర్ నవంబర్08( సమయం న్యూస్).:** విద్యాశాఖ ఆధ్వర్యంలో హైదరాబాదులో గురు, శుక్రవారాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కళోత్సవ్ పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు నాలుగు ప్రథమ బహుమతులు సాధించారు. ఇందులో రెండు స్థానాలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, మరో రెండు స్థానాలు ప్రైవేటు విద్యార్థులు సాధించారు. మొత్తం 12 రంగాల్లో పోటీలు నిర్వహించగా అందులో నాలుగు రంగాల్లోనూ కరీంనగర్ విద్యార్థులే విజయం సాధించడం విశేషం. థియేటర్ ఆర్ట్స్ గ్రూపులో తిమ్మాపూర్ కేజీబీవీ విద్యార్థులు, ఇన్స్ట్రుమెంటల్ మ్యూజిక్ గ్రూప్ లో వెన్నంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం సాధించారు. అల్ఫోర్స్ స్కూల్ విద్యార్థి క్లాసికల్ సోలో పాటల విభాగంలో, పారమిత విద్యార్థి సంగీత విభాగంలో మొదటి స్థానంలో నిలిచారు. వీరంతా త్వరలో ఢిల్లీలో జరగబోయే జాతీయస్థాయి కళోత్సవ్ పోటీల్లో పాల్గొంటారు.



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి గారు, మాజీ డీసీసీబీ చైర్మన్ శ్రీ పోచారం భాస్కర్ రెడ్డి గారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ డిసిసిబి చైర్మెన్ శ్రీ పోచారం భాస్కర్ రెడ్డి గారు

బాన్సువాడ SMB ఫంక్షన్ హాల్ లో బాన్సువాడ వాస్తవ్యులు శ్రీ బోడ నరహరి గారి కుమార్తె దీక్షిత వివాహానికి హాజరైన నూతన వధూవరులు దీక్షిత – హరీష్ నాయర్ లను ఆశీర్వదించీ శుభాకాంక్షలు,బోధన్ కొత్త రమాకాంత్ ఫంక్షన్ హాల్ లో బాన్సువాడ వాస్తవ్యులు కాచం శ్రీనివాస్ గుప్తా గారి కుమారుడు సచిన్ వివాహానికి హాజరైన నూతన వధూవరులు సచిన్ – శ్రేయ లను ఆశీర్వదించీ శుభాకాంక్షలు తెలిపారుఈ శుభకార్యాలలో బాన్సువాడ నియోజక వర్గ ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

## నూతన అడ్వికేట్ గా పదోన్నతి పొందిన రవి కుమార్

### శుభాకాంక్షలు తెలిపిన పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి

**పరిగి మున్సిపల్(మం) నవంబర్ 08 (సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా పరిగి పట్టణ బీఆర్ఎస్ పార్టీ నాయకులు జేపీసీ రవి కుమార్ నూతన ఎన్రోల్ మెంట్ అడ్వికేట్ పత్రాన్ని అందుకున్న సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి తో మర్యాద పూర్వకంగా కలిసారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి చేతుల మీదుగా ఎన్రోల్ మెంట్ అడ్వికేట్ పత్రాన్ని జేపీసీ రవి కుమార్ అందుకున్నారు. అదేవిధంగా రవి కుమార్ కు మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

## ఫారిన్ టూర్ కు పాలమూరు ఎంపీ



– పాలమూరు ఎంపీ Dk.అరుణమ్మకు అరుదైన గౌరవం

– దేశ రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముతో కలిసి అధికారికంగా విదేశీ పర్యటనకు మహబూబ్ నగర్ ఎంపీ Dk..అరుణ

– కొద్దీ సేపటి క్రితమే ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో సౌతాఫ్రికా టూర్ బయల్దేరి వెళ్లిన రాష్ట్రపతి బృందం

– గౌరవనీయులైన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి అంగోలా, బోట్స్వానా దేశాలలో భారత అధికారిక ప్రతినిధిగా పర్యటించనున్న ఎంపీ Dk.అరుణ

# ఆరోగ్య పరిరక్షణ పై ప్రజల్లో అవగాహన పెంపుకు చర్యలు.

**ఆదిలాబాద్ నవంబర్08( సమయం న్యూస్) :** జి ల్లాలో స్వచ్ఛత, నీటి సంరక్షణ, ఆరోగ్య పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపునకు నవంబర్ 13, 14 తేదీల్లో విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం క్యాంపు కార్యాలయం నుంచి జూమ్ ద్వారా నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ కార్యాచరణను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నవంబర్ 13న మండలాల పరిధిలో ఎంపిక చేసిన పంచాయతీల్లో "మన ఊరు – మన నీరు" కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువత, గ్రామస్తులతో అవగాహన ర్యాలీలు ఏర్పాటు చేసి, నీటి సంరక్షణపై ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించాలని సూచించారు. అనంతరం పాఠశాలల్లో స్పీచ్‌లు, డిబేట్‌ల ద్వారా నీటి ప్రాముఖ్యత, పొదుపు చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పాఠశాలలు, గ్రామపంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో వర్షపు నీటి నిల్వలు, వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు, కమ్యూనిటీ సోక్ పిట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.

నవంబర్ 14న అన్ని పాఠశాల కాంప్లెక్సుల్లో "ఆరోగ్య జాతర" నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థులతో స్కిట్స్, పాటలు, నృత్యాలు నిర్వహించి ఆరోగ్యంపై సందేశాలు ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా అన్ని పాఠశాలల్లో న్యూట్రి గార్డెన్స్ (పోషక తోటలు)ను ఈజీఎస్ కింద ప్రారంభించాలని ఆదేశించారు. స్పెషల్ క్యాంపెయిన్ 5.0లో భాగంగా ప్రతి పాఠశాలలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టి, పాడైన వస్తువులను ఉపయోగించదగినవి, మరమ్మతు చేయదగినవి, వాడలేనివిగా మూడు రకాలుగా వర్గీకరించాలని కలెక్టర్ సూచించారు. వినియోగం లేని సామగ్రి, స్క్రాప్‌ను గ్రామపంచాయతీకి అప్పగించాలని ఆదేశించారు. పాఠశాలలు, గ్రామాలు పరిశుభ్రత, నీటి సంరక్షణ, ఆరోగ్య పరిరక్షణలో ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమాల అమలులో డిఆర్డిఏ, విద్యాశాఖ, పంచాయతీ రాజ్, ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# సీఎం సహాయనిధి చెక్కులు అందజేత.

### ● కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తప్పటి సుధాకర్.



**రాయపోల్,నవంబర్8:** పేద ప్రజల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా ముఖ్య మంత్రి సహాయ నిధి అని కాంగ్రెస్ పార్టీ రాయపోల్ మండల అధ్యక్షులు తప్పటి సుధాకర్ అన్నారు. శనివారం రాయపోల్ మండలంలో వివిధ గ్రామాల లబ్ధిదారులకు సీఎం సహాయనధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. ఆరోగ్య శ్రీ లో వర్తించని వ్యాధులకు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు వైద్యానికి అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయాన్ని బాధితులకు అందిస్తుందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి సహకారంతో మంతూర్ గ్రామానికి చెందిన బండారు శ్రీనివాస్ రూ. 55 వేలు,తోడెంగల మల్లయ్య రూ. 47,500. తిమ్మక్ పల్లి కాశిరెడ్డి మంజుల రూ. 60 వేలు, లింగారెడ్డి పల్లి తోట కిష్టమ్మ రూ. 60 వేలు, ముంగిస్ పల్లి భూపతి రావు రూ. 60 వేల సీఎం సహాయనిది చెక్కులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. మండల వ్యాప్తంగా ఎవరు అనారోగ్యానికి గురైన సీఎం సహాయనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొత్తపల్లి స్వామి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు పట్నం యాదగిరి,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు దయాకర్, గ్రామ అధ్యక్షులు సాకలి కిష్టయ్య , ఉపాధ్యక్షులు కోతి నర్సింలు, మాజీ సర్పంచ్ మల్లేశం, కాంగ్రెస్ నాయకులు దుర్గాప్రసాద్, కిష్టారెడ్డి, మహేష్ యాదవ్, యాదగిరి, జనార్దన్ రెడ్డి,డా. చందు, తొడెంగల మహేష్, సేవ దళ్ జనరల్ సెక్రటరీ మహేందర్ రెడ్డి , అశోక్, పాషా, లక్ష్మణ్, పాపని అంజనేయులు,మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

### - పటాన్ చెరు లో అన్నదాన కార్యక్రమం

**పటాన్‌చెరు, నవంబర్ 8 (సమయం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి 57వ పుట్టినరోజు సందర్భంగా పటాన్‌చెరువు పట్టణంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పటాన్‌చెరు పట్టణ కాంగ్రెస్ కమిటీ, జిల్లా ఐఎన్టియుసి అధ్యక్షులు కోల్కురి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో, సంగారెడ్డి జిల్లా డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పర్స శ్యామ్‌రావు, నావరి శ్రీనివాస్‌రెడ్డి సమన్వయంతో ఈ సేవా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పటాన్‌చెరువు డీఎస్పీ ప్రభాకర్ , 112వ డివిజన్ కార్పొరేటర్ పుష్ప నగేష్ హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం సుమారు 1,500 మంది పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన అతిథులు "రాష్ట్రంలో 3 కోట్ల ప్రజల ఆకాంక్షల ప్రతిరూపమే రేవంత్ రెడ్డి గారు. ఆయన నాయకత్వంలో తెలంగాణ మరింత అభివృద్ధి సాధిస్తుందని విశ్వసిస్తున్నాం'' అని పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదాలతో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు గాండ్ల శ్రీనివాస్, సంజీవ్ రెడ్డి, మతిన్, అతిక్, విక్రమ్ గౌడ్, మహేందర్ రెడ్డి, ముత్తంగి అశోక్, శ్రీను, రమేష్, సతీష్ తదితర కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# ఆసుపత్రుల పరిసరాల నుంచి వీధి కుక్కల తొలగింపును ప్రారంభించిన జీహెచ్ఎంసీ

- ● తొలిరోజు 277 వీధి కుక్కల పట్టివేత
- ● స్టెరిలైజేషన్ అనంతరం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలోని జంతు సంరక్షణ కేంద్రాలకు తరలింపు

**హైదరాబాద్ నవంబర్08( సమయం న్యూస్).:** సుప్రీం కోర్టు ఇటీవల (నవంబర్ 7, 2025) ఇచ్చిన ఆదేశాల మేరకు పాఠశాలలు, ఆసుపత్రులు, క్రీడా సముదాయాలు, రవాణా కేంద్రాలు వంటి ప్రజా ప్రదేశాల నుంచి వీధి కుక్కలను తొలగించాలన్న సూచనలపై గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్ ఆర్ వి కర్ణన్ సత్వరమే స్పందించారు. ఈ నేపథ్యంలో కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రుల పరిసర ప్రాంతాల్లో వీధి కుక్కల పట్టివేత కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ వెటర్నరీ విభాగం ప్రారంభించింది. డ్రైవ్ మొదటి రోజైన శనివారం మొత్తం 277 వీధి కుక్కలను పట్టుకున్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం, శస్త్రచికిత్స (స్టెరిలైజేషన్) అనంతరం ఈ కుక్కలను ఆసుపత్రుల ప్రాంగణాల్లో తిరిగి వదలకుండావాటిని జీహెచ్ఎంసీకి చెందిన జంతు సంరక్షణ కేంద్రాలకు తరలించారు. అక్కడ వాటికి శస్త్రచికిత్స, టీకాలు, సంరక్షణ, మరియు పర్యవేక్షణ చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.

జీహెచ్ఎంసీ తొలుత ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో ప్రారంభించి , తరువాత పాఠశాలలు, కళాశాలలు, రవాణా కేంద్రాలు వంటి ఇతర పబ్లిక్ ప్లేస్ లకు వరకు విస్తరించనున్నట్లు స్పష్టం చేసింది.

# మందిని తొక్కడం మాట తప్పడం రేవంత్ రెడ్డి నైజం.

- వికృత చేష్టలు, విచిత్ర విన్యాసాలు తప్ప ప్రజలకు పనికొచ్చే
- ఒక్క పని చేయడు ఈ ముఖ్యమంత్రి.
- అంబేద్కర్ గారి స్ఫూర్తితో నిర్మించిన సెక్రటేరియట్ కు అంబేద్కర్ పేరు పెట్టడం రేవంత్ రెడ్డికి ఇష్టం లేదు.
- అంబేద్కర్ పేరు ఉందని సెక్రటేరియట్ కి రేవంత్ రెడ్డి పోవడం లేదు.
- మాజీ మంత్రి హరీష్ రావు
- రీయింబర్స్మెంట్ పై బహిరంగ చర్చకు సిద్ధమా రేవంత్ రెడ్డి? నేను సవాల్ విసురుతున్న.
- దొంగే దొంగ అన్నట్టుంది రేవంత్ రెడ్డి తీరు. కిషన్ రెడ్డి రేవంత్ రెడ్డిది ఫెవికాల్ బంధం.
- ఓటుకు నోటు కేసులో ఈడీ కేసు ఉంటే ఎందుకు విచారణ జరగడం లేదు.
- బీహార్ ఎన్నికలకు డబ్బులు పంపుతున్నారని
- ఢిల్లీలో భట్టి విక్రమార్క గారి ఇంట్లో ఐటీ రైడ్లు జరిగాయి.
- పొంగులేటి గారి ఇంట్లో ఈడీ రైడ్స్ ఐతే ఎందుకు చెప్పలేదు.
- ఈడీ ఎందుకు పొంగులేటిపై ప్రెస్ స్టేట్మెంట్ ఇవ్వలేదు.
- బీజేపీతో అంటకాగింది రేవంత్ రెడ్డి.
- బీజేపీతో చీకటి ఒప్పందాలు ఉన్నాయి రేవంత్ రెడ్డికి.
- ఢిల్లీలో బీజేపీతో రేవంత్ రెడ్డి చీకటి రాజకీయాలు బయటపడ్డాయి.
- పీజేఆర్ ను మానసికంగా వేధించి వారి చావుకు కారణమైంది కాంగ్రెస్ పార్టీ.
- మూడు లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని రేవంత్ రెడ్డి చెప్తున్నారు అది నోరా? మోరా?
- రాష్ట్ర ప్రభుత్వ ఆన్లైన్ వెబ్సైట్ టీఎస్ఐపాస్ లో వివరాలు ఉన్నాయి.
- 2024 - 25లో 13,700 కోట్ల పెట్టుబడులు మాత్రమే వచ్చాయి.
- 2025 - 26లో 6,472 కోట్ల పెట్టుబడి వచ్చాయి.
- మాజీ మంత్రి హరీష్ రావు ప్రెస్ మీట్, ఏ తెలంగాణ భవన్.
- మాజీ మంత్రి హరీష్ రావు కామెంట్స్..




**హైదరాబాద్ నవంబర్08( సమయం న్యూస్).** :సీఎం గంటన్నర సేపు ప్రెస్ మీట్ చూసినవారికి రేవంత్ రెడ్డి మానసిక స్థితిపై సందేహం కలుగుతుంది. జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీ ఎన్ని అడ్డదారులు తొక్కినా ఫలించకపోవడంతో ఆ ఫ్రస్టేషన్లో గంటన్నరసేపు అడ్డమైన చెత్త వాగాడు. ఈ ప్రభుత్వం నడపడం మాకు చేతకావడం లేదని ముఖ్యమంత్రి మాటల్లో తేలిపోయింది. రేవంత్ రెడ్డి తన అసమర్థతను చెప్పకనే చెప్పుకున్నాడు.. రెండు సంవత్సరాల రేవంత్ రెడ్డి పాలనలో చేసిందేమీ లేక గత కాంగ్రెస్ పాలనలో చేసింది చూసి ఓటు వేయాలని అడిగాడు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పాలన చూసి ఓటేయమని అడిగారు. ఆనాడు టీడీపీలో ఉండి వైయస్సార్ పావురాల గుట్టలో పావురం అయ్యాడు అని ఎలా అన్నావు.. కాంగ్రెస్ ప్రభుత్వ జలయజ్ఞాన్ని ధనయజ్ఞమని నువ్వే అన్నావు కదా రేవంత్ రెడ్డి. రాజశేఖర్ రెడ్డిని పట్టుకొని క్విడ్ ప్రోకో కింద లక్ష కోట్ల అవినీతి చేశాడని చెప్పింది నువ్వే కదా.. కాంగ్రెస్ పాలనలో తన తండ్రి చనిపోతే దహన సంస్కారాల అనంతరం స్నానానికి నీళ్లు లేని పరిస్థితి ఉండేదని చెప్పుకున్న మనిషి రేవంత్ రెడ్డి. కాంగ్రెస్ పాలనలో 6 గంటల కరెంటు రాలేదు. కిరణ్ కుమార్ రెడ్డి పాలనలో పొద్దున మూడు గంటలు సాయంత్రం మూడు గంటల కరెంటు ఇచ్చారు. 24 గంటల కరెంటు ఇచ్చింది కేసీఆర్ గారు. ఆరోజు కాంగ్రెస్ పార్టీపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తప్పు అని క్షమాపణ చెప్పి నాటి కాంగ్రెస్ పాలన చూసి ఓటేయాలని అడగాలి.

**రేవంత్ రెడ్డి తినే కంచంలో ఉంచే రకం..** కేసీఆర్ కట్టిన కమాండ్ కంట్రోల్ రూమ్, సచివాలయంలో కూర్చునేది నువ్వే కదా రేవంత్ రెడ్డి.కేసీఆర్ గారు కట్టిన కాళేశ్వరం నుంచి గోదావరి నీళ్లు మల్లన్న సాగర్ ద్వారా మూసీకి తెస్తానని చెప్పింది నువ్వే కదా. అప్పులపై పూటకో మాట, చిల్లర మాటలు తప్ప రేవంత్ రెడ్డి చెప్పేది ఏం లేదు.

కేసీఆర్ గారి పాలనలో మొత్తం చేసిన అప్పులు 2,80,000 కోట్లు అని పార్లమెంట్లో బీజేపీ ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సమాధానం.. 11 ఆగస్టు 2025 న బీజేపీ ఎంపీ రఘునందన్ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇది.తెలంగాణ అప్పులపై అడిగింది బీజేపీ ఎంపీ, చెప్పింది కేంద్ర ప్రభుత్వం.బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు స్టేట్ టాక్స్ ఓన్ రెవిన్యూ ఆవరేజ్ గ్రోత్ రేట్ 15%.సెప్టెంబర్ 2025లో కాగ్ ఇచ్చిన రిపోర్ట్ లో జీఎస్టీ వృద్ధిరేటులో తెలంగాణ సాధించిన వృద్ధిరేటు – 5%.దేశంలో చివరి స్థానంలో తెలంగాణ ఉంది.సెప్టెంబర్ 2024లో ం1 తెలంగాణ వృద్ధిరేటు ం1%.సెప్టెంబర్ 2023లో ం33 తో తెలంగాణ వృద్ధిరేటు దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఎందుకు తెలంగాణ రాష్ట్రం వృద్ధిలో తిరోగమనం పడుతుంది. రేవంత్ రెడ్డి వసూళ్ల వల్ల, కమీషన్ల వల్ల జీఎస్టీ తగ్గింది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఆదాయం తగ్గింది. రోడ్ టాక్స్ తగ్గింది.కేసీఆర్ గారి పాలనలో రాష్ట్ర తలసరి ఆదాయం 3,47,000కు పెరిగింది. భారతదేశంలో అత్యధిక తలసరి ఆదాయం ఉన్న అగ్రగామి రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. 2014లో రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ 62,000 కోట్లు. 2023లో 2,30,000 కోట్ల ఆదాయంతో ఈ రాష్ట్రాన్ని మీకు అప్పజెప్పారు.

**హైదరాబాదుకు కేసీఆర్ ఏం చేశాడో విను రేవంత్ రెడ్డి. లిస్టు చదువుతాను.**

హైదరాబాదుపై కేసీఆర్ ముద్రను చెరపడం నీ జేజమ్మతో కూడా కాదు.. జూబ్లీహిల్స్ ప్యాలెస్ కిటికీలో నుండి చూస్తే నీకు కనపడే తీగల వంతెన కట్టింది కేసీఆర్ కాదా.. రోజూ మీ ఇంటికి వెళ్లేటప్పుడుకనిపించే టీ హబ్ గాని, స్టీల్ బ్రిడ్జి గాని కేసీఆర్ గారు కట్టింది కాదా.. ఎంసీఆర్ హెచ్ఆర్డీ లో 100 కోట్లతో రేవంత్ రెడ్డి కొత్త నివాసం నిర్మిస్తున్నాడు. కేసీఆర్ గారు, మున్సిపల్ మంత్రిగా కేటీఆర్ గారు హైదరాబాదులో ఎస్టీపీలు కట్టారు. ఈరోజు హైదరాబాదులో వరదలు వచ్చినా నీళ్లు రాకుండా ప్రణాళిక చేసి ఎస్టీపీలు నిర్మించింది బీఆర్ఎస్ ప్రభుత్వం. తలసాని శ్రీనివాస్ యాదవ్ గారు వారి నియోజకవర్గంలో వరద బాధితులకు సహాయం అందించడానికి నన్ను పిలిచారు..

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలాల్లో పూడిక తీయకపోవడం వల్ల బస్తీలో నీళు వచ్చి ఇల్లు మునిగిపోయాయి అని చెప్పారు. నాలాల్లో పూడిక తీయకపోవడం వల్ల హైదరాబాదులో వరదలు వచ్చాయి. వరదలకు కారణం నువ్వు రేవంత్ రెడ్డి.

**ఉద్యోగాల నోటిఫికేషన్ల పై ఊకదంపుడు ఉపన్యాసమే తప్ప ఏమి లేదు..** అసెంబ్లీలో విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ ప్రకారం ఒక నోటిఫికేషన్ అయినా ఇచ్చావా రేవంత్ రెడ్డి?గాలి మాటలు తప్ప ఆరు గ్యారెంటీల అమలు గురించి మాట్లాడడు ముఖ్యమంత్రి. పది రోజులు అసెంబ్లీ పెట్టు. ఆరు గ్యారెంటీలు, రుణమాఫీ, రైతుబంధు మీద చర్చిద్దాం అంటే ఒక్కరోజు అసెంబ్లీ పెట్టి పారిపోయాడు ఈ ముఖ్యమంత్రి.వికృత చేష్టలు, విచిత్ర విన్యాసాలు తప్ప ప్రజలకు పనికొచ్చే ఒక్క పని చేయడు ఈ ముఖ్యమంత్రి.

**పేద ప్రజల కన్నీళ్లు తుడిచే ఒక్క ప్రణాళికైనా ఈ ప్రభుత్వానికి ఉందా?**

కామారెడ్డిలో వరద బాధితులకు ఒక రూపాయి అయినా విడుదల చేశారా?వరదల్లో నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం అందించారా?మందిని తొక్కడం మాట తప్పడం రేవంత్ రెడ్డి నైజం. ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు అడిగినందుకు ప్రైవేట్ కాలేజీలపై దాడులు చేస్తారా?3,600 కోట్ల బకాయిలు ఫీజు రీయింబర్స్మెంట్ కింద ఉన్నాయని ముఖ్యమంత్రి చెప్పాడు..

**బహిరంగ చర్చకు సిద్ధమా రేవంత్ రెడ్డి? నేను సవాల్ విసురుతున్న.**

8,000 కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు పెండింగ్లో ఉన్నాయి.

కరోనా వచ్చినా కష్టం వచ్చినా 2,508 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ ను కేసీఆర్ ప్రభుత్వం చెల్లించింది.

ఈ రెండు ఏళ్లు రెండు రూపాయలు కూడా ఇవ్వలేదు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల కోసం ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించింది బీఆర్ఎస్ పార్టీ. పోయిన నెలలో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద కాంట్రాక్టర్లకు విడుదల చేసిన బిల్లులపై శ్వేత పత్రం విడుదల చేయాలి. హర్యానా, మహారాష్ట్ర, బీహార్ ఎన్నికల ముందు పెద్ద కాంట్రాక్టర్ల బిల్లులను ఈ ప్రభుత్వం విడుదల చేసింది.

**పిల్లల చదువులు ముఖ్యమా? లేక కాంట్రాక్టర్ల కమిషన్ల ముఖ్యమా?**

ప్రభుత్వ ఉద్యోగులకు ఐదు డిఏలు పెండింగ్లో ఉన్న ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ. ప్రభుత్వ ఉద్యోగులను బ్లాక్మెయిల్ చేసి భయపెడుతున్నారు.దొంగే దొంగ అన్నట్టుంది రేవంత్ రెడ్డి తీరు. కిషన్ రెడ్డి రేవంత్ రెడ్డిది ఫెవికాల్ బంధం.

ఓటుకు నోటు కేసులో ఈడీ కేసు ఉంటే ఎందుకు విచారణ జరగడం లేదు. బీహార్ ఎన్నికలకు డబ్బులు పంపుతున్నారని ఢిల్లీలో భట్టి విక్రమార్క గారి ఇంట్లో ఐటీ రైడ్లు జరిగాయి. గుర్గావ్ లో భట్టి విక్రమార్క ఇల్లు, ఆయన అత్తగారిల్లు ఉంది. ఈ విషయం ఎందుకు బయటకు రాలేదు. బీజేపీకి కాంగ్రెస్ కి మధ్యలో ఉన్న ఒప్పందం ఏమిటి? పొంగులేటి గారి ఇంట్లో ఈడీ రైడ్స్ ఐతే ఎందుకు చెప్పలేదు. ఈడీ ఎందుకు పొంగులేటిపై ప్రెస్ స్టేట్మెంట్ ఇవ్వలేదు.

**బీజేపీతో అంటకాగింది రేవంత్ రెడ్డి.**
**బీజేపీతో చీకటి ఒప్పందాలు ఉన్నాయి రేవంత్ రెడ్డికి.**

ఢిల్లీలో బీజేపీతో రేవంత్ రెడ్డి చీకటి రాజకీయాలు బయటపడ్డాయి.2023లో రెండు కోట్ల 73 లక్షల టన్నుల వరి ధాన్యము ఉత్పత్తి జరిగింది. మంత్రమేస్తే ఇంత దిగుబడి రాలేదు. పెద్ద ఎత్తున ప్రాజెక్టులు నిర్మించి, 24 గంటల కరంట్ తెచ్చి, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల్లో పూడిక తీసి పంటను పెంచాము.

కాళేశ్వరం కూలిందని అంటారు. హైదరాబాద్ కు 20 టీఎంసీల గోదావరి జలాల తరలింపుకు ప్రణాళిక చేసామని ముఖ్యమంత్రి అంటాడు.

**మల్లన్న సాగర్ కాళేశ్వరంలో అంతర్భాగం కాదా?**

7,000 కోట్లతో మల్లన్న సాగర్ నుంచి హైదరాబాదుకు గోదావరి జలాలను ఎలా తెస్తావు? కాళేశ్వరం అంటే మేడిగడ్డ బ్యారేజ్, కన్నెపల్లి పంప్ హౌస్, అన్నారం బ్యారేజీ, సరస్వతి పంప్ హౌస్, సుందిళ్ల బ్యారేజీ, పార్వతి పంప్ హౌస్, నంది మేడారం రిజర్వాయర్, నంది మేడారం పంప్ హౌస్, గాయత్రి పంప్ హౌస్, రాంపూర్ పంప్ హౌస్, రాజేశ్వరంపేట పంప్ హౌస్, మల్కంపేట రిజర్వాయర్, మల్కంపేట పంప్ హౌస్, ముప్పల్ పంప్ హౌస్, అప్పర్ మానేరు పంప్ హౌస్, అనంతగిరి రిజర్వాయర్, అనంతగిరి పంప్ హౌస్, రంగనాయక సాగర్ రిజర్వాయర్, రంగనాయక సాగర్ పంప్ హౌస్, మల్లన్న సాగర్ రిజర్వాయర్, మల్లన్న సాగర్ పంప్ హౌస్, కొండపోచమ్మ రిజర్వాయర్, కొండపోచమ్మ సాగర్ పంప్ హౌస్, వన్ పంప్ హౌస్ టు బస్వాపూర్ రిజర్వాయర్.

**ఇవన్నీ కూలినయా? ఇవన్నీ కనిపించడం లేదా రేవంత్ రెడ్డి?**

రిజర్వాయర్ల కింద పంట పండడం లేదా?పంట పండేది నిజం. రైతుల కళ్ళల్లో ఆనందం నిజం.అంబేద్కర్ గారి స్ఫూర్తితో నిర్మించిన సెక్రటేరియట్ కు అంబేద్కర్ పేరు పెట్టడం రేవంత్ రెడ్డికి ఇష్టం లేదు. అంబేద్కర్ పేరు ఉందని సెక్రటేరియట్ కి రేవంత్ రెడ్డి పోవడం లేదు. తెలంగాణ సోయిలేదు నీకు. తెలంగాణ ఉద్యమం గురించి తెలవదు నీకు.సచివాలయం ఎందుకు నిర్మించామో నీకు అర్థం కాదు. అది తెలంగాణ షాన్.

తెలంగాణ ప్రతిష్ట పెరిగే విధంగా పరిపాలన సౌధాన్ని నిర్మించింది బీఆర్ఎస్ ప్రభుత్వం.ఈ రాష్ట్ర చరిత్రలో, దేశ చరిత్రలో కాంట్రాక్టర్లు బిల్లులు రావడం లేదని ఫైనాన్స్ డిపార్ట్మెంట్ ముందు ధర్నా చేసిన ఏకైక ప్రభుత్వం మీదే కావచ్చు. 10%, 20% కమిషన్ల కోసం పైరవీకారులు, బ్రోకర్లు సెక్రటేరియట్లో నిండిపోయారు.

**పీజేఆర్ గురించి మాట్లాడే నైతిక అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదు.**

పీజేఆర్ ను మానసికంగా వేధించి వారి చావుకు కారణమైంది కాంగ్రెస్ పార్టీ. పీజేఆర్ కొడుకుకి ఎందుకు టికెట్ ఇవ్వలేదు?మూడు లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని రేవంత్ రెడ్డి చెప్తున్నారు అది నోరా? మోరా?

రాష్ట్ర ప్రభుత్వ ఆన్లైన్ వెబ్సైట్ టీఎస్ఐపాస్ లో వివరాలు ఉన్నాయి.2024 – 25లో 13,700 కోట్ల పెట్టుబడులు మాత్రమే వచ్చాయి.. 2025 – 26లో 6,472 కోట్ల పెట్టుబడి వచ్చింది. 3 లక్షల కోట్ల పెట్టుబడులు ఎక్కడివి?

నప్పుతట్లు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం ఇలాగే ఉంటుంది.రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ చేసిన మోసం జూబ్లీహిల్స్ ప్రజలకు అర్థమైంది. యూరియా కోసం లైన్లో నిలబడే దుస్థితి అర్థమైంది రౌడీలు పోలీసుల గుండెల మీద బుల్లెట్లు దింపేది అర్థమైంది.జూబ్లీహిల్స్ ఓటర్లు లైన్లు కట్టి పొద్దున్నే పోయి ఓటేయాలని డిసైడ్ అయింది.

చీరలు పంచినా, సారెలు పంచినా, పైసలు పంచిన నడువై రేవంత్ రెడ్డి.వెంకటేశ్వర కళ్యాణం పేరిట జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీ చీరలు పంచుతున్నది. పనివంతుడు పందిరేస్తే కుక్క తోక తాకి కూలింది అన్నట్టుంది రేవంత్ రెడ్డి తీరు.

## వరద ముంపు లో సేవలు అందించిన పారిశుద్ధ్య సిబ్బంది డ్రైవర్ లకు ప్రోత్సాహకాలు

- నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- పారిశుద్ధ్య సిబ్బంది, డ్రైవర్ లకు రూ. వెయ్యి అందజేయాలని నిర్ణయం.
- పారిశుద్ధ్య సిబ్బంది రెండు సార్లు హాజరు నమోదు చేసేలా చర్యలు...
- హార్టికల్చర్, నీటి సరఫరా సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బందికి జీ.ఓ నెం.16 ప్రకారం వేతనాలు..

**వరంగల్ నవంబర్08( సమయం న్యూస్):** ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో వరద ముంపు లో విస్తృతమైన సేవలందించిన పారిశుద్ధ్య సిబ్బందికి ప్రోత్సాహకాలు అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు పారిశుద్ధ్య సిబ్బంది, డ్రైవర్ లకు వెయ్యి రూపాయల చొప్పున ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లునగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ లు నేడొక సంయుక్త ప్రకటనలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కమిషనర్ తాను ఇందుకోసం చర్యలు చేపట్టి సిబ్బందికి ప్రోత్సాహకం అందేలా చూస్తామని ,ఇదే క్రమం లో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఉద్దేశంతో హార్టికల్చర్, నీటి సరఫరా లో పనిచేసే సిబ్బంది కలెక్టర్ గెజిట్ నోటిఫికేషన్ ప్రకారంగా (జీ ఓ నెం.16 ప్రకారం) మలేరియా విభాగ సిబ్బందికి పెంచిన విధం గా పెండింగ్ అప్రూవల్ చేసి చెల్లించడం జరుగుతుందని, జవాన్ లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే కాకుండా వారికి కూడా స్కిల్డ్ లేబర్ కింద కౌన్సిల్ ద్వారా అప్రూవల్ తీసుకుని జీ ఓ నెం.16 ప్రకారం వేతనాలు చెల్లించడం జరుగుతుందని, బల్దియా కు చెందిన భారీ (హెవీ వెహికిల్స్) వాహనాలు నడిపే సిబ్బంది వేతనాల పెంపు కోసం గతం లోనే ప్రతిపాదించిన ఫైల్ కు కౌన్సిల్ ఆమోదం తెలుపడం జరిగిందని, ఈ క్రమంలో వారికి కూడా వేతనాలు పెంచడం జరుగుతుందని, కార్మికులకు సంబంధించిన సమస్యలను తీరుస్తామని, 61 సం.లు పైబడి అనారోగ్యానికి గురైన సిబ్బంది కి మెడికల్ గ్రౌండ్స్ లో భాగంగా వారి స్వీయ ఆమోదం మేరకు వారి కుటుంబీకులను విధుల్లో కి తీసుకోవడం జరుగుతుందని, ఇందుకోసం తేదీని త్వరలో ప్రకటిస్తామని, సంవత్సరంలో మూడు కాలాలకు అనుగుణంగా వర్షాకాలంలో సిబ్బందికి రెయిన్ కోట్ లు అందించడం, చలికాలంలో స్వెట్టర్ లు (చలి కోట్లు), దుప్పట్లు, వేసవి కాలంలో టోపీలు అందిస్తున్నామని, క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది రక్షణ కోసం వ్యక్తిగత రక్షణ పరికరాలు (పి పి ఈ కిట్లు) క్రమం తప్పకుండా అందజేస్తున్నామని, చలికాలం మొదలైనందున త్వరలో స్వెటర్లు అందజేస్తామని, ఇందుకోసం అధికారులు సమగ్ర సమాచారంతో ఫైల్స్ ను తయారు చేసి వెంటనే ఆమోదం కోసం పంపాలని ఆదేశించామని తెలిపారు. ఇవే కాకుండా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పూర్తి స్థాయి లో పరిష్కరించాలనే సంకల్పం తో గతంలో మాదిరిగా రెండు (షిఫ్టు) పూటలు (ఉదయం, మధ్యాహ్నం) మాత్రమే బయోమెట్రిక్ అటెండెన్స్ వేసే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు, విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికులకు కార్పొరేషన్ తరఫున చేయూత అందిస్తున్నామని, అంతేకాకుండా ప్రభుత్వం తరపు నుండి కూడ నష్టపరిహారం అందేలా చూస్తామని, ఇందుకోసం ప్రభుత్వానికి లేఖ రాశామని అన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు కార్పొరేట్ ఆసుపత్రుల తో సమన్వయం చేసుకుంటూ అన్ని రకాల పరీక్షలు నిర్వహించడం తో పాటు మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల సహకారం తో పారిశుద్ధ్య సిబ్బందికి సంపూర్ణ వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామనిఈ సందర్భంగా మేయర్ తెలిపారు


## గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు

**హైదరాబాద్ నవంబర్ 08( సమయం న్యూస్).:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి జన్మదిన సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ ,హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు కలిసి హార్దిక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి గారి సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం సర్వతోముఖా భివృద్ధి చెందాలని, రైజింగ్ తెలంగాణ 2047 లక్ష్యాన్ని వారి నేతృత్వంలో మనమందరం సాధించాలని మంత్రిగారు కోరారుగౌరవ ముఖ్యమ ంత్రి రేవంత్ రెడ్డి గారి లక్ష్య సాధనలో ఆ దేవుడి ఆశీస్సులు మెండుగా ఉండాలని, వారు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ప్రజా జీవితంలో మరెన్నో విజయాలు సాధించాలని మంత్రిగారు ఆకాంక్షించారు.





తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి పుట్టినరోజు సందర్భంగా పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేసిన తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సోదరుడు తిరుపతి రెడ్డి గారి కుమార్తె వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గారు

# హెూరాహెూరీగా హ్యాండ్ బాల్ పోటీలు

**కోస్గి, నవంబర్ 8 (సమయం న్యూస్):**

రాష్ట్ర స్థాయి అండర్ 17 హ్యాండ్ బాల్ పోటీలు హెూరాహెూరీగా కొనసాగాయి. శనివారం లీగ్ పద్దతిలో జరుపుతున్న పోటీలలో తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల నుండి బాలబాలికల జట్లు పోటీ పడుతున్నాయి. శనివారం నాటి మ్యాచ్ లో బాలికల విభాగంలో మహబూబ్ నగర్,కరీం నగర్ మధ్య జరిగిన పోటీలో మహబూబ్ నగర్ 6-3 తేడాతో గెలుపొందింది.అదే విధంగా ఆదిలాబాద్,వరంగల్ మధ్య పోటీలో ఆదిలాబాద్ 11-2 తేడాతో,ఆదిలాబాద్,నిజామాబాద్ 10-0 తేడాతో ఆదిలాబాద్,మెదక్ మధ్య జరిగిన మ్యాచ్ లో ఆదిలాబాద్ 14-2 తేడాతో గెలుపొందింది.బాలుర విభాగంలో మహబూబ్ నగర్ జట్టు హైద్రాబాద్ పై 8-6,రంగారెడ్డి పై 13-7,మెదక్ పై 6-7,ఖమ్మం పై 15-9కరీంనగర్ పై 11-7తేడాతో మహబూబ్ నగర్ గెలుపొందింది. మూడు రోజులపాటు జరగనున్న హ్యాండ్ బాల్ పోటీలు ఆసక్తిని కలిగిస్తున్నాయి.ఆదివారం నాడు బాలికల విభాగంలో సెమీ ఫైనల్ లు అదిలాబాద్, కరీంనగర్ మధ్య,మహబూబ్ నగర్ మెదక్ మధ్య జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.ఈసందర్బంగా జిల్లా ఎస్ జి ఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి,పీడీ లు నర్సింహ్మ,బాలరాజు ఆయా జట్ల మేనేజర్లు,కోచ్ లు పాల్గొన్నారు.



### ఆసుపత్రుల పరిసరాల నుంచి
## వీధి కుక్కల తొలగింపు

- తొలిరోజు 277 వీధి కుక్కల పట్టివేత



**హైదరాబాద్, నవంబర్ 8 (సమయం న్యూస్):**

ప్రజా ప్రదేశాల నుంచి వీధి కుక్కలను తొలగించాలన్న సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) సత్వర చర్యలు ప్రారంభించింది. సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన ఆదేశాల ప్రకారం పాఠశాలలు, ఆసుపత్రులు, క్రీడా సముదాయాలు, రవాణా కేంద్రాలు వంటి ప్రజా ప్రదేశాల నుంచి వీధి కుక్కలను తొలగించాలన్న సూచనపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ స్పందించి, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రుల పరిసర ప్రాంతాల్లో వీధి కుక్కల పట్టివేత కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ వెటర్నరీ విభాగం ప్రారంభించింది. డ్రైవ్ మొదటి రోజైన శనివారం మొత్తం 277 వీధి కుక్కలను పట్టుకున్నారు. పట్టుకున్న ఈ కుక్కలకు శస్త్రచికిత్స (స్టెరిలైజేషన్) నిర్వహించిన అనంతరం వాటిని తిరిగి ఆసుపత్రుల ప్రాంగణాల్లో వదలకుండా, జీహెచ్ఎంసీకి చెందిన జంతు సంరక్షణ కేంద్రాలకు తరలించారు. అక్కడ వాటికి శస్త్రచికిత్స, టీకాలు, సంరక్షణ, మరియు పర్యవేక్షణ చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. తొలుత ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన జీహెచ్ఎంసీ, తరువాత పాఠశాలలు, కళాశాలలు, రవాణా కేంద్రాలు వంటి ఇతర పబ్లిక్ ప్లేస్‌లకు కూడా ఈ డ్రైవ్‌ను విస్తరించనున్నట్లు స్పష్టం చేసింది.



### సీఎం సహాయనిధి
## చెక్కులు అందజేత

**రాయపోల్, నవంబర్ 8 (మనసులో మాట):**

పేద ప్రజల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా ముఖ్య మంత్రి సహాయ నిధి అని కాంగ్రెస్ పార్టీ రాయపోల్ మండల అధ్యక్షులు తప్పటి సుధాకర్ అన్నారు. శనివారం రాయపోల్ మండలంలో వివిధ గ్రామాల లబ్ధిదారులకు సీఎం సహాయనధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేవ-ుమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. ఆరోగ్య శ్రీ లో వర్తించని వ్యాధులకు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు వైద్యానికి అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయాన్ని బాధితులకు అందిస్తుందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి సహకారంతో మంతూర్ గ్రామానికి చెందిన బండారు శ్రీనివాస్ రూ.55 వేలు,తోడెంగల మల్లయ్య రూ.47,500. తిమ్మక్ పల్లి కాశిరెడ్డి మంజుల రూ.60 వేలు, లింగారెడ్డి పల్లి తోట కిష్టమ్మ రూ.60 వేలు, ముంగిస్ పల్లి భూపతి రావు రూ.60 వేల సీఎం సహాయనిది చెక్కులు పంపిణీ చేయడం జరిగిందన్నారు.మండల వ్యాప్తంగా ఎవరు అనారోగ్యానికి గురైన సీఎం సహాయనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొత్తపల్లి స్వామి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు పట్నం యాదగిరి,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు దయాకర్, గ్రామ అధ్యక్షులు సాకలి కిష్టయ్య , ఉపాధ్యక్షులు కోతి నర్సింలు, మాజీ సర్పంచ్ మల్లేశం, కాంగ్రెస్ నాయకులు దుర్గాప్రసాద్, కిష్టారెడ్డి, మహేష్ యాదవ్, యాదగిరి, జనార్దన్ రెడ్డి,డా.చందు, తొడెంగల మహేష్, సేవ దళ్ జనరల్ సెక్రటరీ మహేందర్ రెడ్డి , అశోక్, పాషా, లక్ష్మణ్, పాపని అంజనేయులు,మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సొంత పార్టీకి ఉచ్చు బిగించిన ముఖ్యమంత్రి!



**తెలంగాణలో అధికారాన్ని చేపట్టిన కీలక నేత, తన వ్యక్తిగత పీఠం భద్రత కోసం సొంత పార్టీ జాతీయ విజయానికి విఘాతం కలిగించిన సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో ఉద్దేశపూర్వకంగా చేసిన ముస్లిం ఓటు బ్యాంక్ వ్యాఖ్యలు, కాంగ్రెస్ హైకమాండ్‌కు ఒక రాజకీయ బాంబులా పేలాయి.**

**సమయం ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్:**

"కాంగ్రెస్ ఉంటేనే ముస్లింలకు ఇజ్జత్" అనే ఈ అత్యంత వివాదాస్పద ప్రకటనలు, బీహార్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ వ్యతిరేక శక్తులకు వైరల్ అస్త్రంగా మారాయి. హైకమాండ్‌కు ఎదురుదెబ్బ తగలడం ఖాయమని తెలిసీ, బీహార్‌లో కాంగ్రెస్ గెలవవద్దు అనే అంతర్గత ఎజెండాతోనే ఈ వ్యాఖ్యలు జరిగాయని రాజకీయ వర్గాలలో తీవ్ర చర్చ నడుస్తోంది. తన అధికార కేంద్రం నుంచి దూరం జరిగే ప్రమాదాన్ని పసిగట్టి, ఆ పతనాన్ని ఆపేందుకు సొంత పార్టీపైనే ద్రోహానికి పాల్పడినట్లు స్పష్టమవుతోంది

### ముస్లిం ఓటు బ్యాంక్‌లో ప్రకంపనలు..హో

రేవంత్ రెడ్డి ప్రకటనలు జాతీయ స్థాయిలో బీహార్‌కే కాక, స్థానికంగా తెలంగాణలోని ముస్లిం ఓటు బ్యాంక్‌లోనూ తీవ్ర ప్రకంపనలు సృష్టించాయి. ముస్లిం సామాజిక వర్గానికి చెందిన మేధావులు బహిరంగంగా రంగంలోకి దిగి, ఉద్వేగభరిత ప్రెస్ మీట్ నిర్వహించారు. ముస్లింలు కాంగ్రెస్‌కు ఓటు వేయకుండా తమ నిరసనను వ్యక్తం చేయాలని పిలుపునివ్వడం, ముఖ్యమంత్రి ఎత్తుగడపై వచ్చిన పెద్ద ఎదురుదెబ్బ. అంతేకాకుండా, బీహార్ డీఎన్ఏ వివాదం కారణంగా ఆయన ప్రచారానికి దూరంగా ఉండాల్సి రావడం, బీహార్‌లో కాంగ్రెస్ పార్టీ బలహీనతను ఇప్పటికే పెంచింది. ఈ పరిణామాలన్నీ సీఎం రేవంత్ రెడ్డి చుట్టూ అల్లుకున్న రాజకీయ ఉచ్చును మరింత బిగించాయి. బీహార్‌లో విజయం సాధిస్తే, కాంగ్రెస్ హైకమాండ్‌కు ఆర్థిక వనరులు, జాతీయ బలం చేకూరి, తెలంగాణపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది, తద్వారా సీఎం పదవికి ఉద్వాసన తప్పదనే గండం ముంచుకొచ్చిందని తెలుస్తోంది.

### అంతర్గత రిపోర్ట్..

ఈ మొత్తం వ్యూహం వెనుక ఉన్న నిజం కేవలం ప్రమాదం కాదు, చాణక్య వ్యూహమే. కాంగ్రెస్ హైకమాండ్ బలోపేతం అయితే, ఆయన పీఠం కదులుతుందని స్పష్టంగా అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి, అంతర్గత రిపోర్ట్‌ల ఆధారంగా అత్యంత కఠినమైన నిర్ణయం తీసుకున్నారు. బీహార్‌లో కాంగ్రెస్ ఓటమిని ఆశిస్తేనే, పార్టీలో తన అవసరం అనివార్యం అవుతుందని ఆయన పక్కా ప్రణాళికతో ఉన్నారు. అందుకే, ముస్లిం ఓట్లను చీల్చేందుకు ఉద్దేశించిన వివాదాస్పద స్టేట్‌మెంట్‌ను ఎన్నికల సమయంలో విడుదల చేయడం జరిగింది. ఈ వ్యూహం బీహార్‌లో కాంగ్రెస్ గెలిచే అవకాశాలను క్షీణింపచడం ద్వారా, అధిష్ఠానం దృష్టిలో తెలంగాణకున్న ప్రాధాన్యతను కాపాడుకోవడంపై ఆధారపడి ఉంది. సొంత పార్టీ ఓటమి కోసమే ఈ మాటల అస్త్రం ప్రయోగించబడిందన్నది రాజకీయ వర్గాల అంతర్గత సమాచారం.

### పీసీసీ మాస్టర్ ప్లాన్..

చివరికి, ఈ మొత్తం వ్యవహారం రేవంత్ రెడ్డి మాస్టర్ ప్లాన్గా వెల్లడైంది. తన చుట్టూ అల్లుకున్న అభద్రత వాతావరణాన్ని బద్దలు కొట్టడానికి, బీహార్ ఓటమిని ఒక సాకుగా ఉపయోగించాలని ఆయన భావించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాన్ని కూడా ఆయన 'పరీక్ష'గా అభివర్ణించడం వెనుక, ఓటమికి తాను ఒక్కడినే బాధ్యత వహించాల్సిన అవసరం లేదని, జాతీయ ఓటమి కూడా ఉందని హైకమాండ్‌కు చూపించడం ఆయన లక్ష్యం. అధికార ఉనికిని కాపాడుకోవడానికి, సొంత పార్టీ జాతీయ విజయానికి విఘాతం కలిగించిన ఈ నిగూఢ రాజకీయం, భారత రాజకీయాలలో అంతర్గత పవర్ గేమ్స్ యొక్క అత్యంత సంచలన అధ్యాయం.

## నిలిచిన వియత్నాం ఎయిర్‌లైన్స్ విమానం

### శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు ఆందోళన

**హైదరాబాద్, నవంబర్ 8 (సమయం న్యూస్):**




శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు శనివారం ఆందోళన చేపట్టారు. వియత్నాం ఎయిర్‌లైన్స్‌కు చెందిన వీఎన్-984 విమానం శుక్రవారం రాత్రి శంషాబాద్ నుంచి వియత్నాంకు వెళ్లాల్సి ఉంది. కానీ సాంకేతిక సమస్య తలెత్తడంతో అధికారులు సర్వీసును నిలిపివేశారు. 200 మంది ప్రయాణికులు రాత్రంతా విమానాశ్రయంలోనే ఉండిపోయారు. ఈ క్రమంలో ఎయిర్‌లైన్స్ సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ప్రయాణికులు ఆందోళన చేపట్టారు. మరోవైపు భారీ మరమ్మతుల కారణంగా ఈ విమాన సర్వీసును పూర్తిగా రద్దు చేస్తున్నట్లు శనివారం ఉదయం 11 గంటలకు అధికారులు ప్రకటించారు. రీషెడ్యూల్ చేసిన విమానంలో ప్రయాణికులను పంపిస్తామని, అలా వెళ్లడానికి ఇష్టం లేని ప్రయాణికులకు పూర్తిస్థాయిలో టికెట్ డబ్బులు రీఫండ్ చేస్తామని హామీ ఇచ్చారు. కౌలాలంపూర్ వెళ్లాల్సిన విమానంలోనూ సాంకేతిక సమస్య ఏర్పడింది. దీంతో నిర్దేశిరచిన సమయం కంటే 6 గంటల ఆలస్యంగా శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయలుదేరింది. ఢిల్లీలో తలెత్తిన ఏటీసీ సాంకేతిక సమస్య వల్ల ఢిల్లీ, ముంబయి, శివమొగ్గ విమానాలు రద్దయ్యాయి. గోవా వెళ్లాల్సిన విమానం ఆలస్యంగా బయలుదేరింది.

## ఆరోగ్య పరిరక్షణపై అవగాహన

- నవంబర్ 13 నుంచి విస్తృత కార్యక్రమాలు
- కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, నవంబర్ 8 (సమయం న్యూస్):**



జిల్లాలో స్వచ్ఛత, నీటి సంరక్షణ, ఆరోగ్య పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపునకు నవంబర్ 13, 14 తేదీల్లో విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం క్యాంపు కార్యాలయం నుంచి జూమ్ ద్వారా నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ కార్యాచరణను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నవంబర్ 13న మండలాల పరిధిలో ఎంపిక చేసిన పంచాయతీల్లో "మన ఊరు - మన నీరు" కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువత, గ్రామ-స్తులతో అవగాహన ర్యాలీలు ఏర్పాటు చేసి, నీటి సంరక్షణపై ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించాలని సూచించారు. అనంతరం పాఠశాలల్లో స్పీచ్‌లు, డిబేట్‌ల ద్వారా నీటి ప్రాముఖ్యత, పొదుపు చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పాఠశాలలు, గ్రామపంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో వర్షపు నీటి నిల్వలు, వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు, కమ్యూనిటీ సోక్ పిట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. నవంబర్ 14న అన్ని పాఠశాల కాంప్లెక్సుల్లో "ఆరోగ్య జాతర" నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థులతో స్కిట్స్, పాటలు, నృత్యాలు నిర్వహించి ఆరోగ్యంపై సందేశాలు ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా అన్ని పాఠశాలల్లో న్యూట్రి గార్డెన్స్ (పోషక తోటలు)ను ఈజీఎస్ కింద ప్రారంభించాలని ఆదేశించారు. స్పెషల్ క్యాంపెయిన్ 5.0లో భాగంగా ప్రతి పాఠశాలలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టి, పాడైన వస్తువులను ఉపయోగించదగినవి, మరమ్మతు చేయదగినవి, వాడలేనివిగా మూడు రకాలుగా వర్గీకరించాలని కలెక్టర్ సూచించారు. వినియోగం లేని సామగ్రి, స్క్రాప్‌ను గ్రామపంచాయతీకి అప్పగించాలని ఆదేశించారు. పాఠశాలలు, గ్రామాలు పరిశుభ్రత, నీటి సంరక్షణ, ఆరోగ్య పరిరక్షణలో ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమాల అమలులో డిఆర్డిఏ, విద్యాశాఖ, పంచాయతీ రాజ్, ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

### మత్తడి వాగు తీరంలో
## కార్తీక దీపోత్సవం

**ఆదిలాబాద్, నవంబర్ 8 (సమయం న్యూస్):**



తాంసి మండలంలోని మత్తడి వాగు తీరం కార్తిక దీపోత్సవంతో సందడిగా మారింది. వైభవంగా జరిగిన గంగా హారతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన శివపార్వతుల కళ్యాణం, కార్తిక స్వామికి ప్రత్యేక అభిషేకాల్లో పాల్గొన్న కలెక్టర్ అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య గంగా హారతిని సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మత్తడి వాగు పరిసరాలు సహజసిద్ధసౌందర్యంతో కళకళలాడుతున్నాయని, గ్రామీణ పర్యాటకం అభివృద్ధికి ఇది అనువైన ప్రదేశమని పేర్కొన్నారు. అవసరమైన మౌలిక వసతుల కల్పనపై సంబంధిత శాఖలతో సమావేశాలు నిర్వహించి చర్యలు వేగవంతం చేస్తామని తెలిపారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కార్తిక మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన గంగా హారతిని స్థానికులు భారీగా హాజరై దర్శించుకున్నారు.



# సిరీస్ నెగ్గిన సూర్య సేన




## భారత్, ఆస్ట్రేలియా చివరి టీ20 రద్దు

భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య కీలకంగా మారిన చివరిదైన ఐదవ T20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. ఈ టీ20 మ్యాచ్‌లో కేవలం 4.5 ఓవర్ల ఆట మాత్రమే జరిగింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఇండియా ఓపెనర్లు 4.5 ఓవర్లలో 52 పరుగులు చేసి దూకుడు కొనసాగించారు. కానీ గబ్బాలో వర్షం కురవడంతో మ్యాచ్ మొదట తాత్కాలికంగా నిలిపివేశారు. ఎంతకీ వర్షం తగ్గకపోవడం, కొన్ని ఓవర్లపాటు సైతం నిర్వహించే అవకాశం లేకపోవడం.. చాలా సమయం వృథా కావడంతో 5వ టీ20 మ్యాచ్ రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. దీంతో ఆస్ట్రేలియాతో జరిగిన ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 2-1 తేడాతో కైవసం చేసుకుంది.బ్రిస్బేన్‌లోని చారిత్రాత్మక గబ్బా స్టేడియంలో సిరీస్‌లో కీలకమైన 5వ T20I మ్యాచ్‌లో టాస్ నెగ్గిన ఆస్ట్రేలియా కెప్టెన్ బౌలింగ్ ఎంచుకున్నాడు. దాంతో భారత్ ఫస్ట్ బ్యాటింగ్ కు దిగింది. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ భారత ఇన్నింగ్స్‌ను ప్రారంభించారు. కచ్చితంగా సిరీస్ నెగ్గాలన్న కసితో విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ, వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఆసీస్ బౌలర్లను ఎదుర్కొని బ్యాట్‌లు ఝుళిపించడం ప్రారంభించారు. తొలి రెండు ఓవర్లలో 19 పరుగులు చేసిన ఓపెనర్లు, నాలుగు ఓవర్లలోనే స్కోరు 47కి తీసుకెళ్లారు. ఐదవ ఓవర్ కొనసాగుతుండగా వర్షం మొదలైంది. ఆ ఓవర్లో చివరి బంతి వేయడానికి ముందు భారీ వర్షం కారణంగా ఆట తాత్కాలికంగా నిలిపివేశారు. దాదాపు రెండు గంటల 15 నిమిషాల పాటు మ్యాచ్ తిరిగి ప్రారంభం కాకపోవడంతో, నిర్వహించే అవకాశం లేదని సిరీస్ లో కీలకమైన చివరి టీ20 మ్యాచ్ రద్దు చేసినట్లు ప్రకటించారు. ఈ టీ20 సిరీస్‌లోని మొదటి మ్యాచ్ కూడా వర్షం కారణంగా రద్దు కావడం తెలిసిందే. 161.38 స్ట్రైక్ రేటుతో 163 పరుగులు చేసిన భారత ఓపెనర్ అభిషేక్ శర్మ ప్లే ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు. సిరీస్ లో అతడి అత్యధిక స్కోరు 68. శుభ్‌మన్ గిల్ సారథ్యంలో భారత్ ఇటీవల వన్డే సిరీస్ కోల్పోయింది. అయితే టీ20 సిరీస్ నెగ్గాలని ఆశించిన సూర్యకుమార్ యాదవ్ సేనకు ఊరట లభించింది. వన్డే సిరీస్ ఓటమికి టీ20 సిరీస్ గెలుపుతో టీమిండియా ప్రతీకారం తీర్చుకుంది. ఆస్ట్రేలియాతో గబ్బాలో ఐదవ టీ20 మ్యాచ్ జరగాల్సి ఉండగా.. కేవలం 4.5 ఓవర్లు మాత్రమే ఆట సాధ్యం కావడంతో మ్యాచ్ రద్దు చేశారు. భారీ వర్షం కారణంగా ఆస్ట్రేలియాకు కీలకమైన చివరి టీ20 రద్దు అయింది. దాంతో చివరి మ్యాచ్ రద్దయిన భారత్ 2-1 తేడాతో ఆస్ట్రేలియాపై టీ20 సిరీస్ సాధించింది. తొలి టీ20 వర్షార్పణం కాగా, రెండవ టీ20 మ్యాచ్ లో ఆస్ట్రేలియా 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 3వ %జ%20 మ్యాచ్ లో ఇండియా 5 వికెట్లతో విజయం సాధించింది. నాల్గవ %జ%20 మ్యాచ్ లోనూ భారత్ గెలుపొందింది. బ్రిస్బేన్ లోని గబ్బాలో 5వ టీ20 మ్యాచ్ సైతం వర్షార్పణం కావడంతో సిరీస్ భారత్ సొంతం చేసుకుంది. కాగా ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పాడు. 'మేం ముందుగా బౌలింగ్ చేస్తాం. చూడటానికి మంచి పిచ్‌లా కనిపిస్తోంది. ఈ గొప్ప స్టేడియంలో ఆడటం ఎప్పుడూ మంచి అనుభూతిని ఇస్తుంది. ఈ సిరీస్‌ను డ్రా చేసేందుకు ఈ మ్యాచ్ మాకు మంచి అవకాశం. ఈ సిరీస్‌లో ఇప్పటికే చాలా ఆడాం. ఇరు జట్లు గొప్ప ప్రదర్శన చేసాయి. గత మ్యాచ్‌లో పిచ్ కండిషన్స్ విభిన్నంగా ఉన్నాయి. భారత్ అద్భుతంగా బౌలింగ్ చేసింది. ఈ మ్యాచ్ పరిస్థితులు వేరు. తుది జట్టులో ఎలాంటి మార్పులు చేయలేదు.'అని మిచెల్ మార్ష్ చెప్పుకొచ్చాడు.'మ్యాచ్‌లు ఓడిపోనంత వరకు టాస్ ఓడినా పోయిదేం ఏం లేదు. టాస్‌తో సంబంధం లేకుండా మేం మా సత్తా చాటాలనుకుంటున్నాం. జట్టు లక్ష్యాన్ని అర్థం చేసుకోవడం ఎప్పుడైన కీలకం. గత మ్యాచ్‌లో ఆ వికెట్ 200 పరుగులు చేసేది కాదని బ్యాటర్లంతా గ్రహించారు. గత మ్యాచ్‌లో అన్ని విభాగాల్లో రాణించాం. అదే ప్రదర్శనను కొనసాగించాలనుకుంటున్నాం.ద్వైపాక్షిక సిరీస్‌లు గెలవడం ఎప్పుడైనా మంచిదే. అదే సమయంలో ఎలాంటి కాంబినేషన్‌తో బరిలోకి దిగాలనేది కూడా కీలకమే. పొట్టి ఫార్మాట్‌లో ఓపెనర్లు మినహా ప్రతీ ఆటగాడు ఏ స్థానంలోనైనా బ్యాటింగ్ చేసేందుకు సిద్దంగా ఉండాలి. తుది జట్టులో ఒక మార్పు చేశాం. తిలక్ వర్మకు రెస్ట్ ఇచ్చి రింకూ సింగ్‌ను తీసుకున్నాం. రింకూ సింగ్‌కు అవకాశం ఇవ్వాలనే ఈ నిర్ణయం తీసుకున్నాం.'అని సూర్యకుమార్ యాదవ్ చెప్పుకొచ్చాడు.



## టీ20 క్రికెట్‌లో అభిషేక్ శర్మ ప్రపంచ రికార్డు

టీమీండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ అరుదైన ఘనత సాధించాడు. అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో అత్యంత వేగంగా (బంతుల పరంగా) 1000 పరుగులు చేసిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. ఆసీస్‌తో ఐదో టీ20 మ్యాచ్‌లో వ్యక్తిగత స్కోరు 11 పరుగుల వద్ద అభిషేక్ శర్మ ఈ ఘనత అందుకున్నాడు.భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ప్రపంచ క్రికెట్‌లో చరిత్ర సృష్టించాడు. ఆస్ట్రేలియాతో బ్రిస్బేన్‌లోని గబ్బా మైదానంలో జరిగిన ఐదవ టీ20 మ్యాచ్‌లో అతను టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 1000 పరుగుల మైలురాయిని తక్కువ బంతుల్లో పూర్తి చేసి కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. 24 ఏళ్ల ఈ ఎడమచేతి వాటం బ్యాటర్.. 528 బంతుల్లోనే 1000 పరుగులు పూర్తి చేశాడు. ఈ రికార్డు ఇంతకుముందు ఆస్ట్రేలియా బ్యాటర్ టిమ్ డేవిడ్ పేరిట ఉండేది. టిమ్ డేవిడ్ 569 బంతుల్లో 1000 పరుగులు సాధించాడు.అభిషేక్ శర్మ ఈ ఘనతను సాధించడం ద్వారా భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ రికార్డును కూడా అధిగమించాడు. సూర్యకుమార్ 573 బంతుల్లో ఈ మైలురాయిని చేరుకున్నాడు. అభిషేక్ శర్మ 29 మ్యాచ్‌లలో 28 ఇన్నింగ్స్‌ల్లో 1000 పరుగులు పూర్తి చేశాడు. విరాట్ కోహ్లీ 29 మ్యాచ్‌ల్లో 27 ఇన్నింగ్స్‌ల్లో 1000 పరుగులు పూర్తి చేసి వేగవంతమైన భారత ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఇప్పుడు అభిషేక్ రెండవ స్థానంలో నిలిచాడు.

## కోచ్, కెప్టెన్ వల్లే నేను చెలరేగుతున్నాను

**విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ**

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ ధన్యవాదాలు తెలిపాడు. వారి సహకారంతోనే తాను దూకుడుగా ఆడగలుగుతున్నానని చెప్పాడు. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా బ్రిస్బేన్‌లోని గబ్బా మైదానం వేదికగా శనివారం జరిగిన ఆఖరి మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. దాంతో ఈ సిరీస్‌ను టీమిండియా 2-1తో కైవసం చేసుకుంది. ఈ సిరీస్‌లో అద్భుతంగా రాణించిన అభిషేక్ శర్మ(163) ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు.ఈ సందర్భంగా మాట్లాడిన అభిషేక్ శర్మ తన ప్రదర్శనపై సంతోషం వ్యక్తం చేశాడు. 'నేను ఈ సిరీస్ కోసం ఎదురు చూశాను. ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్తున్నామని తెలిసినప్పుడే నేను చాలా ఉత్సాహానికి గురయ్యాను. ఆస్ట్రేలియా పిచ్‌లు బ్యాటింగ్‌కు చాలా అనుకూలంగా ఉంటాయని తెలుసు. ఈ సిరీస్ మధ్యలో కూడా నాకు ఇదే అభిప్రాయం కలిగింది. మేం ఇంకా భారీ లక్ష్యాలను నమోదు చేయాగలమనిపించింది. హాజెల్ వుడ్ వంటి బౌలర్ ఉండటం ఏ జట్టుకైనా ప్రయోజనకరమే. అతను అద్భుతంగా బౌలింగ్ చేశాడు. అతనితో పోరును నేను ఆస్వాదించాను. గతంలోనే బ్యాటర్లు, బౌలర్ల మధ్య పోరును ఆస్వాదిస్తానని చెప్పాను.హాజెల్ వుడ్ వరల్డ్ క్లాస్ బౌలర్. మంచి క్రికెట్ ఆడాలన్నా.. భవిష్యత్తులో మెరుగ్గా రాణించాలన్నా వరల్డ్ క్లాస్ బౌలర్లను ఎదుర్కోవాలి. జట్టు కోసం బాగా ఆడాలంటే ఈ రకమైన బౌలర్లను ఎదుర్కోవాలి. మా కెప్టెన్, కోచ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. నచ్చినట్లు ఆడమనే స్వేచ్ఛ వారు నాకు ఇచ్చారు. ఒక బ్యాటర్‌గా 20, 30 పరుగులే చేయడం సరికాదు. కానీ, జట్టుకు మూమెంటమ్ సెట్ చేయాలనే బాధ్యతను వారు నాకు ఇచ్చారు. అందుకోసం నేను నెట్స్‌లో, ఆఫ్ సీజన్‌లో బాగా ప్రాక్టీస్ చేశాను.వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ జరగనుంది. అతిపెద్ద క్రికెట్ టోర్నీ. ప్రపంచకప్ ఆడటం నా కల. చిన్నప్పటి నుంచి ఈ టోర్నీ గురించే కలలు కన్నాను. నా దేశానికి ప్రపంచకప్ అందివ్వాలనుకున్నాను. ఆ టోర్నీకి నేను సిద్దంగా ఉండేలా చూసుకుంటాను.'అని అభిషేక్ శర్మ చెప్పుకొచ్చాడు. ఈ సిరీస్‌లో అభిషేక్ శర్మ 16, 68, 25, 28, 23 నాటౌట్ వరుసగా రాణించాడు.

## ఒక్క మ్యాచ్‌లో రెండు సెంచరీలు

**ధ్రువ్ జురెల్ సంచలన ఇన్నింగ్స్... సౌతాఫ్రికా ముందు భారీ టార్గెట్**

భారత్ ఏ, సౌతాఫ్రికా ఏ జట్ల మధ్య బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో జరుగుతున్న రెండో అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో యువ వికెట్ కీపర్-బ్యాట్స్‌మెన్ ధ్రువ్ జురెల్ సంచలనం సృష్టించాడు. ఈ ఒక్క మ్యాచ్‌లోనే అతను ఏకంగా రెండు సెంచరీలు చేసి, టీమిండియా మేనేజ్‌మెంట్ దృష్టిని ఆకర్షించాడు. జట్టు కష్టాల్లో ఉన్న ప్రతిసారీ అద్భుత ప్రదర్శన చేసిన ధ్రువ్ జురెల్, రాబోయే సౌతాఫ్రికా టెస్ట్ సిరీస్‌కు సెలక్ట్ చేసే విషయంలో తన వాదనను బలంగా వినిపించడమే కాక టీమ్‌లోని కొన్ని స్థానాలకు పెద్ద ముప్పుగా మారాడు. భారత ఏ జట్టు వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ ధ్రువ్ జురెల్.. సౌతాఫ్రికా ఏ జట్టుతో జరుగుతున్న రెండో అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో అద్భుతంగా రాణించాడు. జట్టు 126 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న సమయంలో ధ్రువ్ జురెల్ 175 బంతులు ఎదుర్కొని నాటౌట్‌గా 132 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్ కారణంగానే భారత్ ఏ జట్టు 255 పరుగుల గౌరవప్రదమైన స్కోరును చేరుకోగలిగింది. తొలి ఇన్నింగ్స్‌లో ఫామ్‌ను కొనసాగిస్తూ రెండో ఇన్నింగ్స్‌లో కూడా జురెల్ సెంచరీ నమోదు చేశాడు. ఈసారి కూడా భారత్ 104 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి, రిషబ్ పంత్ గాయం కారణంగా రిటైర్డ్ హర్ట్ అయిన తర్వాత ధ్రువ్ జురెల్ క్రీజులోకి వచ్చాడు. ఈ ఇన్నింగ్స్‌లో అతను 159 బంతులను ఎదుర్కొని 12 ఫోర్ల సాయంతో సెంచరీని పూర్తి చేశాడు. ఈ క్రమంలో హర్ష్ దూబేతో కలిసి ఆరో వికెట్‌కు 184 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి, భారత్ స్కోరును 300 మార్కు దాటించాడు. సౌతాఫ్రికా టెస్ట్ సిరీస్‌కు ఎంపిక కావడానికి ముందు ధ్రువ్ జురెల్ ఆడిన ఈ రెండు కీలకమైన ఇన్నింగ్స్‌లు, జట్టులో అతని స్థానం గురించి చర్చకు దారితీశాయి. టెస్ట్ సిరీస్‌కు వికెట్ కీపర్‌గా రిషబ్ పంత్ మొదటి ప్రాధాన్యతగా ఉండడం దాదాపు ఖాయం. కానీ, అతని తాజా గాయం సమస్యలను సృష్టించే అవకాశం ఉంది. ధ్రువ్ జురెల్ ఇప్పుడు ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి స్థానానికి పెద్ద ముప్పుగా మారాడు. గత సిరీస్‌లలో నితీష్ రెడ్డిని బౌలర్‌గా పెద్దగా ఉపయోగించలేదు. బ్యాటింగ్‌లో ధ్రువ్ జురెల్ చూపించిన ఈ అద్భుత ఫామ్‌ను పరిగణలోకి తీసుకుంటే, మెరుగైన బ్యాటింగ్ సామర్థ్యం ఉన్న ధ్రువ్ జురెల్‌ను జట్టులోకి తీసుకునేందుకు టీమ్ మేనేజ్‌మెంట్ మొగ్గు చూపవచ్చు. జురెల్ బ్యాటింగ్ మాత్రమే కాదు, వికెట్ కీపర్‌గా కూడా జట్టుకు ఉపయోగకరమే. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడల్లా బాధ్యతాయుతమైన బ్యాటింగ్ చేయగలనని అతను నిరూపించుకోవడంతో సౌతాఫ్రికా పర్యటనలో అతని పాత్ర కీలకం అయ్యే అవకాశం ఉంది. ఈ ప్రదర్శన అతన్ని టెస్ట్ సిరీస్ స్క్వాడ్‌లో చోటు దక్కించుకోవడంలో సహాయపడుతుంది.





## కేకేఆర్ నుండి బడా ప్లేయర్లు అవుట్..

గత ఐపీఎల్ సీజన్ కోల్‌కతా నైట్ రైడర్స్‌కు నిరాశపరిచింది. అజింక్య రహానే నాయకత్వంలోని ఈ జట్టు పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంలో నిలిచింది. మూడుసార్లు ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచిన ఈ జట్టు 2024లో తమ ప్రదర్శనకు దగ్గరగా కూడా రాలేదు, శ్రేయాస్ అయ్యర్ వారిని మూడో టైటిల్‌కు నడిపించాడు. అయితే, ఈ సీజన్‌లో ఫ్రాంచైజీకి కొన్ని ఆశాజనకమైన సంకేతాలు కనిపిస్తున్నాయి, ముఖ్యంగా యువ ఆటగాళ్ల నుండి. ఐపీఎల్ 2026 వేలానికి ముందు, జట్లు నవంబర్ 15 గడువులోగా తమ ఆటగాళ్ల రిటెన్షన్‌లను ఖరారు చేసుకోవాలి. వేలం డిసెంబర్‌లో జరుగుతుంది. కానీ వేదిక ఇంకా నిర్ణయించబడలేదు. ఐపీఎల్ వేలానికి ముందు, కెకెఆర్ నిలుపుకోగల ఐదుగురు యువ ఆటగాళ్లను పరిశీలిద్దాం.

23 ఏళ్ల ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రాణా ఐపీఎల్ 2024లో తన అద్భుతమైన సీజన్ నుండి వేగంగా పుంజుకున్నాడు. అప్పటి నుండి ఢిల్లీ ఫాస్ట్ బౌలర్ భారతదేశానికి అన్ని ఫార్మాట్లలో ప్రాతినిధ్యం వహించాడు మరియు తన మాజీ కెకెఆర్ కోచ్, ప్రస్తుత భారత జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ నమ్మకాన్ని సంపాదించాడు. 2025 ఐపీఎల్‌లో 13 మ్యాచ్‌ల్లో 29.86 సగటుతో అతను 15 వికెట్లు పడగొట్టాడు, అయితే 2024లో అతని ప్రదర్శన చాలా మెరుగ్గా ఉంది. 2026 ఐపీఎల్‌కు ముందు కెకెఆర్ రాణాను నిలుపుకోవచ్చు.కుడిచేతి వాటం ఫాస్ట్ బౌలర్ వైభవ్ అరోరా ఐపీఎల్ 2025లో కెకెఆర్‌లో అగ్రగామి వికెట్ టేకర్‌గా తనను తాను స్థిరపరచుకున్నాడు. హర్షిత్ రాణా మాదిరిగానే, అతను 2024లో కూడా అద్భుతమైన సీజన్‌ను సాధించాడు మరియు మెగా వేలంలో ?1.80 కోట్లకు తిరిగి కొనుగోలు చేయబడ్డాడు. అరోరా 12 మ్యాచ్‌ల్లో 17 వికెట్లు పడగొట్టి కెకెఆర్ జట్టులో అంతర్భాగంగా స్థిరపడ్డాడు. ఇప్పటివరకు 40 IPL మ్యాచ్‌ల్లో అతను 36 వికెట్లు పడగొట్టాడు. రింకు సింగ్‌ను ?13 కోట్లకు అట్టిపెట్టుకుంది. గత సీజన్‌లో ఫినిషర్‌గా రింకు సింగ్ పేలవంగా ఆడాడు. 2023లో 474 పరుగుల సీజన్‌తో తనను తాను స్థిరపరచుకున్న తర్వాత, ఉత్తరప్రదేశ్ బ్యాట్స్‌మన్ నిలకడగా పేలవంగా ఆడాడు. 2025లో, అతను 13 మ్యాచ్‌ల్లో 29.42 సగటుతో 206 పరుగులు మాత్రమే చేయగలిగాడు. అయితే, రింకు సింగ్‌ను వదులుకునే మూడ్‌లో లేదు. వారు అతన్ని భవిష్యత్ ఫినిషర్‌గా చూస్తారు. 21 ఏళ్ల అంగ్‌క్రిష్ రఘువంశీ 2025 సీజన్‌లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు, 12 మ్యాచ్‌ల్లో 33.33 సగటుతో 300 పరుగులు చేశాడు. అతను అత్యంత నమ్మకమైన బ్యాట్స్‌మెన్‌లలో ఒకడు మరియు తన విలువను పదే పదే నిరూపించుకున్నాడు. ఈ ముంబై బ్యాట్స్‌మన్ ఇప్పటివరకు లీగ్‌లో కేవలం రెండు హాఫ్ సెంచరీలు మాత్రమే చేశాడు. అతను జట్టు కీలక బ్యాట్స్‌మెన్‌లలో ఒకరిగా స్థిరపడ్డాడు మరియు అతను ఉండటం దాదాపు ఖాయం.

# రజనీకి అరుదైన గౌరవం

## అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో సన్మానం

భారతీయ చలనచిత్ర పరిశ్రమకు సుదీర్ఘకాలం పాటు విశిష్ట సేవలు అందించిన సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు అరుదైన గౌరవం దక్కనుంది. ఇటీవల నట జీవితంలో 50 ఏళ్ల ఘన ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా 56వ అంతర్జాతీయ చలనచిత్ర ఉత్సవం ముగింపు వేడుకలో రజనీకాంత్‌ను సన్మానించనున్నారు. ఈ సన్మానం ఐఎఫ్‌ఎఫ్ఐకి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుండగా.. గోవా వేదికగా నవంబర్ 20 నుంచి 28 వరకు ఈ వేడుక జరుగనుంది. బస్ కండక్టర్‌గా జీవితం ప్రారంభించిన శివాజీ రావు గైక్వాడ్ అలియాస్ రజనీకాంత్? 1975లో లెజెండరీ దర్శకుడు కె. బాలచందర్ రూపొందించిన 'అపూర్వ రాగంగళ్' చిత్రంతో నట జీవితాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి వెనుదిరిగి చూడకుండా, తనదైన స్టైల్‌తో, విలక్షణమైన పాత్రలతో కోట్లాది మంది అభిమానుల హృదయాలలో చెరగని ముద్ర వేశారు. తన యాక్షన్, స్టైలింగ్‌తో ఇండియా అంతటా సూపర్‌స్టార్‌గా గుర్తింపు సాధించాడు. ఇక ఈ ఎఈఈవ వేడుకల్లో గురు దత్, రాజ్ ఖోస్లా, రిత్విక్ ఘటక్, పి. భానుమతి, భూపేన్ హజారికా వంటి పలు దిగ్గజ కళాకారుల శత జయంతి వేడుకలు కూడా జరగనున్నాయి. ఈ తొమ్మిది రోజుల ఉత్సవంలో 81 దేశాల నుండి 240కి పైగా చలనచిత్రాలను ప్రదర్శించనున్నారు.



# ఎస్..విజయ్‌ను పెళ్లి చేసుకోబోతున్నా

## తనకోసం నిలబడే వ్యక్తి కావాలనుకున్నా

ఎట్టకేలకు రష్మిక తన పెళ్లిపై క్లారిటీ ఇచ్చారు. నటుడు దేవరకొండ విజయ్‌ను విశాహం చేసుకో బోతున్నట్లు చెప్పారు. అలాగే ఎంగేజ్‌మెంట్ విషయంలో మీరు అనుకున్నదే నిజమని ఒప్పుకున్నారు. తన కోసం యుద్ధం చేసే జీవిత భాగస్వామి కావాలని నటి రష్మిక తాజాగా ఓ చిట్‌చాట్‌లో తెలిపారు. వరుస సినిమాలు, విజయ్ దేవరకొండతో నిశ్చితార్థం వార్తలతో గతకొన్ని రోజులుగా నిత్యం రష్మిక ట్రెండింగ్‌లో ఉంటోన్న విషయం తెలిసిందే. తాజాగా ఒక యూట్యూబ్ ఛానల్ చిట్‌చాట్‌లో ఆమె పాల్గొన్న సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు ఆసక్తికర సమాధానం చెప్పారు. తన భాగస్వామి ఎలా ఉండాలని కోరుకుంటున్నారో చెప్పాలని ఒక అభిమాని కోరగా రష్మిక నవ్వుతూ దానికి సమాధానమిచ్చారు. ప్రపంచం మొత్తం తనకు వ్యతిరేకంగా ఉన్నా కూడా తన కోసం నిలబడే జీవిత భాగస్వామి కోసం వెతుకుతున్నట్లు వివరించారు. నిజాయితీగా చెప్పాలంటే నన్ను లోతుగా అర్థం చేసుకునే వ్యక్తి. ప్రతి విషయాన్ని నావైపు నుంచి ఆలోచిస్తూ అర్థం చేసుకోవాలి. అన్ని పరిస్థితులను ఎదుర్కొనే వ్యక్తి.. ఎలాంటి దాన్నైనా అర్థం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్న వ్యక్తిని నేను కోరుకుంటున్నాను. మంచి వ్యక్తిత్వం ఉన్న మనిషి, నాకోసం యుద్ధం చేయగల వ్యక్తి కావాలి. అలాంటి భాగస్వామి కోసం నేను ఎంత దూరమైనా వెళ్తాను. యుద్ధంలో తూటాకైనా ఎదురెళ్తా అని రష్మిక తెలిపారు. ఒకవేళ మీరు డేట్ చేస్తే ఎవరితో చేస్తారు? పెళ్లి చేసుకుంటే ఎవరిని చేసుకుంటారు? అని మరో అభిమాని అడగ్గా.. డేట్ చేస్తే యానిమేషన్ క్యారెక్టర్ నరుటోతో చేస్తా. ఎందుకంటే నాకు నరుటో పాత్ర చాలా ఇష్టం. పెళ్లి చేసుకుంటే విజయ్‌ని చేసుకుంటా అని చెప్పారు. ఈ సమాధానంతో ఆడియన్స్ అందరూ పెద్దగా అరుస్తూ కంగ్రాట్స్ చెప్పారు. రష్మిక థాంక్స్ చెప్పారు. అక్టోబర్ 3న రష్మిక, విజయ్‌ల నిశ్చితార్థం జరిగినట్లు వార్తలు వచ్చాయి. ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించనప్పటికీ ఈ మధ్య పలు ఇంటర్వ్యూల్లో రష్మిక పరోక్షంగా స్పందించారు. 'నా ఎంగేజ్‌మెంట్ విషయంలో మీరు ఏం అనుకుంటున్నారో అదే నిజం. సమయం వచ్చినప్పుడు వెల్లడిస్తా' అని అన్నారు. ఇప్పుడు విజయ్‌తో పెళ్లి విషయంలో స్పష్టమైన సమాధానమిచ్చారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వీరి పెళ్లి జరగనున్నట్లు టాక్ వినిపిస్తోంది.




# ఆ నెంబర్ నాది కాదు.. రియాక్ట్ అవకండి

పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ కాంతార చాప్టర్1 మూవీతో దేశ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు నటి రుక్మిణి వసంత్. రీసెంట్ గా అమ్మడు తన పేరుతో జరుగుతున్న ఓ మోసంపై ఫ్యాన్స్ ను, ప్రజలను అప్రమత్తం చేశారు. ఓ గుర్తు తెలియని వ్యక్తి తన పేరుని వాడుకుని కొంతమందిని సంప్రదిస్తున్నాడని, అతడితో జాగ్రత్తగా ఉండాలని రుక్మిణి అందరికీ సూచించారు. ఈ విషయంలో రుక్మిణి తన సోషల్ మీడియాలో ఓ పోస్ట్ ను చేశారు. ఎంతో ముఖ్యమైన హెచ్చరిక అంటూ పోస్ట్ పెట్టారు రుక్మిణి. 944లిలిలి273 అనే నెంబర్ ను వాడుతున్న ఓ వ్యక్తి, తన పేరు చెప్పుకుంటూ తప్పుడు ఉద్దేశాలతో పలువురిని సంప్రదిస్తున్నారని తన దృష్టికి వచ్చిందని, తనకు, ఆ నెంబర్ కు ఎలాంటి సంబంధం లేదని, ఆ నెంబర్ నుంచి వచ్చే కాల్స్, మెసేజెస్ ఫేక్ అని, దయచేసి ఎవరూ వాటికి రియాక్ట్ అవొద్దంటూ రుక్మిణి కోరారు. ఇక సినిమాల విషయానికొస్తే రుక్మిణి వసంత్ ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న డ్రాగన్ మూవీలో హీరోయిన్ గా నటిస్తున్నారు. దీంతో పాటూ విజయ్ సేతుపతి- మణిరత్నం సినిమాతో పాటూ గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో యష్ హీరోగా తెరకెక్కుతున్న టాక్సిక్ లో కూడా ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు రుక్మిణి.





## జాన్వీకి పెద్ది అయినా బ్రేక్ ఇస్తాడా?

బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ గురించి కొత్తగా పరిచయం చేయనక్కర్లేదు. అతిలోక సుందరి శ్రీదేవి కూతురిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన జాన్వీ తక్కువ టైమ్ లోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. తన అందంతో గ్లామర్ ఇండస్ట్రీలో ఇప్పటికే తనదైన ముద్ర వేసుకున్న జాన్వీ కెరీర్ స్టార్టింగ్ లో పెద్దగా హిట్లు అందుకుంది లేదు. అయినప్పటికీ జాన్వీ గ్లామర్ కారణంతో మంచి ఆఫర్లు అందుకుంటూనే వస్తుంది. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే జాన్వీ దాదాపు పది సినిమాలు చేసింది. కానీ వాటిలో ఏ సినిమాతోనూ జాన్వీ నటిగా తన సత్తా ఏంటో ప్రూవ్ చేసుకోలేకపోయింది. ఇప్పటివరకు జాన్వీ చేసిన ఏ పాత్రా ఆమెలోని టాలెంట్ ను బయటకు తీసుకొచ్చే స్కోప్ ను ఇవ్వలేదు. సౌత్ లో ఎన్టీఆర్ తో చేసిన దేవర లో కూడా జాన్వీ గ్లామర్ కే పరిమితమైంది తప్పింది నటనకు ప్రాధాన్యత లేదు. దీంతో యాక్టింగ్ పరంగా జాన్వీ ఆడియన్స్ లో ఎలాంటి ఆదరణ అందుకోలేకపోయింది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు జాన్వీ తన ఆశలన్నింటినీ మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తో చేస్తున్న పెద్దిపై పెట్టుకుంది. బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కుతున్న పెద్దిలో జాన్వీ హీరోయిన్ గా కనిపించనుండగా, రీసెంట్ గా మూవీ నుంచి రిలీజైన చికిరి సాంగ్ లో ఆమె స్క్రీన్ ప్రెజెన్స్ ఆడియన్స్ ను విపరీతంగా ఆకట్టుకుంది. అంతేకాదు, పెద్ది మూవీలో జాన్వీ కోసం బుచ్చిబాబు చాలా మంచి పాత్రను రాశారని, పెద్దిలో జాన్వీ క్యారెక్టర్ కథను ముందుకు నడిపే విధంగా ఉంటూనే, ఆ పాత్రకు చాలా వెయిట్ ఉంటుందని అంటున్నారు. ఇప్పటికే చికిరి సాంగ్ మిలియన్ల వ్యూస్ ను అందుకుని చార్ట్‌బస్టర్ గా నిలవగా, చరణ్ డ్యాన్స్ మూమెంట్స్, జాన్వీ గ్లామర్ సాంగ్ ను రిపీట్స్ లో చూసేలా చేస్తున్నాయి. చూస్తుంటే జాన్వీ ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న బ్రేక్ పెద్ది మూవీతో దక్కేట్టుంది.




# చక్‌దే ఎక్స్‌ప్రెస్ విడుదలలో కదలిక

మహిళల వన్డే ప్రపంచ కప్‌ను టీమ్‌ఇండియా సగర్వంగా సొంతం చేసుకొని చరిత్ర సృష్టించింది. ఈ నేపథ్యంలో అనుష్క శర్మ నటించిన 'చక్‌దే ఎక్స్‌ప్రెస్' మరోసారి చర్చనీయాంశమవుతోంది. అనుష్క శర్మ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా షూటింగ్ ఏడేళ్ల క్రితం పూర్తయినా ఇప్పటివరకూ విడుదలకు నోచుకోలేదు. అయితే, ఇటీవల మన అమ్మాయిలు ప్రపంచ కప్ సాధించిన నేపథ్యంలో ఈ సినిమా విడుదల చేయాలని అభిమానులు పోస్ట్‌లు పెట్టడంతో.. నిర్మాతలు దీన్ని రిలీజ్ చేయాలని భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా విడుదల కోసం నెట్‌ఫ్లిక్స్‌తో చిత్రబృందం చర్చలు కూడా జరిపినట్లు తెలుస్తోంది. 'చక్‌దే ఎక్స్‌ప్రెస్' కోసం అనుకున్న దానికంటే బడ్జెట్ ఎక్కువవడంతో అభిప్రాయ భేదాలు వచ్చి సినిమా విడుదల ఆగిపోయిందని ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే వన్డే ప్రపంచకప్‌ను భారత అమ్మాయిలు గెలుచుకున్న నేపథ్యంలో దీన్ని ఇప్పుడు విడుదల చేస్తే ఆదరణ సొంతమవుతుందని చిత్రబృందం భావించినట్లు తెలుస్తోంది. ఈ నెలలోనే దీనిపై తుదినిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. భారత దిగ్గజ మహిళా క్రికెటర్ ఝులన్ గోస్వామి జీవితం ఆధారంగా.. అనుష్కశర్మ ప్రధాన పాత్రధారిగా 'చక్‌దే ఎక్స్‌ప్రెస్' రూపొందింది. ఈ చిత్రానికి ప్రొసిత్‌రాయ్ దర్శకత్వం వహించగా, కర్నేష్ శర్మ నిర్మాతగా వ్యవహరించారు. హర్మన్‌ప్రీత్ కౌర్ సేన ప్రపంచకప్ గెలిచినప్పుడు ఈ సినిమాను విడుదల చేయాలని కోరుతూ అభిమానులు పోస్ట్‌లు పెట్టిన విషయం తెలిసిందే.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**